సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 311

గురువారం 1-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



టాప్ ర్యాంక్‌లో అశ్విన్...

ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్. అగ్ర స్థానంలోనే భారత స్పిన్నర్ - 12లో



బడ్జెట్‌కు ముందు లాభాలు

సెన్సెక్స్ లాభం 612 పాయింట్లు.. 21,700 స్థాయిపైకి నిఫ్టీ - 13లో



ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష

తోషఖానా కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు, ఆయన భార్యకు కోర్టు 14 ఏళ్ల చొప్పున జైలుశిక్ష విధించింది.

- వివరాలు 6లో



కేజ్రీవాల్‌కు ఐదోసారి సమన్లు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తమ ఆఫీస్‌కు రావాలని మరోసారి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ ఆదేశించింది.

- వివరాలు 6లో



'పేటీఎం'కు ఆర్‌బీఐ షాక్

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఫిబ్రవరి 29 నుంచి డిపాజిట్ల స్వీకరణ సహా ఇతర అన్ని సర్వీసులు నిలిపివేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది.

- వివరాలు 13లో



రాహుల్ న్యాయ్‌యాత్రలో అపశ్రుతి

భారత్ జోడో న్యాయ్‌యాత్ర పశ్చిమబెంగాల్‌లోకి మరోసారి అడుగుపెట్టిన వేళ రాహుల్ గాంధీ కారు అద్దం పగిలిన ఘటన జరిగింది.


- వివరాలు 6లో

కొన్నారు.. తిన్నారు!

ఫార్మా సిటీ మాటున పెద్దల భూదందా.. తక్కువకు కొని అధిక ధరకు అప్పగింత!

- గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటవుతోందనే విషయం తెలియగానే పావులు కదిపిన ఉన్నతాధికారులు, నాయకులు
- రంగారెడ్డి జిల్లాలోని నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, కుర్మిద్ద, తాడిపర్తి తదితర గ్రామాల్లో వ్యవసాయ భూములపై కన్ను
- రైతుల్ని మభ్యపెట్టి, బెదిరించి కుటుంబసభ్యులు, బినామీల పేరిట తక్కువ రేటుకు కొనుగోలు
- పట్టా భూముల పక్కనే ఉన్న ప్రభుత్వ భూములు కూడా తమ ఖాతాల్లో జమ
- భూసేకరణ సమయంలో పదింతల ధరకు సర్కారుకు అప్పగింత
- కోట్లకు పడగలెత్తిన ఓ మాజీ ఐపీఎస్ సహా పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు
- మాజీ సీఎస్ భూ కొనుగోళ్లపై సర్కారు ఆరా.. రికార్డులు స్వాధీనం

సాక్షి, రంగారెడ్డి జిల్లా/యాచారం: ప్రతిష్టాత్మక సంస్థలు, పారిశ్రామిక వాడలు, ప్రాజెక్టుల ఏర్పాటు సమాచారం ప్రభుత్వంలోని పెద్దలు, ఉన్నతాధికారులకు ముందే తెలియడం సహజం. అయితే దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడైనా, ఏదైనా భారీ ప్రాజెక్టు/ సంస్థ రాబోతుందంటే చాలు చకాచకా పావులు కదపడం, ఆ ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న భూముల్ని గుట్టుచప్పుడు కాకుండా తక్కువ ధరకు కుటుంబసభ్యులు, బినామీల పేరిట కొనేయడం, సదరు ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చగానే ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అప్పగించేసి కోట్లకు పడగలెత్తడం.. విషయం తెలి సిన రైతులు లబోదిబో మనడం.. ఇదీ ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న తంతు. ప్రతిష్టాత్మక హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ విషయంలోనూ ఇదే జరిగింది. ఫార్మాసిటీ వాసన పసిగట్టిన 'పెద్ద గద్దలు' చురుగ్గా కదిలాయి. దాని చుట్టూ వాలిపోయాయి. స్థానిక రైతుల్ని కాలుష్యం పేరిట, ప్రభుత్వం భూమి సేకరించబోతుందంటూ మభ్యపెట్టాయి. ప్రభుత్వంలోని పలువురు ఉన్న తాధికారులతో పాటు పలువురు ప్రభుత్వ పెద్దలు ప్రతిపాదిత ఫార్మాసిటీ చుట్టూ పెద్ద ఎత్తున భూములు తక్కువ ధరకు కొనుగోలు చేశారు. పట్టా భూములు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కూడా వారి ఖాతాల్లో జమ చేసుకున్నారు. ఆ తర్వా త ఈ భూములనే ఫార్మాసిటీ భూ సేకరణలో భాగంగా ప్రభుత్వానికి అధిక ధరకు అప్పగించి పెద్దెతున లబ్ధి పొందారు. అప్పటివరకు తమ చేతు ల్లో ఉన్న నల్లధనాన్ని తెల్లధనంగా మార్చేసుకున్నా రు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి, ఇప్పటి ఓ మంత్రి సైతం ఫార్మాసిటీ చుట్టూ పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేయడం గమనార్హం. భూదాన్ భూములకూ కొందరు ఎసరు పెట్టడం కొసమెరుపు.



కొత్తపల్లిలో ఉన్నతాధికారులు కొన్న వ్యవసాయ భూములు

కుటుంబసభ్యులు, బినామీల పేరిట దందా

2017లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూర్, కడ్తాల్, ఆమనగల్ మండలాల్లోని పది గ్రామాల పరిధిలో 19,333 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు ఇప్పటికే 12,300 ఎకరాల భూసేకరణ కూడా పూర్తైంది. భూముల ధరలు తక్కువగా ఉండటం, ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటించడంతో దేశవిదేశాలకు చెందిన 500కు పైగా

మిగతా 2వ పేజీలో ▶

ఏడాదిలో ఉద్యోగాల భర్తీ



నియామకపత్రం అందిస్తూ ఆశీర్వదిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి

- వివిధ శాఖల్లో మొత్తంగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం..
- 'స్టాఫ్ నర్స్'నియామకపత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ వాళ్లు కుళ్లుకున్నా, ఏడ్చినా ఉద్యోగాల భర్తీ కొనసాగిస్తామని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో వచ్చే ఏడాదికాలంలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పోలీసుశాఖలో త్వరలో 15 వేల ఉద్యోగ నియామకాలకు చర్యలు చేపడతామని, పోలీసు నియామకాల బోర్డు ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. దీనితోపాటు వైద్యారోగ్య శాఖ పరిధిలోని వివిధ కేటగిరీల్లో 5వేల ఉద్యోగాలకు కూడా ప్రకటనలు ఇస్తామని.. తర్వాత తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా వేగంగా ఉద్యోగాల భర్తీ చేపడతామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ పరిధిలోని స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు అర్హత పొందిన 6,956 మందికి బుధవారం ఎల్బీ స్టేడియంలో సీఎం ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్ మాట్లాడారు.

కాంగ్రెస్‌తో ఉద్యోగాలు..

నిరుద్యోగుల కలల సాకారమే తెలంగాణ రాష్ట్రమని.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్లపాటు నిరుద్యోగులు దగాపడ్డారని రేవంత్

మిగతా 2వ పేజీలో ▶

నంది కాదు కానీ.. గద్దర్ అవార్డులు

- కవులు, కళాకారులు, సినీ ప్రముఖులను గౌరవించుకుంటాం
- గద్దర్ జయంతి రోజున ఆయన పేరిట పురస్కారాలిస్తాం
- నా మాటే శాసనం...మా మాటే జీఓ: సీఎం రేవంత్‌రెడ్డి
- రవీంద్రభారతిలో ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు
- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

6,100 పోస్టులతో ఏపీలో మెగా డీఎస్సీ



ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 6,100 పోస్టులతో మెగా డీఎస్సీ-2024 రానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూనే టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

- వివరాలు 10లో

ఎమ్మెల్యేగా నేడు కేసీఆర్ ప్రమాణ స్వీకారం



బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.పార్టీ శాసనసభా పక్ష కార్యాలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్పీకర్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారు.

- వివరాలు 3లో

సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలి



లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్పెషల్ ఆఫీసర్లతో పాలన కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

- వివరాలు 3లో

మండలి సభ్యులుగా మహేశ్‌గౌడ్, బల్మూరి



ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మహేశ్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

- వివరాలు 3లో



బలమైన దేశంగా ఎదిగాం

- బాలరాముడి ప్రాణప్రతిష్ట, ఆర్థిక సంస్కరణల్లో కీర్తిప్రతిష్ట
- పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటన
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- మోదీ సర్కారు సాధించిన ఘనత ప్రస్తావన
- యువశక్తి, మహిళా శక్తి, రైతులు, పేదలు.. వికసిత్ భారత్‌కు నాలుగు మూలస్తంభాలు - 6లో



ఆత్మపరిశీలన చేసుకోండి

- పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకునే విపక్ష ఎంపీలకు ప్రధాని మోదీ హితవు
- భారత అభివృద్ధి ప్రయాణం ఆగదని వ్యాఖ్య - 6లో

"సభలో మాట్లాడే ప్రతి పదం చరిత్రలో ప్రతిధ్వనిస్తుంది. నిర్మాణాత్మక ఆలోచనలతో సభను సుసంపన్నం చేసిన వారినే ప్రజలు గుర్తుంచుకుంటారు."



పూజలు చేసుకోండి

➤ వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని ఆనుకుని ఉన్న వివాదాస్పద జ్ఞానవాపి మసీదు కేసు బుధవారం కీలక మలుపు తీసుకుంది. మసీదు సెల్లార్‌లోని హిందూ దేవతలను ఆరాధించేందుకు, పూజా కార్యక్రమాలు చేసుకునేందుకు అనుమతినిస్తూ వారణాసి జిల్లా కోర్టు బుధవారం ఉత్తర్వులిచ్చింది. పూజా కార్యక్రమాలకు అనువుగా ఏర్పాటు పూర్తిచేయాలని ఆదేశించింది. ప్రపంచ ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న కాశీ విశ్వనాథ్ ట్రస్టుకు పూజల బాధ్యతలు అప్పగించింది. -6లో



పద్దుల చిట్టా విప్పేది నేడే

- మోదీ 2.0 సర్కార్ చివరి బడ్జెట్
- నేడు ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మల
- పార్లమెంట్‌లో ఉదయం 11 గంటలకు..
- కీలక ప్రకటనలపై పెరిగిన ఉత్కంఠ - 6లో

ఏపీలో మరికొన్ని స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు

- మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు నియామకం
- ఐదో జాబితా ప్రకటించిన విద్యాశాఖ మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఇప్పటిదాకా 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల ఎంపిక పూర్తి
- ప్రజాభిప్రాయానికి పట్టం.. సామాజిక న్యాయం.. యువతకు పెద్దపీట - 10లో



ప్రైవేట్ విద్యాదోపిడీకి చెక్ పెట్టాలి..



- ప్రతిపాదనలు ఆ విధంగా ఉండాలి
- ఇష్టానుసారం ఫీజుల వసూలుకు అడ్డుకట్ట వేయాలి
- బడ్జెట్‌పై విద్యాశాఖ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష
- రూ.15 వేల కోట్లతో విద్యాశాఖ బడ్జెట్ ప్రతిపాదనలు - 2లో



బడ్జెట్‌లో ధరలు పెరుగుతాయని తీసుకొచ్చారు సరే! ఒకవేళ వీటి ధరలే తగ్గితే ఎలాగండీ!

ఛత్తీస్‌గఢ్‌లో మావోల బంకర్లు

మొదటిసారి గుర్తించిన పోలీసులు..



ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మావోయిస్టులు నిర్మించిన బంకర్లు.. - వివరాలు 6లో

జార్ఖండ్ సీఎం సోరెన్ అరెస్టు

- మనీ లాండరింగ్ కేసులో అదుపులోకి తీసుకున్న ఈడీ
- నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న అధికారులు
- అరెస్టు కంటే ముందే సీఎం పదవికి హేమంత్ రాజీనామా
- కొత్త సీఎంగా జేఎంఎం సీనియర్ నేత చంపయ్ సోరెన్
- ప్రతిపాదించిన జేఎంఎం కూటమి నేతలు



హేమంత్ సోరెన్



చంపయ్ సోరెన్

➤ జార్ఖండ్ రాజకీయాలు అనూహ్య మలుపు తిరిగాయి. భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఈడీ అధికారులు జార్ఖండ్ ముక్తి మోర్చా కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను బుధవారం రాత్రి 9.30కి అరెస్టు చేశారు. దాదాపు 7 గంటల పాటు అధికారులు సుదీర్ఘంగా విచారించారు. గురువారం ఉదయం ఆయనను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. అరెస్టుకు ముందే హేమంత్ సోరెన్ జార్ఖండ్ సీఎం పదవికి రాజీనామా చేశారు. మరోవైపు ఈడీ విచారణను వ్యతిరేకిస్తూ పెద్దసంఖ్యలో జేఎంఎం నేతలు, కార్యకర్తలు రాంచీకి చేరుకున్నారు. కాగా, ఈడీ అధికారులపై హేమంత్ సోరెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. - 6లో

'బెస్ట్ ఠాణా'లో 85 మంది బదిలీ

- పంజగుట్ట పీఎస్ నుంచి వీరంతా సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్
- వరుస వివాదాల నేపథ్యంలో సీపీ శ్రీనివాస్‌రెడ్డి సంచలన నిర్ణయం
- దేశ పోలీస్ చరిత్రలో ఇలాంటి నిర్ణయం ఇదే తొలిసారి.. కొందరు అధికారులు సిబ్బంది తీరుతో వివాదాలకు కేంద్రంగా ఠాణా





సీపీ శ్రీనివాసరెడ్డి

సాక్షి, హైదరాబాద్: పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న 85మందిని ఒకేసారి బదిలీ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ ఠాణాలో మొత్తం 130 మంది పనిచేస్తుండగా, ఇప్పటికే ఇన్‌స్పెక్టర్ బి.దుర్గారావు సస్పెండ్ అయ్యారు. తాజాగా ఎస్‌ఐ నుంచి కానిస్టేబుల్ వరకు ఇక్కడ పనిచేస్తున్న మహిళ సిబ్బంది సహా 85 మందిని బదిలీ చేసి సీఏఆర్(సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు) హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సీపీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో వివిధ ఠాణాల నుంచి 82 మందిని నియమించారు. దేశ పోలీస్ చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారని ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

మసకబారిన ఠాణా ప్రతిష్ట ..

నగరంలోని అత్యంత కీలకమైన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ ఏ గ్రేడ్ కేటగిరీలో ఉంది. కొన్నాళ్ల క్రితం వరకు సీఎం నివాసం, క్యాంపు కార్యాలయం దీని పరిధిలోనే ఉండేవి. అనేక కీలక ప్రాంతాలు, బడా వ్యాపార సంస్థలు, జ్యువెలరీ షాపులు, పోలీసు ఉన్నతాధికారుల క్వార్టర్స్... ఇలా విస్తరించి ఉన్న ఈ ఠాణాలో ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు భారీ డిమాండ్ ఉండేది. కొన్నిసార్లు సీఎం కార్యాలయ అధికారుల చేతిలోనే ఈ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్ ఉండేది. పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు 2018లో దేశవ్యాప్త గుర్తింపు వచ్చింది. వివిధ రాష్ట్రాలు,

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...



బుధవారం మేడారం జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, మంత్రి కొండా సురేఖ తదితరులు

వసంత పంచమి మహోత్సవంలో పాల్గొనండి

మంత్రి సురేఖకు బాసర ఆలయ అధికారులు, అర్చకుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖను బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అధికారులు, అర్చకులు బుధవారం సచివాలయంలో కలిశారు. ఈనెల 14న బాసరలో శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి జన్మదినం అయిన వసంత పంచమి మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానించారు. వసంత పంచమిని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి హోదాలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కమిషనర్ జ్యోతి, ఈవో విజయ రామారావు, ప్రధానార్చకుడు సంజీవ్ పాల్గొన్నారు.

గద్దర్ అవార్డు ప్రకటన హర్షణీయం: దయాకర్

సాక్షి, హైదరాబాద్: కవులు, కళాకారులకు ఇచ్చే అవార్డులను గద్దర్ పేరిట ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఈ ప్రకటన కళాకారులకు లభించిన అరుదైన గౌరవమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఏర్పాటులో గద్దర్ పాట పునాదిరాయి అని, అలాంటి వ్యక్తి జయంతి వేడుకల్లో చేసిన ఈ ప్రకటన చిరస్థాయిలో నిలిచిపోతుందన్నారు.

అర్హులకు లబ్ధి జరగకపోతే అధికారులే బాధ్యులు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభితో కలిసి బైక్‌పై వెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ఖమ్మం మయూరిసెంటర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వేగంగా పరిష్కరించడమే కాక ప్రభుత్వ ఫలాలను అర్హులకు దరిచేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్లలో బుధవారం ఉదయం కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి పర్యటించారు. ఆయా డివిజన్లలో బైక్‌పై తిరుగుతూ స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ పథకాలు అందకపోతే అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

తెలంగాణ అకౌంటెంట్ జనరల్‌గా మాధవి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ (ఆడిట్)గా పి.మాధవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2001 ఇండియన్ ఆడిట్, అకౌంట్ సర్వీస్ బ్యాచ్‌కు చెందిన మాధవి ప్రస్తుతం కంప్ట్రోలర్ ఆడిట్ జనరల్ స్థాయి హోదాలో ఉన్నారు. గతంలో మహారాష్ట్ర ఏజీగా, చెన్నై రీజినల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డైరెక్టర్‌గా, ఆడిట్ ప్రిన్సి పాల్ డైరెక్టర్‌గా పనిచేశారు. కొలంబో, పోర్ట్ లూయిస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్, న్యూయార్క్‌లోని యూఎన్ మిషన్ ఫర్ ఎబో లా ఎమర్జెన్సీ రెస్పాన్స్‌లోనూ ఆడిట్ విధులు నిర్వర్తించారు.

సోనియాతో వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ భేటీ

లోక్‌సభ టికెట్‌కు వినతి



సోనియాగాంధీని సత్కరిస్తున్న రవి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధినేత్రి సోనియా గాంధీని వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట రవి బుధవారం ఢిల్లీలో కలిశారు. ఆయన వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ స్థానాన్ని ఆశిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఒక నిరుపేద దళిత కుటుంబం నుంచి రిజిస్ట్రార్ స్థాయికి ఎదిగిన పరిస్థితులను సోనియాకు వివరించానని తెలిపారు. తనకు కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయిస్తే అందరి దీవెనలతో గెలుస్తానని తెలిపినట్టు పేర్కొన్నారు.

నందికాదు కానీ.. గద్దర్ అవార్డులు

కవులు, కళాకారులు, సినీ ప్రముఖులను గౌరవించుకుంటాం

- గద్దర్ జయంతి రోజున ఆయన పేరిట పురస్కారాలు ఇస్తాం
- నా మాటే శాసనం... మా మాటే జీఓ : సీఎం రేవంత్‌రెడ్డి
- రవీంద్రభారతిలో ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు



'తరగని గని గద్దర్' పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, సూర్యకిరణ్, వెన్నెల

గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్): వచ్చే ఏడాది గద్దర్ జయంతి రోజున ప్రభుత్వం తరఫున కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు గద్దర్ పురస్కారాలు ప్రదానం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 'ఇటీవల సినీ ప్రముఖులు నన్ను కలిశారు. గత ప్రభుత్వాలు నంది అవార్డులు ఇచ్చాయని, వాటిని పునరుద్ధరించాలని అడిగారు. నంది అవార్డులు కాదుగానీ, మా ప్రభుత్వం గద్దర్ పేరిట అవార్డులు ఇస్తుంది..బాహుబలిలో శివగామి శాసనం మాదిరి ఈ వేదికగా చెబుతున్న ఈ ప్రకటనే శాసనం, జీఓ'అని సీఎం తెలిపారు. బుధవారం రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గద్దర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఏర్పడాలన్న గద్దర్ మాటలే తమకు స్ఫూర్తి అన్నారు. సమాజాన్ని చైతన్యం చేసేందుకు గజ్జెకట్టి గళం విప్పిన గొప్పవ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ఆయనతో మాట్లాడితే వెయ్యి ఏనుగుల బలం వచ్చిందని, ఆ బలంతోనే గడీల ఇనుప కంచెలను బద్దలు కొట్టామని తెలిపారు. దళితుడిని సీఎంను చేస్తానని మాట ఇచ్చి కేసీఆర్ మోసం చేశారని, ప్రజాప్రభుత్వంలో జ్యోతిరావుపూలే విగ్రహం కోసం ఎమ్మెల్సీ కవిత వచ్చి ఆ దళితుడికే వినతి పత్రం ఇచ్చిందన్నారు. ప్రజాప్రభుత్వంలో ఎవరైనా వచ్చి వినతిపత్రం ఇచ్చే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసే విషయమై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఆరు నెలల్లో కేసీఆర్ సీఎం అవుతారని కొందరు కలలు కంటున్నారు

ఆరు నెలల్లో కేసీఆర్ సీఎం అవుతారంటూ కొందరు కలలు కంటున్నారని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అలాంటి ఆలోచన చేసేవారికి తెలంగాణ ప్రజలే ఘోరీ కడతారని స్పష్టం చేశారు. అది వారి ఒంటికి, ఇంటికి మంచిది కాదని హితవు పలికారు. ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని, ఐదు సంవత్సరాల పాటు సుస్థిరమైన పాలన అందించే బాధ్యత తమపై ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గద్దర్‌ను అవమానించిన ప్రగతిభవన్ గేట్లను బద్దలు కొట్టామని, దానిని ప్రజలకు అంకితం చేస్తూ ప్రజాభవన్‌గా మార్చామన్నారు. గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి, అందరం కలిసి నడుద్దామని, సామాజిక ప్రగతిశీలరాష్ట్రాన్ని నిర్మి ద్దామని పిలుపునిచ్చారు. అనంతరం 'పాటకు జీవకణం', 'తరగని ఘని'పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, గద్దర్ సతీమణి విమల, కుమారుడు సూర్యకిరణ్, కూతురు వెన్నెలఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ప్రొఫెసర్ కంచె ఐలయ్యతోపాటు వివిధ సంఘాల ప్రతినిధులు, గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

ఏడాదిలో ఉద్యోగాల భర్తీ



వేదికపై సీఎం రేవంత్‌తోపాటు స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులుకోమటిరెడ్డి, పొన్నం, దామోదర, భట్టి, సురేఖ, తుమ్మల తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. ''బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేవలం కేసీఆర్ కుటుంబీకులకే ఉద్యోగాలు వచ్చాయి. 2019 ఎన్నికల్లో కవిత నిజామాబాద్‌లో ఓడిపోతే వెంటనే ఎమ్మెల్సీని చేసిన కేసీఆర్.. రాష్ట్రంలోని నిరుద్యోగులను మాత్రం పట్టించుకోలేదు. ఇప్పుడు వాళ్ల ఉద్యోగాలు ఊడగొట్టడంతో రాష్ట్రంలోని చదువుకున్న యువతకు ఉద్యోగాలు వస్తున్నాయి. మేం అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న స్టాఫ్ నర్సు ఉద్యోగాల భర్తీ అంశాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ నా దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి.. వాటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించి, భర్తీ ప్రక్రియను వేగంగా పూర్తిచేశాం..''అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై తాము ప్రమాణ స్వీకారం చేసినది ఎల్బీ స్టేడియంలోనేని.. ఆ కార్యక్రమంతో తమ కుటుంబ సభ్యులు ఎంతో సంతోషపడ్డారని రేవంత్ చెప్పారు. నర్సులుగా ఎంపికైనవారి కుటుంబాల్లో అలాంటి సంతోషాన్ని చూసేందుకే ఇక్కడ నియామకపత్రాల పంపిణీ చేపట్టామన్నారు.

రోజుకు 16 గంటలకుపైగా పనిచేస్తున్నాం

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే ఉద్యోగాల భర్తీపై ప్రత్యేకదృష్టి పెట్టామని రేవంత్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన మొదలుపెట్టామని, కొత్త చైర్మన్, సభ్యులను నియమించామని చెప్పారు. శాఖలవారీగా ఉద్యోగ ఖాళీలు, భర్తీ ప్రక్రియపై మరింత దృష్టి పెడుతున్నామన్నారు. మంత్రులు రోజుకు సగటున 16 నుంచి 18 గంటలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం పనిచేస్తున్నారన్నారు. అలాంటి ప్రజా ప్రభుత్వాన్ని కొందరు ఉద్దేశపూర్వకంగా విమర్శిస్తున్నారని, వాటికి తాము వెరవబోమని వ్యాఖ్యానించారు. స్టాఫ్ నర్సులుగా ఎంపికైన వారి కళ్లలో ఆనందాన్ని చూసి ఫాంహౌజ్‌లోని వారు కుళ్లుకుంటారని విమర్శించారు. హరీశ్‌రావు ప్రజాప్రభుత్వంపై పిల్లి శాపాలు పెడుతున్నారని.. ప్రతిపక్ష నేత స్థానంలో ఉన్న కేసీఆర్ వెంటనే హరీశ్‌రావుకు గడ్డిపెట్టి నోరు మూయిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో 6,956 మందికి స్టాఫ్ నర్స్ నియామక పత్రాలు అందజేసి, వారితో ఉద్యోగ ప్రతిజ్ఞ చేయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్నాం: భట్టి విక్రమార్క

ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన మాటను ప్రజాప్రభుత్వం నిలబెట్టుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఇంత పెద్ద సంఖ్యలో స్టాఫ్ నర్సు ఉద్యోగాల భర్తీ గొప్ప విషయమన్నారు. ఇదే శాఖలో ఖాళీగా ఉన్న మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి కసరత్తు వేగవంతం చేశామని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిద్రం చేసిందని.. దీనిని గాడిన పెట్టేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని చెప్పారు. పైసా పైసా పోగు చేస్తూ పనిచేస్తున్నామన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి: రాజనర్సింహ

స్టాఫ్ నర్సుల్లో 88శాతం మహిళలు ఉండటం ఆనందంగా ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అత్యుత్తమ సేవలు అందించి ప్రభుత్వ వైద్య విభాగానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో వేగంగా స్టాఫ్ నర్సు నియామకాలు చేపట్టామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఎందరు డాక్టర్లు వచ్చినా రోగికి దగ్గరగా ఉండి సేవలు అందించేది నర్సులేనని చెప్పారు.

చిత్తడి నేలల పరిరక్షణ కీలకం

- లేకపోతే భవిష్యత్ తరాలు ప్రమాదంలో పడతాయి
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: జీవ వైవిధ్యానికి ఆలవాలంగా నిలిచే చిత్తడి నేలలను పరిరక్షించుకోకపోతే భవిష్యత్ తరాలు ప్రమాదంలో పడతాయని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. ఈ నేలల పరిరక్షణకు సమర్థవంతమైన కార్యాచరణ అమలు చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణలోని చిత్తడి నేలల పరిరక్షణ, గుర్తింపు తదితర అంశాలపై బుధవారం సచివాలయంలో అటవీ శాఖ మంత్రి, వెట్ ల్యాండ్స్ అథారిటీ చైర్మన్ కొండా సురేఖ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'రామ్ సర్ ఒప్పందం'లోని ప్రమాణాలకు అనుగుణంగా దేశంలో 75 సైట్లు ఉండగా, తెలంగాణలో ఒక్క సైట్‌నూ గుర్తించపోవడం విచారించాల్సిన విషయమని, గత ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఈ ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణలో మూడు నాలుగు సైట్లు గుర్తించే అవకాశాలున్నాయని అధికారులు ప్రస్తావించగా, ఆ దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చిత్తడి నేలల గుర్తింపునకు సంబంధించిన కార్యాచరణలో వేగం పెంచి వీలైనంత త్వరగా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. చిత్తడి నేలలను గుర్తించి, వాటి పరిక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒక్కొక్క శాఖ నుంచి నోడల్ అధికారి ఈ నేలలకు సంబంధించిన వివరాలను సేకరించి ఎక్స్‌పర్ట్ కమిటీకి సమర్పించాలని సూచించారు. సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీ ప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, అటవీ శాఖ అదనపు కార్యదర్శి, ఈవో మెడికల్ ప్లాంట్ బోర్డ్ బాలదేవి తదితరులు పాల్గొన్నారు.

కొన్నారు.. తిన్నారు!

▶ మొదటి పేజీ తరువాయి

ఫార్మా కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. అయితే ఏ ఏ సర్వే నంబర్లలో ఎంత భూమిని ఫార్మాసిటీ కోసం సేకరిస్తున్నారనే విషయం అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందే తెలియడంతో బినామీలను, కుటుంబ సభ్యులను రంగంలోకి దింపారు.

ఓ మాజీ ఐపీఎస్ రైతుల్ని బెదిరించి..!

ఓ మాజీ ఐపీఎస్ అధికారి నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో దాదాపు 400 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములను బినామీల పేర్లపై కొనుగోలు చేశారు. 2012 నుంచి 2016 మధ్యకాలంలో జరిగిన లావాదేవీల్లో భాగంగా ఎకరా రూ.లక్ష నుంచి రూ.రెండున్నర లక్షల లోపే కొనుగోలు చేశారు. ఆయా గ్రామాలకు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ భూములను విక్రయించడానికి స్థానిక రైతులు కొందరు నిరాకరించినా, బినామీల ద్వారా రైతులను బెదిరింపులకు గురి చేసి భూములు అమ్మేలా ఒత్తిళ్లు తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ అధికారి ఫార్మాసిటీ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైన వెంటనే బినామీల పేరిట ఉన్న 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమిని ఎకరం రూ.12.50 లక్షల చొప్పున ఫార్మాసిటీకి ఇచ్చేయడం గమనార్హం. కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్ గ్రామాల్లో కూడా వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని ఫార్మాసిటీకి ఇచ్చేసి నష్ట పరిహారం కింద రూ.కోట్లు సంపాదించారు. కేసీఆర్ సర్కార్‌లో చక్రం తిప్పిన కీలక అధికారులు కొందరు కొత్తపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో వందలాది ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేశారు. అప్పట్లో కొత్తపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని దాదాపు 300 ఎకరాలకు పైగా పట్టాభూమిని ఫార్మాసిటీకి తీసుకోవాలని రియల్ వ్యాపారులే ప్రభుత్వాన్ని కోరుతూ లేఖలు ఇవ్వడం గమనార్హం. కాగా తక్కువ ధరలకు వ్యవసాయ భూములు కొనుగోలు చేసి, అధిక ధరలకు ఫార్మాసిటీకి అప్పగించిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లపై మీర్‌ఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్‌లో అదనంగా ఎకరాల కొద్దీ ప్లాట్లు మంజూరు అయ్యాయి.

భూదాన్ భూమిని కొల్లగొట్టిన నేతలు

తాడిపర్తి రెవెన్యూ సర్వే నంబర్ 104లో 468.34 ఎకరాల భూమి ఉంది. దాని యజమానులు అప్పట్లో 250 ఎకరాలను భూదాన్ బోర్డుకు ఇచ్చారు. సదరు భూమిని తమ పేరున రికార్డుల్లో నమోదు చేయాల్సిందిగా 16/11/2005 లోనే భూదాన్‌బోర్డు ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ మేరకు పహణీల్లోనూ నమోదు చేశారు. అయితే ఓ మాజీ మంత్రి, మరో మాజీ ఎంపీ ఈ భూములను తమ బినామీ పేరున కొట్టేశారు. అంతేకాదు కొండలు, గుట్టలతో కూడిన ఈ భూమి సాగులో ఉన్నట్లు చూపించారు. భూ సేకరణలో భాగంగా ఈ భూములను ఫార్మాసిటీకి అప్పగించి ఎకరానికి రూ.16 లక్షల చొప్పున నష్టపరిహారం పొందారు. ఇలా ప్రభుత్వం నుంచి రూ.40 కోట్ల వరకు కొల్లగొట్టినట్లు తెలిసింది. అంతేకాదు మీర్‌ఖాన్‌పేటలో ఎకరానికి 121 గజాల ఇంటి స్థలాన్ని కూడా పొందారు. ఈ భూములకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందిన వారిలో స్థానికులు కాకుండా అంతా ఇతర ప్రాంతాలకు చెందిన నేతల బినామీలే ఉండటం గమనార్హం. ఈ అంశంపై తాడిపర్తి గ్రామస్తులు అప్పటి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పట్లో ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన ఓ అధికారి భూసేకరణ పేరుతో ప్రభుత్వ ఖజానాను భారీగా కొల్లగొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కొత్తపల్లి పరిధిలో మాజీ సీఎస్ కొనుగోళ్లు

మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ తన భార్య పేరున యాచారం మండలం కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 249, 260లలో 25.19 ఎకరాలు కొనుగోలు చేశారు. ఆ పక్కనే సర్వే నంబర్ 244 నుంచి 269 వరకు ఉన్న 125 ఎకరాలు తన కుటుంబ సన్నిహితులకు సంబంధించిన రియల్ ఎస్టేట్ సంస్థ పేరిట కొనుగోలు చేయించారు. ఈ సమయంలో ఆయన ప్రభుత్వంలో కీలకంగా (2016 నుంచి 2018 వరకు రెవెన్యూ ముఖ్య కార్యదర్శిగా, 2020 జనవరి నుంచి 2023 జనవరి వరకు సీఎస్‌గా పని చేశారు) ఉన్నారు. సాగుకు యోగ్యం లేని ఈ భూములకు రైతుబంధు పథకం కింద రూ.14 లక్షల వరకు లబ్ధి పొందినట్లు మాజీ సీఎస్‌పై ఆరోపణలు వెల్లువెత్తడం చర్చనీయాంశమయ్యింది. దీంతో ఈ భూముల కొనుగోలుపై కొత్త ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇబ్రహీంపట్నం ఆర్డీఓ బుధవారం యాచారం తహశీల్దార్ కార్యా లయానికి చేరుకుని పలు రికార్డులను వెంట తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా తాను నిబంధనల ప్రకారమే భూములు కొన్నానని, ఎక్కడా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ లేదని సోమేష్ చెబుతున్నారు.

మాజీ ఐపీఎస్ భూములు ఇచ్చింది వాస్తవమే

ఓ మాజీ ఐపీఎస్ అధికారి నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో దాదాపు 300 ఎకరాలు కొనుగోలు చేశాడు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వెచ్చించాడు. ఫార్మాసిటీ ఏర్పాటు కావడంతో నక్కర్తమేడిపల్లి గ్రామంలో కొనుగోలు చేసిన 200 ఎకరాలకు పైగా భూమిని ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున ఇచ్చేశాడు. ఆ అధికారి కొత్తపల్లి గ్రామంలో కూడా వందలాది ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.
పాశ్ఛ బాషా, మాజీ సర్పంచ్ నక్కర్త మేడిపల్లి

ప్రైవేట్ విద్యాదోపిడీకి చెక్ పెట్టాలి

- ప్రతిపాదనలు ఆ విధంగా ఉండాలి
- బడ్జెట్‌పై విద్యాశాఖ అధికారులతో భట్టి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ విద్యాదోపిడీకి చెక్ పెట్టేలా విద్యాశాఖ బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ విద్యావిధానాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులకు తెలిపారు. బడ్జెట్ రూపకల్పనలో భాగంగా విద్యాశాఖ ఉన్నతాధికారులతో భట్టి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యాశాఖ రూ.15 వేల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు డిప్యూటీ సీఎం ముందు ఉంచింది. పెరిగిన వేతనాలు, పెండింగ్ డీఏలకే రూ.11 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఉన్నత విద్యాశాఖకు గత ఏడాది రూ. 700 కోట్ల నిధులు కేటాయిస్తే, ఈసారి రూ. 2,500 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు పంపారు. యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీ కొరత, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుండటంతో నిధుల ప్రతిపాదన భారీగానే ఉంది. ఇంటర్ విద్యకు రూ.1,400 కోట్లు ప్రతిపాదించారు.

ఫీజుల నియంత్రణపై ప్రణాళిక

ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్న తీరుకు అడ్డుకట్ట వేయాలని భట్టి అధికారులకు సూచించారు. కార్పొరేట్ విద్యా సంస్థలపై ఆకస్మిక దాడులు చేపట్టాలని ఆదేశించారు. బాసర తరహాలో రాష్ట్రంలో మరోచోట ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతీ మండల కేంద్రంలో 10 ఎకరాల్లో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దీనికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు.

ప్రైవేట్ వర్సిటీతో ఎందుకు పోటీ పడటం లేదు

ప్రైవేట్ వర్సిటీలతో ప్రభుత్వ వర్సిటీలు ఎందుకు పోటీ పడటం లేదని అధికారులను భట్టి అడిగారు. ప్రైవేట్‌లో ఉన్న కోర్సులను ప్రభుత్వ వర్సిటీల్లోనూ ప్రవేశపెట్టాలన్నారు. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

టీ హబ్‌లో ఫ్రాన్స్ కాన్సులేట్



కాన్సులేట్ ప్రారంభోత్సవానికి మంత్రి శ్రీధర్‌బాబును ఆహ్వానిస్తున్న బెర్తెలోట్


- త్వరలోనే ప్రారంభిస్తామన్న కాన్సుల్ జనరల్ బెర్తెలోట్
- సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్, బెంగళూరు కాన్సుల్ జనరల్ థెయిరి బెర్తెలోట్ బుధవారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అనువైన వాతావరణం తదితర అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు కాన్సుల్ జనరల్ బెర్తెలోట్‌కు వివరించారు. రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమ విశేషాలను పంచుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ది బెస్ట్ మ్యాన్ పవర్ ఇచ్చే రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఫ్రాన్స్ కాన్సులేట్ హైదరాబాద్ కార్యాలయాన్ని త్వరలోనే టీ హబ్‌లో ప్రారంభించనున్నట్టు బెర్తెలోట్ మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఫ్రాన్స్ ఇండియా అంబాసిడర్ రానున్నట్టు తెలిపిన ఆయన మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించారు. భేటీలో ఐటీ, ఇండస్ట్రీస్ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ కూడా ఉన్నారు.

త్వరలోనే రాష్ట్రంలో టెలి పెర్ఫార్మన్స్ సంస్థల ఏర్పాటు

ఫ్రాన్స్‌కి చెందిన ప్రముఖ సంస్థ టెలి పెర్ఫార్మన్స్ ప్రతినిధులు మంత్రి డి శ్రీధర్ బాబుతో బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఆ సంస్థ ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఐటీసీ కోహినూర్‌లో నిర్వహిస్తున్న ఇమ్మెర్సివ్ ఈవెంట్‌కు అతిథిగా రావాలని ఆహ్వానించారు. దేశ వ్యాప్తంగా తమ సంస్థలో 90 వేల మంది ఉద్యోగులు, ప్రపంచ వ్యాప్తంగా 95 దేశాల్లో 5 లక్షల మందికి పైగా ఉద్యోగులు 300 పైగా భాషల్లో పనిచేస్తున్నారని మంత్రికి తెలిపారు. త్వరలోనే హైదరాబాద్‌తో పాటు ద్వితీయ శ్రేణి నగరాలుగా ఉన్న పలు జిల్లా కేంద్రాల్లో తమ సంస్థలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మమతా లంబ మంత్రి శ్రీధర్‌బాబుకి వివరించారు. టెలీ పెర్ఫార్మన్స్ సంస్థ పెట్టుబడులకు, సంస్థ కార్యకలాపాలకు ప్రభుత్వం తరుపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని శ్రీధర్ బాబు హామీనిచ్చారు. సమావేశంలో కంపెనీ ప్రతినిధులు శివ, ఫణిందర్ నల్లబెల్లి, స్వాతి పాల్గొన్నారు.

నియామక పత్రాల పేరిట ఆర్భాటం



- నర్సింగ్ ఆఫీసర్ల భర్తీని రేవంత్ తమ ఘనతగా చెప్పుకుంటున్నారు
- గ్రూప్–1 నోటిఫికేషన్ ఏమైంది?: మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను వంచించిందని ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన నర్సింగ్ ఆఫీసర్ల భర్తీ ప్రక్రియను తమ ఘనతగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఎల్బీస్టేడియం వేదికగా నర్సింగ్ ఆఫీసర్‌లకు నియామక పత్రాల అందజేత పేరిట ఆర్భాటం చేశారని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 50 రోజుల్లోనే స్టాఫ్‌నర్స్‌ల భర్తీ నోటిఫికేషన్ ప్రకటించి, నియామక పత్రాలు ఇచ్చారా? అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. సొమ్మొకడిది సోకు ఇంకొకడిది.. అన్నట్టు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడంలో రేవంత్ వ్యవహరించిన తీరునే తప్పు బడుతున్నామన్నారు.

గ్రూప్ 1 నోటిఫికేషన్ ఏమైంది?

'ఎన్నికల సమయంలో ఫిబ్రవరి 1న గ్రూప్–1 నోటిఫికేషన్ ఇస్తామన్న హామీ ఏమైంది? రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు పెంపు, రూ.500 సిలిండర్, 4,000 నెలవారీ పింఛన్, మహాలక్ష్మి ద్వారా రూ.2,500 పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగ భృతి వంటి హామీల లిస్టులో నేడు జాబ్ కేలెండర్ కూడా చేరింది'అని హరీశ్ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 1.65 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయగా, మరో 40 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉన్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీపై మీరు చేసిన వాగ్దానాన్ని నిలుపుకుంటే స్వాగతిస్తామన్నారు.

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి



- మాజీ మంత్రికి కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాగూర్ పరువు నష్టం నోటీసులు
- వారంలోగా లిఖితపూర్వకంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏఐసీసీ సీనియర్ నేత, ఎంపీ మాణిక్యం ఠాగూర్ పరువునష్టం దావా నోటీసులు పంపించారు. గత నెల 28న సిరిసిల్లలో జరిగిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యల్లో తన పేరు ప్రస్తావించడంపై మాణిక్యం ఠాగూర్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రజలు ఎన్నుకున్న సీఎం కాదని, మాణిక్యం ఠాగూర్‌కు రూ.50 కోట్లు ఇచ్చి, ఢిల్లీ నుంచి మేనేజ్‌మెంట్ కోటాలో పదవి తెచ్చుకున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే ఎలాంటి ఆధారాలు లేని ఈ వ్యాఖ్యల వల్ల దేశవ్యాప్తంగా తన పరువుకి నష్టం వాటిల్లిందని, తన రాజకీయ జీవితంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని మాణిక్యం ఠాగూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మాణిక్యం ఠాగూర్ తరుపున మధురైకి చెందిన న్యాయవాది ఆర్.అరవిందన్ బుధవారం కేటీఆర్‌కు పరువు నష్టం నోటీసులు పంపించారు. సిరిసిల్లలో చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ వారం రోజుల్లోగా లిఖిత పూర్వక క్షమాపణలను చెప్పాలని ఠాగూర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐపీసీ సెక్షన్లు 499, 500 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఠాగూర్ ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

పరువు నష్టం నోటీసులు కోమటిరెడ్డికి ఇవ్వండి

మాణిక్యం ఠాకూర్‌పై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు




సాక్షి, హైదరాబాద్: తనపై పరువు నష్టం దావా వేస్తానంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మాణిక్యం ఠాకూర్ చేసిన ప్రకటనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తనకు పంపే పరువు నష్టం నోటీసులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పంపిస్తే బాగుంటుందని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. పరువు నష్టం నోటీసులు తన చిరునామాకు కాకుండా తెలంగాణ ప్రభుత్వ సచివాలయంలో కూర్చున్న కోమటిరెడ్డి కార్యాలయానికి పంపాలని సూచించారు. మాణిక్యం ఠాకూర్‌కు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి రూ.50 కోట్లు ఇచ్చి టీపీసీసీ పదవి కొనుక్కున్నారని గతంలో కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని, రేవంత్ పీసీసీ పదవి కొనుక్కున్నారన్న వార్తలు పెద్దఎత్తున మీడియాలో వచ్చాయన్నారు. తాను అవే అంశాలను ప్రస్తావించానని కేటీఆర్ పేర్కొన్నారు. కోమటిరెడ్డి చేసిన ఆరోపణలను నేటికీ వెనక్కి తీసుకోలేదని చెప్పారు.

క్లుప్తంగా...

నేను గవర్నర్ బాధితుడిని

ఎమ్మెల్సీలుగా గరీబులకు స్థానం లేదా: మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ



సాక్షి, హైదరాబాద్: 'ఎరుకల జాతి నుంచి కనీసం ఎంపీటీసీ కూడా లేని పరిస్థితుల్లో నా సేవలను గుర్తించి కేసీఆర్ నన్ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. రాజ్యాంగ పరిరక్షకురాలిగా ఉండాల్సిన గవర్నర్.. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించి నా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని తిరస్కరించడం బాధ కలిగించింది. నేను గవర్నర్ బాధితుడిని' అని మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. '40 ఏళ్లుగా ఎలాంటి మచ్చ లేకుండా ప్రజా జీవితంలో ఉంటూ గతంలో సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలిచా. గవర్నర్ కోటాలో కోదండరాంకు ఉన్న అర్హత ఏమిటీ, నాకు లేనిది ఏమిటి. ఎరుకల జాతిని రేవంత్ అవమానించారు. సమాజంలో, శాసన మండలిలో మాలాంటి గరీబోళ్లకు స్థానం లేదా? మేము సీఎం దిష్టిబొమ్మలు తగలబెట్టలేమా? ఎరుకల కులానికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చే దమ్ము రేవంత్‌కు ఉందా. చిన్న కులాల నుంచి ఎదిగిన నేతలను విమర్శించే ముందు రేవంత్ సంయమనం పాటించాలి' అని కె.సత్యనారాయణ హెచ్చరించారు. ఎరుకల కులాన్ని కించపరిచేలా రేవంత్ మాటలు ఉన్నాయని, గవర్నర్ చేసిన తప్పును రేవంత్ తన వ్యాఖ్యల ద్వారా సమర్థించారని రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్షుడు కుతాడి రాములు అన్నారు.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వమిది



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల వ్యతిరేకిగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. ఆయన తెలంగాణ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీసం వేతనం రూ.18,019గా నిర్ణయిస్తే, తాజాగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ మాత్రం దీనిని తగ్గిస్తూ ఈ నెల 29న జీవో విడుదల చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం రూ.11,770గా నిర్ణయించడంతో కార్మికులు రూ.6వేలు నష్టపోతున్నారని విమర్శించారు. వేతనాలు తగ్గించేందుకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనాలు తగ్గిస్తూ కొత్త జీవోలను అమలు చేస్తే కార్మికవర్గం తిరగబడుతుందని కోరుకంటి చందర్ హెచ్చరించారు.

'ఎమ్మెల్సీ'లపై ఆటంకాలు సరికాదు



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటాలో నామినేటెడ్ ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్టు ఆమెర్ అలీ ఖాన్‌ల నియామకంపై బీఆర్ఎస్ ఆటంకాలు సృష్టించడాన్ని తెలంగాణ సమాజం హర్షించబోదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ సారథిగా ఉంటూ, సకల జనులను ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో మమేకం చేసిన కోదండరాం ఎమ్మెల్సీ కాకుండా అడ్డుకోవడం మంచిది కాదని బుధవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. సీనియర్ జర్నలిస్టు ఆమెర్ అలీఖాన్ నియామకంలో విషయంలో కూడా వ్యవహరించడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. తక్షణమే హైకోర్టులో బీఆర్ఎస్ నేతలు కేసును ఉపసంహరించుకొని, నామినేటెడ్ ఎమ్మెల్సీల నియామకానికి సహకరించడం ద్వారా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని కూనంనేని సూచించారు.

కాంగ్రెస్ పూర్తిగా చచ్చిపోయింది

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ కర్నె



సాక్షి, హైదరాబాద్: ఒకటి రెండు రాష్ట్రాలు మినహా దేశంలో ఎక్కడా అధికారంలోలేని కాంగ్రెస్‌పార్టీ.. పూర్తిగా చచ్చిపోయిందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అరువు తెచ్చుకున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిలో ఉన్నాననే సోయి లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి అసలే జరగనట్లు కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేంత వరకూ బీఆర్ఎస్ పార్టీ గుర్తు చేస్తూనే ఉంటుందన్నారు. కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావులపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను కర్నె ప్రభాకర్ ఖండించారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో అన్ని సీట్లు గెలిస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని రేవంత్ ప్రజలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు.

సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలి

- స్పెషల్ ఆఫీసర్లతో పాలన రాజ్యాంగ విరుద్ధం
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



బుధవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, చిత్రంలో ఈటల

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారంతో గ్రామ సర్పంచుల పదవీ కాలం ముగిసిందని ఆయన తెలిపారు. అయితే, స్పెషల్ ఆఫీసర్లతో పంచాయతీల్లో పాలన కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. 73వ రాజ్యాంగ సవరణను కాంగ్రెస్ పార్టీ అవమానిస్తోందని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామసభలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సర్పంచులే లేకపోతే గ్రామసభలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సర్పంచుల ఎన్నికలను నిర్వహించకపోవడం వెనక.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పక్కనపెట్టే ఆలోచన స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను దొడ్డిదారిన దారిమళ్లించిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

నేను ఎక్కడ పోటీ చేయాలనేది అధిష్టానం నిర్ణయిస్తుంది

తాను ఏ నియోజకవర్గం నుంచి పోటీచేయాలన్నది అధిష్టానం నిర్ణయిస్తుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ మేరకు ఎన్నికల ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నామని, ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ అంశాలపై చర్చించి 3న వివరాలు ప్రకటిస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా ఎంపీ అభ్యర్థుల నుంచి ఎలాంటి దరఖాస్తులు తీసుకోవడంలేదన్నారు.

బీజేపీలో చేరిక..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో వివిధ రంగాలకు చెందిన ముగ్గురు ప్రముఖులు బీజేపీలో చేరారు. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు ఎండీ సుధాకర్, ఖమ్మం జిల్లాకు చెందిన వ్యాపార వేత్త వినోద్‌రావు, కామారెడ్డి జిల్లాకు చెందిన సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డిలకు కిషన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలన చూసి తెలంగాణలోని మేధావులు, వివిధ రంగాలకు చెందిన వారు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు.

మండలి సభ్యులుగా మహేశ్ గౌడ్, బల్మూరి వెంకట్

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం



మహేశ్‌గౌడ్, బల్మూరి వెంకట్‌లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో బండా ప్రకాశ్, శ్రీధర్‌బాబు, దీపా దాస్‌మున్షీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటాలో శాసనమండలి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మహేశ్‌కుమార్ గౌడ్, బల్మూరు వెంకట్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసన మండలిలోని తన చాంబర్‌లో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఇటీవలి శాసనమండలికి జరిగిన ఎమ్మెల్యే కోటా ఎన్నికలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు బల్మూరు వెంకట్ ఎమ్మెల్సీలుగా ఎన్నికైన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యాయి. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, ప్రొఫెసర్ కోదండరాం, అమెర్ అలీ ఖాన్, రోహిణ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఎమ్మెల్యేగా నేడు కేసీఆర్ ప్రమాణ స్వీకారం

మధ్యాహ్నం 12.45కు అసెంబ్లీ స్పీకర్ సమక్షంలో..



సాక్షి, హైదరాబాద్: గజ్వేల్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బీఆర్ఎస్ సమాచారం ఇచ్చింది. కేసీఆర్ మధ్యాహ్నం 12 గంటలకు అసెంబ్లీకి చేరుకుని బీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం స్పీకర్ చాంబర్‌లో ఆయన సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తారు. శాసనసభలో ప్రతిపక్ష నేతగా కూడా కేసీఆర్ బాధ్యతలు స్వీకరిస్తారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కేసీఆర్ తొలిసారిగా శాసనసభకు వస్తుండటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్ 9న అసెంబ్లీ ప్రొటెమ్ స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తగా ఎన్నికైన వారిలో చాలా మంది ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే డిసెంబర్ 8న ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బాత్‌రూంలో కేసీఆర్ జారిపడగా తుంటి ఎముకకు గాయమైంది. ఈ నేపథ్యంలోనే ఆయన ప్రమాణ స్వీకారం ఆలస్యమైంది.

సర్పంచుల పదవీకాలం నేటితో ముగింపు

- ఇక స్పెషల్ ఆఫీసర్ల పాలన
- ఎంపీడీవోల ఆధ్వర్యంలో వారికి శిక్షణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 12,752 సర్పంచులు, గ్రామపంచాయతీ పాలకమండళ్ల ఐదేళ్ల పదవీ కాలం గురువారంతో ముగియనుంది. స్థానికసంస్థల ఎన్నికలు ముగిశాక 2019 జనవరి చివర్లో పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగుస్తోంది. వీరి స్థానాల్లో స్పెషల్ ఆఫీసర్లు పాలన చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. బుధవారం నాడు పలు గ్రామపంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యులకు వీడ్కోలు సమావేశాలు నిర్వహించి సన్మానించారు. ఇవి గురువారం కూడా కొనసాగనున్నాయి. కాగా, వివిధ ఆర్థికపరమైన కార్యకలాపాల నిర్వహణకు సంబంధించిన డిజిటల్ కీలను పంచాయతీ కార్యదర్శులు తీసుకున్నారు. ఇప్పటికే పంచాయతీ రికార్డ్ బుక్‌లకు కార్యదర్శులే కస్టోడియన్ కావడంతో అవి వారి వద్దే అందుబాటులో ఉన్నట్టు చెబుతున్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయిలో ఎంపీడీవోలు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారికి అవగాహన/శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

3న మంత్రితో వీడియో కాన్ఫరెన్స్

శనివారం (ఫిబ్రవరి 3న) జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జీపీలో ప్రత్యేక అధికారుల పాలన, వేసవి తాగు నీటి ప్రణాళికపై కార్యాచరణ, గ్రామీణ ఉపాధి హామీ, మహిళా స్వయంసహాయక సంఘాల కార్యకలాపాలు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తదితర అంశాలు చర్చకు రానున్నాయి.

వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలివ్వలేం

సర్పంచుల పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. అలాగే ఎన్నికలు జరిగే వరకు పాలనను తమకే అప్పగించాలని, ప్రత్యేక అధికారుల నియామకంపై స్టే ఇవ్వాలని సర్పంచ్‌లు కోరినా.. అందుకు నిరాకరించింది. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి, జనగాం, నిర్మల్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతోపాటు పంచాయతీ కార్యదర్శులకు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. జనవరి 31తో తమ పదవీ కాలం ముగుస్తుందని, ఈ నేపథ్యంలో పంచాయతీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాన్ని, ఎస్ఈసీని ఆదేశించాలని కోరుతూ జనగామ జిల్లా కాంచనపల్లి, చెంగెర్ల, నిర్మల్ జిల్లా తల్వాడ, కరీంనగర్ జిల్లా నిజాయతీగూడెం సర్పంచులు విజయ, వేణుగోపాల్, అనిల్‌కుమార్, మురళీధర్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

లోక్‌సభ అభ్యర్థుల దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

- తొలి దరఖాస్తు ఇచ్చిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారగొండ వెంకటేశ్
- భువనగిరి నుంచి కైలాశ్ నేత, మల్కాజ్‌గిరి నుంచి కపిలవాయి దిలీప్ దాఖలు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. బుధవారం ఉదయం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలి రోజు ఏడు దరఖాస్తులు వచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. మల్కాజ్‌గిరి-1, నాగర్‌కర్నూల్-2, భువనగిరి-2, వరంగల్-1, మహబూబాబాద్-1 చొప్పున ఆశావహులు దరఖాస్తులిచ్చారు. తొలి దరఖాస్తును నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారగొండ వెంకటేశ్ అందజేశారు. ఆయనతో పాటు పలువురు యువ నాయకులు మొదటి రోజే తమ దరఖాస్తులను గాంధీభవన్‌లో ఇచ్చారు. పున్నా కైలాశ్ నేత (భువనగిరి), కపిలవాయి దిలీప్‌కుమార్ (మల్కాజ్‌గిరి), తీన్మార్ మల్లన్న (భువనగిరి) తదితరులు దరఖాస్తులు ఇచ్చిన వారిలో ఉన్నారు. ఇక, నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానం నుంచి టికెట్ కోరుతూ ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లురవి కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఆయన తరఫున కుమారుడు సిద్ధార్థ్ దరఖాస్తును అందజేశారు.

త్వరలోనే కులగణన మొదలు

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టబద్ధత: మంత్రి పొన్నం

- బీఆర్ఎస్ అధ్యక్ష పదవి లేదంటే వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి బీసీలకిస్తారా అని ప్రశ్న
- కులగణనకు వ్యతిరేకంగానే నితీశ్ ఇండియా కూటమి నుంచి వెళ్లిపోయారు: మధుయాష్కీ



బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న పొన్నం, చిత్రంలో జి.నిరంజన్, ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీల కులగణన చేస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే కులగణన ప్రక్రియను ప్రారంభిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బుధవారం గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నేతలు జి.నిరంజన్, మధుయాష్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, టీపీసీసీ బీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తండు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీల కులగణనకు రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చట్టబద్ధత కల్పిస్తామనీ, ఈ ప్రక్రియను నిర్వహించేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కులగణనకు శాస్త్రీయంగా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అవసరమైతే రాష్ట్రంలోని బీసీ ప్రొఫెసర్లు, మేధావులు, బీసీ సంఘాల సలహాలు తీసుకుంటామని మంత్రి పొన్నం చెప్పారు. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల మెస్‌చార్జీలకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా గ్రీన్‌చానల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో టీచింగ్, నాన్‌టీచింగ్‌పోస్టులను భర్తీ చేస్తామని పొన్నం హామీనిచ్చారు

కవితకు పూలే విగ్రహం గురించి పదేళ్లుగా గుర్తుకు రాలేదా

ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం గురించి గుర్తుకు రాలేదా అని మంత్రి పొన్నం ప్రశ్నించారు. లిక్కర్ కేసులో బిజీగా లేదు కనుకనే కవిత సామాజిక న్యాయం గురించి మాట్లాడుతోందని, ముందు బీఆర్ఎస్ పార్టీలో పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన తర్వాతే ఆమె సామాజిక న్యాయం గురించి మాట్లాడాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులతోపాటు ప్రతిపక్ష నేత పదవి కూడా బీసీలకిస్తేనే వారికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉన్నట్టు అని పొన్నం వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ ఇండియా కూటమి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కులగణన చేపట్టాలని నిర్ణయించినందుకే దాన్ని వ్యతిరేకిస్తూ బిహార్ సీఎం నితీశ్‌కుమార్ బీజేపీ పంచన చేరారని ఆరోపించారు.

అత్యధిక స్థానాలపై కమలం గురి

- రాష్ట్ర నాయకత్వంతో బీజేపీ అధిష్టానం సమాలోచనలు
- అమిత్‌షాతో కిషన్‌రెడ్డి భేటీ
- అభ్యర్థుల ఎంపిక, పార్టీ బలాబలాలపై చర్చ




సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 17 స్థానాల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా దక్షిణాదిలో పట్టు సాధించాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది ఈ మేరకు హస్తిన వేదికగా రాష్ట్ర నాయకత్వంతో సమాలోచనలు జరుపుతోంది. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన వారు, ప్రజాదరణ ఉన్న నేతలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు సామాజిక సమతుల్యాన్ని పాటిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసేలా కసరత్తు చేస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, సీనియర్ నేత ఈటల రాజేందర్‌లు బుధవారం ఢిల్లీలో జాతీయ నాయకత్వంతో భేటీ అయ్యారు. మరోవైపు కిషన్‌రెడ్డి పార్టీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమై దాదాపు 40 నిమిషాలు చర్చించారు. కాగా ఆయా సమావేశాల్లో 17 లోక్‌సభ స్థానాల్లో పార్టీ బలాబలాలు, తాజా రాజకీయ పరిస్థితి, బలమైన నేతలు, ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించినట్టు సమాచారం.

నడ్డా దిశా నిర్దేశం

మంగళవారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులతో జరిగిన సమావేశంలోనూ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన ప్రణాళికలపై అధ్యక్షుడు జేపీ నడ్డా దిశా నిర్దేశం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పార్టీ బలంగా ఉన్నందున, దక్షిణాదిలోనూ ముఖ్యంగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలిచేందుకు సిద్ధం చేసిన రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలతో పాటు పలువురు కేంద్ర మంత్రుల ప్రచార సభలు, రోడ్ షోలు తదితర ప్రచార కార్యక్రమాల షెడ్యూల్‌పై పార్టీ ప్రధాన కార్యదర్శులు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, బండి సంజయ్ కుమార్‌లు జేపీ నడ్డాతో ప్రత్యేకంగా చర్చించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై ఏ విధంగా పడుతుందన్న అంశం వీరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. మరోవైపు కేవలం సీనియర్లు అనే కాకుండా యువత, మహిళలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులను సైతం సీట్ల కేటాయింపులో పరిగణనలోకి తీసుకోవాలన్న యోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం.

హైడ్రో పవర్‌పై సింగరేణి ఫోకస్

- పంప్‌డ్ స్టోరేజీ హైడ్రో పవర్ టెక్నాలజీతో విద్యుత్ ఉత్పత్తి
- ఇప్పటికే విదేశాల్లో ఈ విధానంలో చాలా విద్యుత్ కేంద్రాలు
- మరోవైపు సోలార్ విద్యుత్‌లో దూసుకెళ్తున్న సంస్థ
- డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బొగ్గు ఉత్పత్తితో మొదలైన సింగరేణి సంస్థ ఇప్పుడు తన పరిధిని విస్తరిస్తోంది. ఇప్పటికే 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్వహిస్తూ మరో యూనిట్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. రాబోయే ఏడాదిన్నరలో 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకోవడం ద్వారా సోలార్ -హైడ్రో పవర్‌పై కూడా దృష్టి పెట్టింది.

వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ లక్ష్యం..

సింగరేణి సంస్థ ఆరు జిల్లాల పరిధిలోని 11 ఏరియాల్లో విస్తరించి ఉంది. సంస్థ ఆధీనంలో 24 అండర్ గ్రౌండ్ మైన్‌లు, 19 ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. ఈ 11 ఏరియాల పరిధిలో గత కొన్నేళ్లుగా సింగరేణి సోలార్ పవర్ స్టేషన్లను నెలకొల్పుతోంది. ప్రస్తుతం సింగరేణి సోలార్ విద్యుత్ సామర్థ్యం 220 మెగావాట్లుగా ఉంది. మరికొన్ని నెలల్లో మరో 70 మెగావాట్ల యూనిట్లు అందుబాటులోకి రాబోతున్నాయి. ఇంకో 200 మెగావాట్ల ప్లాంట్లను నెలకొల్పేందుకు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. 500 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తే సింగరేణి సంస్థ వాయు కాలుష్యం విషయంలో నెట్ జీరో సంస్థగా అవతరిస్తుంది. ఇక్కడితో ఆగకుండా వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ లక్ష్యంగా సింగరేణి అడుగులు వేస్తోంది.

సోలార్ 'డిమాండ్'

సోలార్ విద్యుత్ పగటి వేళలోనే ఉత్పత్తి అవుతుంది. సహజంగా ఆ సమయంలో విద్యుత్‌కు డిమాండ్ తక్కువగా ఉండి సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళ ఉండే డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే మార్గాలపై ఇటీవల సింగరేణి ఫోకస్ చేస్తోంది. అందులో భాగంగా పంప్‌డ్ స్టోరేజీ హైడ్రో పవర్ టెక్నాలజీని ఉపయోగించుకునే అంశాన్ని పరిశీలిస్తోంది. తద్వారా సింగరేణి సంస్థకు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ సోలార్ పవర్ ద్వారా జల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంపై ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

సోలార్ టూ హైడ్రో పవర్

పంప్‌డ్ స్టోరేజీ హైడ్రో పవర్ టెక్నాలజీలో నేల మట్టానికి దిగువ స్థాయిలో ఉన్న నీటిని మోటార్ల సాయంతో పైకి తోడుతారు. తిరిగి అదే నీటిని కిందకు వదులుతారు. నీరు కిందికి వెళ్లే మార్గంలో టర్బైన్లు ఏర్పాటు చేసి తద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. అమెరికా, యూరప్ దేశాల్లో ఈ విధానంలో చాలా విద్యుత్ కేంద్రాలు పని చేస్తున్నాయి.

అందుబాటులోకి గ్రీన్ ఎనర్జీ..

పగటి వేళ అందుబాటులో ఉండే సోలార్ విద్యుత్ ద్వారా ఓపెన్‌కాస్ట్ మైన్స్‌లో ఉన్న నీటిని తోడి పై భాగంలో ఉన్న రిజర్వాయర్‌లో నింపుతారు. సాయంత్రం వేళ పీక్ అవర్స్‌లో విద్యుత్ డిమాండ్ ఉండే సమయంలో పైనున్న రిజర్వాయర్‌లో ఉండే నీటిని కిందికి పంపడం ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ విధానంలో నీటిని తోడేందుకు ఉపయోగించిన సోలార్ విద్యుత్‌లో 80 శాతం తిరిగి ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. ఈ మొత్తం విధానంలో కార్బన్ ఉద్గారాలు విడుదల కావు. పూర్తిగా గ్రీన్ ఎనర్జీ అందుబాటులోకి వస్తుంది.

వనరులపై దృష్టి..

ఓపెన్ కాస్ట్ విధానంలో నేలలో నిక్షిప్తమైన బొగ్గు కోసం భూమి పై పొరలను రెండు వందల మీటర్లకు పైగా తొలగిస్తారు. దీంతో భారీ గోతులు ఏర్పడుతాయి. ఇందులో సహజ నీటి ఊటలతో పాటు వర్షపు నీరు భారీగా చేరుకుంటుంది. బొగ్గు ఉత్పత్తి సమయంలో ఈ నీటిని ఎప్పటికప్పుడు భారీ మోటార్ల ద్వారా తోడేస్తారు. ఉత్పత్తి ఆగిపోయిన తర్వాత భారీ గోతులు, నీరు అక్కడే నిలిచి ఉంటాయి. ఇలా భారీగా నీరు నిల్వ ఉన్న ఓపెన్‌కాస్ట్ గనులు ఎక్కడ ఉన్నాయి.. ఈ మైన్స్‌కు సమీపంలో ఉపరితలంపై భారీ నీటి రిజర్వాయర్లు నిర్మించేందుకు అనువైన ఓపెన్‌కాస్ట్‌లు ఎక్కడున్నాయనే అంశంపై సింగరేణి దృష్టి సారించింది.



అహంకారం అనేది మనిషి తన గురించి తను ఎక్కువగా ఊహించుకోవడం వల్ల కలిగే ఆనందం.

– బరూచ్ స్పినోజా

సాక్షి

గురువారం, 1 ఫిబ్రవరి 2024

పాక్ ప్రజాస్వామ్య ప్రహసనం

మరో ఎనిమిది రోజుల్లో దేశంలో ఎన్నికలు. ఆరు నెలలుగా జైలులో ఉన్న మాజీ ప్రధాని. అవినీతి ఆరోపణలతో కటకటాల వెనక ఉన్న ఆయనపై... రెండు రోజుల్లో మరో రెండు కేసుల్లో వేర్వేరుగా 10 ఏళ్ళు, 14 ఏళ్ళ శిక్షలు. కనీసం మరో పదేళ్ళ పాటు ప్రభుత్వహోదా ఏదీ నిర్వహించనివ్వని నిషేధం. పార్టీ ఎన్నికల చిహ్నానికి కూడా తిరస్కరణ. మాజీ ప్రధాని గారి పార్టీ వైపు మొగ్గకుండా యువతరానికి హితోపదేశాల ఊదరగొడుతున్న ఆర్మీ ఛీఫ్. ఇలాంటి నాటకీయ పరిణామాలు ఒక్క పాకిస్తాన్‌లోనే సాధ్యం. గతంలోనూ ఆ దేశంలో మాజీ ప్రధానులు పలువురు ఇలానే న్యాయ విచారణలు, జైలుశిక్షలు ఎదుర్కోవాల్సి రావడం గమనార్హం. నమ్మలేని ఈ న్యాయవిచారణల ద్వారా నేతల్ని బరిలో లేకుండా చేసే సిగ్గుమాలిన రాజకీయ దుస్సంప్రదాయం పాకిస్తాన్‌లో దీర్ఘకాలంగా ఉన్నదే. దాదాపు 14 వేల కోట్ల డాలర్ల అప్పులో కూరుకుపోయి, ఏటా ఆహార ధరలు 38.5 శాతం మేర పెరుగుతూ, ఆసియాలోనే అత్యధిక ద్రవ్యోల్బణంతో సామాన్యులు సమరం చేస్తున్న పొరుగుదేశానికి ఇది ఏ రకంగానూ మేలు కాదు.

దేశరహస్య పత్రాలను లీక్ చేశారనే కేసులో కోర్టు మంగళవారం ఇమ్రాన్‌కు పదేళ్ళ జైలుశిక్ష ప్రకటిస్తే, మర్నాడే బుధవారం ప్రభుత్వ కానుకల అక్రమ విక్రయం (తోషాఖానా) కేసులో ఆయనకూ, ఆయన భార్యకూ కూడా చెరొక 14 ఏళ్ళ కారాగారవాస శిక్ష వేసింది. 150 కోట్ల రూపాయల జుల్మానా చెల్లించాల్సిందిగా ఆదేశించింది. ఏమైనా, 2022 ఏప్రిల్‌లో ప్రత్యర్థుల చేతిలో పదవీచ్యుతుడైన ఇమ్రాన్ ఇప్పటికే అవినీతి ఆరోపణలపై మూడేళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్నారు. ఎన్నికలు అతి దగ్గరలో ఉండగా ఈ తీర్పులు, శిక్షల ప్రకటన యాదృచ్ఛికం అనుకోలేం. ఇప్పటికే పదేళ్ళ పాటు అన్ని రకాల ప్రభుత్వ పదవులకూ తమ నేతను అనర్హుణ్ణి చేసిన శక్తులు ఆయన భవిష్యత్ రాజకీయ కార్యాచరణకూ బ్రేకులు వేయదలిచారని ఇమ్రాన్ సారథ్యంలోని పాకిస్తాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ (పీటీఐ) ఆరోపిస్తోంది. తాజాగా శిక్షలు పడ్డ రెండు కేసుల్లోనూ తమ వకీళ్ళు పాకిస్తాన్ హైకోర్ట్‌కు అప్పీల్ చేశాక కథ కొత్త మలుపులు తిరగవచ్చని ఆ పార్టీ ఆశ.

రావల్పిండిలోని అడియాలా జైలులో 9 బై 11 అడుగుల పరిమాణంలోని చిన్న జైలు గదిలో గడచిన ఆగస్టు నుంచి గడుపుతూ, హింసాకాండ నుంచి తీవ్రవాదం దాకా సుమారు 180కి పైగా ఆరోపణలను ఎదుర్కొంటున్నారు 71 ఏళ్ళ ఇమ్రాన్. కేసులు, కోర్టులు, శిక్షలతో సంబంధం లేకుండా ఆయనకు ఇప్పటికీ ప్రజాదరణ మెండుగా ఉంది. ఎన్నికల చిహ్నమైన క్రికెట్ బ్యాట్‌ను సైతం ఈ అంతర్జాతీయ క్రికెటర్ పార్టీకి దూరం చేశారు. ఎదురుదెబ్బ తగిలినా, జనంలో ఆయన పట్ల సానుభూతి, సానుకూలత ఆ పార్టీ అభ్యర్థులకు కాస్తంత సాంత్వన. వారు గెలిచినా ఇండిపెండెంట్ల కిందే లెక్క. అసలు చిక్కంతా ఇతర ప్రధాన రాజకీయ పార్టీలతో కలసి సైనిక వ్యవస్థ ఆడుతున్న అధికార క్రీడతోనే! తెర వెనుక చక్రం తిప్పే పాక్ సైన్యం కొన్ని నెలలుగా వేలాది పార్టీ కార్యకర్తల్ని అరెస్టు చేసింది. సుదీర్ఘ విచారణల దెబ్బతో డజన్లకొద్దీ పార్టీ నేతలు రాజీనామాలు చేశారు. ప్రధాన స్రవంతి మీడియాలో ఇమ్రాన్ పేరు నిషేధించారు. ఇమ్రాన్ ప్రత్యర్థులకు కలిసొచ్చేలా నియోజక వర్గాల సరిహద్దుల్ని తిరగరాశారు. చివరకు ఆయన నామినేషన్ పత్రాలను తిరస్కరించారు.

మాజీ ప్రధాని 74 ఏళ్ళ నవాజ్ షరీఫ్‌కు మాత్రం తెర వెనుక అండ పుష్కలం. అచ్చం ఇమ్రాన్ లానే అవినీతి ఆరోపణలతో 2017లో ఆయన పదవీచ్యుతుడయ్యారు. పదేళ్ళ జైలుశిక్ష పడింది. కానీ, వైద్య చికిత్సకంటూ 2018లో బెయిల్ మీద లండన్ వెళ్ళిన ఆయన తప్పించుకొని ప్రవాసంలో కాందిశీకుడిగా గడిపారు. చివరకు గత అక్టోబర్ 21 పాక్‌కు తిరిగొచ్చారు. వస్తూనే జైలుశిక్ష రద్దయింది. రాజకీయాల నుంచి జీవితకాల నిషేధమూ ఎత్తేశారు. నాలుగోసారి ప్రధాని పీఠానికై పోటీ చేస్తున్న ఆయనకు గతంలో మూడుసార్లు ఆయనను గద్దె దింపిన సైన్యమే మళ్ళీ సాయంగా నిలవడం పాక్ రాజకీయ వైచిత్రికి తార్కాణం. ఇవన్నీ చూశాకే ఈ ఎన్నికలలో ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలుండవని విశ్లేషకులు తీర్మానించేశారు. పాక్ ఓటర్లలో 40 శాతం మంది నిరక్షరాస్యులే. అయితేనేం, ప్రజానీకానికి సైతం ఎన్నికల ప్రక్రియపై భ్రమలు ఎంతగా తొలగిపోయాయంటే, బరిలో మిగిలిన పార్టీల ప్రచారానికి సైతం స్పందన అంతంత మాత్రమే. అయితే, ఇమ్రాన్‌కు కోర్టు శిక్షలతో పాక్‌లో రాజకీయంగా చీలిక పెరగవచ్చు. అస్థిరత హెచ్చి, ప్రజాస్వామ్య ప్రక్రియకే ప్రమాదం రావచ్చు. రేపు ఫలితాలు వెలువడిన తర్వాతా దేశంలో సుస్థిరత నెలకొనే అవకాశాలు అత్యల్పం.

పాక్ అధికార వ్యవస్థపై సైనిక యంత్రాంగపు క్రీనీడ విస్తరించి, ప్రజాస్వామ్య రాజకీయ ప్రక్రియను పూర్తిగా బలహీనపరిచింది. సైనికాధికారులు తమ పరిధిలోకి ఏ మాత్రం రాని రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ నుంచి మతం, విదేశాంగ విధానం దాకా విద్యార్థులతో ముచ్చటిస్తుండడమే అందుకు మచ్చుతునక. అన్ని రకాలుగా సందేహాస్పదమైన ఈ ఎన్నికల ద్వారా, సైనిక వ్యవస్థ అండతో వచ్చే బలహీన పౌరప్రభుత్వం రేపు పరిపాలన ఎంత అందంగా చేస్తుందో ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. పాక్ ఆర్థిక, జాతీయ భద్రతా రంగాల్లో దాని పని తీరు ఏమంత గొప్పగా ఉంటుందో వివరించనక్కర లేదు. దేశాన్ని సక్రమ మార్గంలో నడిపించడమెలాగో తమకు తెలుసని గతంలో అప్పటి పాక్ ఆర్మీ ఛీఫ్ జనరల్ జావేద్ బజ్వా ఒక సిద్ధాంతం చెబితే, ఇప్పుడు జనరల్ ఆసిమ్ మునీర్ సిద్ధాంత ప్రవచనం చేస్తున్నారు. వెరసి, ఈ ఫిబ్రవరి 8 నాటి ఎన్నికలు చివరకు ఓ తంతుగానే మారడం ఖాయం. బాహాటంగా పగ్గాలను సైన్యం చేత పట్టకున్నా, పేరుకు ఎన్నికైన పౌర ప్రభుత్వాన్ని స్వేచ్ఛగా పనిచేయనిచ్చే పరిస్థితి మాత్రం ఉండదనేది నిస్సందేహం.

గ్లోబల్ సౌత్ ఛాంపియన్ ఎవరు?

విశ్లేషణ



మంజరీ ఛటర్జీ మిల్లర్

గ్లోబల్ సౌత్ అనే మాటను 'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రిక 2023 సంవత్సరపు పదంగా ప్రకటించింది. గ్లోబల్ సౌత్ అంటే దక్షిణార్ధ భూగోళ దేశాలు అని స్థూలార్థం. ఇదే పరిగణిస్తే చైనా, ఇండియా రెండూ ఇందులోకి రావు. భౌగోళికత కన్నా... తక్కువ, మధ్యాదాయ దేశాల సమూహంగా దీన్ని చూస్తున్నారు. భారీ ఆర్థిక వ్యవస్థలు ఉన్నప్పటికీ చైనా, ఇండియా తమను ఎదుగుతున్న దేశాలుగానే భావిస్తున్నాయి. అలా గ్లోబల్ సౌత్ దేశాలకు నాయకత్వ స్థానం కోసం పోటీపడుతున్నాయి. గ్లోబల్ సౌత్ కొన్నిసార్లు చైనా, భారత్ మద్దతును అంగీకరించడానికి సిద్ధంగా ఉంటూనే... ఈ రెండు దేశాల్లో దేన్నయినా నిరపాయకరమైన నాయకుడిగా లేదా ఛాంపియన్‌గా చూస్తున్నదా అనేది చెప్పడం కష్టం.

గత ఏడాది భారతదేశంలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వాయిస్ ఆఫ్ ద గ్లోబల్ సౌత్ ఫర్ హ్యూమన్ సెంట్రిక్ డెవలప్‌మెంట్' అనే వర్చువల్ సదస్సును నిర్వహించారు. భారతదేశం 'గ్లోబల్ సౌత్' వాణిగా ఉంటుందని ప్రకటించారు. 2023లో జీ20 అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్, ఈ సదస్సు ఎజెండాను వివరించడానికి తనకున్న ప్రత్యేక హక్కులో భాగంగా, అభివృద్ధి చెందుతున్న దేశాలకు స్థిరమైన రుణాలు, ఆహార భద్రత, ఆరోగ్య మౌలిక సదుపాయాలు, బహుపాక్షిక బ్యాంకు సంస్కరణలు, వాతావరణ ఫైనాన్స్ వంటి ముఖ్యమైన సమస్యలను ముందుకు తెచ్చింది.

గ్లోబల్ సౌత్ ఛాంపియన్‌గా భారతదేశానికి ఉన్న స్థానం లేదా ప్రాముఖ్యత అనేది అభివృద్ధి, పాలన సమస్యలకు మాత్రమే పరిమితం కాలేదు. తన పాశ్చాత్య వ్యూహాత్మక భాగస్వాములైన అమెరికా, ఫ్రాన్స్‌లకూ, అభివృద్ధి చెందుతున్న ప్రపంచానికీ మధ్య వారధిగా ఉంటూ ప్రపంచవ్యాప్తంగా ప్రభావవంతమైన పాత్రను పోషించాలనే స్పష్టమైన కోరిక భారత్‌కు ఉంది. పర్యవసానంగా, గ్లోబల్ సౌత్, దానిలో భారతదేశ పాత్ర రెండింటిపై చాలా శ్రద్ధ చూపడం జరిగింది. (గ్లోబల్ సౌత్ అనే పదబంధాన్ని 'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రిక 2023 సంవత్సరపు పదంగా ప్రకటించింది.) అయితే గ్లోబల్ సౌత్ అనే భావన కొత్తది కానట్లే, దానికి నాయకత్వం వహించాలనే ఆకాంక్ష కూడా భారత్‌కు కొత్తదేమీ కాదు. ఈ పాత్రను చేపట్టడానికి భారత్ చాలా కాలంగా చైనాతో పోటీపడుతోంది. గ్లోబల్ సౌత్‌లో ఎవరెవరు ఉన్నారు, ఇది ఎందుకు ఏర్పడింది అనేది కూడా ముఖ్యమైన అంశమే. గ్లోబల్ సౌత్ దేశాలు భారతదేశాన్ని లేదా చైనాను తమ వాణిగా స్వాగతిస్తాయా అనేది కూడా బహిరంగ ప్రశ్నే.

గ్లోబల్ సౌత్ అనే పదం ఒక భౌగోళిక మార్మిక విషయంగా ఉంటోంది. ఎందుకంటే ఉత్తర ఆఫ్రికాతో పాటు చైనా, భారత్ వంటి దేశాలు నిజానికి ఉత్తరార్ధ గోళానికి చెందుతాయి. తక్కువ లేదా మధ్య–ఆదాయ దేశాలుగా ప్రపంచ బ్యాంకు వర్గీకరించిన దేశాల సమూహంగా గ్లోబల్ సౌత్‌ను నేడు ఎక్కువగా అర్థం చేసుకుంటున్నారు. దీని భౌగోళిక మూలాలను 1926లో ఇటాలియన్ మార్క్సిస్ట్ తత్వవేత్త ఆంటోనియో గ్రామ్‌సీ రాసిన 'ద సదరన్ క్వశ్చన్' వ్యాసంలో గుర్తించవచ్చు. దీనిలో ఆయన తక్కువ అభివృద్ధి చెందిన, దక్షిణ ప్రాంత ఆలోచనను మొదటిసారిగా లేవనెత్తారు. ఉత్తర ఇటలీలోని పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సంపన్న ప్రాంతాన్ని తక్కువ అభివృద్ధి చెందిన దక్షిణాదితో పోల్చారు. రెండోదాన్ని పూర్వం నుండి పెట్టుబడిదారులు వలసరాజ్యంగా మలిచారని గ్రామ్‌సీ నిర్ధారించారు. అంతర్జాతీయ సమాజాన్ని... ఆదాయం, భావజాలం రెండింటితో వేరు చేయబడిన భిన్న ప్రపంచాలుగా ఫ్రెంచ్ జనసంఖ్యాశాస్త్ర నిపుణుడు ఆల్‌ఫ్రెడ్ సావీ 1952లో వర్గీకరించారు. ప్రచ్ఛన్న యుద్ధ



బ్రెజిల్, చైనా, దక్షిణాఫ్రికా, భారత్, రష్యా నేతలు

సమయంలో గ్రామ్‌సీ నిర్ధారణలు మరింతగా ముందుకొచ్చాయి. మొదటి ప్రపంచంలో పెట్టుబడిదారీ పశ్చిమదేశాలు ఉన్నాయి. సోవియట్ యూనియన్, దాని సోషలిస్టు మిత్రులు రెండవ ప్రపంచంలో ఉన్నాయి. కొత్తగా వలసపాలనకు దూరమై, ఎక్కువగా పేదరికంలో ఉన్న దేశాలు మూడవ ప్రపంచంగా ఉంటున్నాయి. అమెరికన్ వామపక్ష నేత కార్ల్ ఓగ్లెస్‌బీ 1969లో ఈ మూడవ ప్రపంచాన్ని 'గ్లోబల్ సౌత్' అని పిలిచాడు. 'గ్లోబల్ సౌత్‌పై ఉత్తరాది ఆధిపత్యం' గురించి కలత చెందాడు.

ఇండోనేషియాలోని బాండుంగ్‌లో 1955లో జరిగిన ఆసియా–ఆఫ్రికా కాన్ఫరెన్స్... తొలి గ్లోబల్ సౌత్ సమావేశాలలో ఒకటి. ఈ సదస్సుకు హాజరైన వాటిలో ఈ రోజు గ్లోబల్ సౌత్ అని భావించే దేశాలే కాకుండా సౌదీ అరేబియా, జోర్డాన్, టర్కీ వంటివి కూడా ఉన్నాయి. చాలావరకు కొత్తగా వలసపాలన నుంచి బయటపడిన ఈ దేశాలకు సదస్సు ఎజెండాలోని అతి ముఖ్యమైన అంశం... వలసవాదాన్ని, జాతి వివక్షను వ్యతిరేకించడమే. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో ఏ ఒక్క అగ్రరాజ్యం పక్షం వహించకుండా ఉండాలనే ఆలోచన కూడా బాండుంగ్ సదస్సులోనే పుట్టింది.

చైనా, భారత్ రెండూ ఈ ప్రపంచానికి చెందినవి. దీనికి నాయకత్వం వహించాలని ఈ రెండూ ఆకాంక్షించాయి. ఈ సదస్సులో చైనా ప్రధానమంత్రి చౌ ఎన్‌లై, భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ తమ దేశాలకు ప్రాతినిధ్యం వహించారు. కొత్తగా వలసపాలన నుంచి బయటపడిన ప్రపంచానికి ఛాంపియన్లుగా నిలవగల తమ సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి పోటీపడ్డారు. బాండుంగ్ సమావేశం తర్వాత, భారతదేశం అలీనోద్యమ (నామ్) ప్రముఖ వాణిగా ఆవిర్భవించింది. తరచుగా నైతిక ఆధిపత్య స్థానాన్ని తీసుకుంటూ వచ్చింది. చైనా అలీనోద్యమంలో సహాయక పాత్రను పోషిస్తూనే, మావో హయాంలో అనేక ఆఫ్రికన్ దేశాలకు విదేశీ సహాయాన్ని అందించడం ప్రారంభించింది. చైనా తరచుగా తన కంటే తలసరి స్థూల జాతీయోత్పత్తి (జీఎన్‌పీ) ఎక్కువగా ఉన్న దేశాలకు కూడా సహాయం చేసింది.

అయితే ప్రచ్ఛన్న యుద్ధానంతర ప్రపంచంలో వలసవాద వ్యతిరేకత, అలీనోద్యమం రెండూ... గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సాధారణ లింకుగా తమ ప్రాముఖ్యత కోల్పోయాయి. చమురు సంపన్న దేశమైన సౌదీ అరేబియా వర్గంలోని కొన్ని దేశాలను ఇందులో చేర్చడం కూడా అసంబద్ధంగా కనిపించింది. కానీ నయా – సామ్రాజ్యవాదమని చెబుతున్న పాశ్చాత్య ఆధిపత్యాన్నీ, దాని జోక్యాన్నీ వ్యతిరేకించాలనే భావన మాత్రం ఒక సాధారణ సూత్రంగా కొనసాగింది. ఇది చైనా, భారత్ రెండింటినీ ఆకర్షిస్తూనే ఉంది. ఇప్పుడు భారీ ఆర్థిక వ్యవస్థలతో ఎదుగుతున్న శక్తులుగా వీటిని పరిగణిస్తున్నప్పటికీ, ఇప్పటికీ సహాయం అవసరమవుతున్న, పాశ్చాత్య జోక్యాన్ని వ్యతిరేకిస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాల్లాగే ఉన్నామనీ, అందువల్ల మిగిలిన గ్లోబల్ సౌత్ పట్ల ఆసక్తులు కలిగి ఉన్నామనీ భారత్, చైనా నొక్కి చెబుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు సులభంగా రుణాలనూ, పెట్టుబడులనూ కల్పిస్తున్న చైనా... కఠినమైన, ఏమాత్రం సానుభూతి లేని అమెరికన్ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా తనను తాను ప్రదర్శించుకుంటోంది. మరోవైపున చైనా పెట్టుబడులు, ఫైనాన్సింగ్‌తో సరితూగలేని భారత్... గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను అర్థం చేసుకున్న దేశంగానూ, పశ్చిమ దేశాల, ముఖ్యంగా అమెరికా దగ్గర మన్నన ఉన్న దేశంగానూ తనను చూపుకుంటోంది.

కానీ గ్లోబల్ సౌత్ కొన్నిసార్లు చైనా, భారత్ మద్దతును అంగీకరించడానికి సిద్ధంగా ఉంటూనే, ఈ రెండు దేశాల్లో దేన్నయినా నిరపాయకరమైన నాయకుడిగా లేదా ఛాంపియన్ గా చూస్తోందా అనే విషయం స్పష్టం కావడం లేదు. ప్రపంచ రుణ సంక్షోభం పట్ల చైనా విముఖత, పశ్చిమ ఆఫ్రికాలో సహజ వనరులను అది దుర్వినియోగపర్చడం ఘర్షణను సృష్టించింది. మరోవైపున, భారత్‌తో వ్యవహరించడం కష్టమన్న భావన ఏర్పడింది. దీనికి ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలలో భారత్ అడ్డుకునే వాదం తోడయింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రయోజనం కలిగించే అంశాలను, ఉదాహరణకు మత్స్య రాయితీల వంటి వాటిని వ్యతిరేకించి భారత్ కాస్త చెడ్డపేరు తెచ్చుకుంది. క్లుప్తంగా చెప్పాలంటే... చైనా, భారత్ దశాబ్దాలుగా గ్లోబల్ సౌత్‌లో ప్రముఖ పాత్ర పోషించాలని కోరుకుంటున్నాయి. ఆ ఆకాంక్షలు నెరవేరతాయో లేదో మాత్రం చూడాల్సి ఉంది.

వ్యాసకర్త సీనియర్ ఫెలో, కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్; అసోసియేట్ ప్రొఫెసర్, బోస్టన్ విశ్వవిద్యాలయం

('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

యోగులే ఆదర్శం



గొప్ప రుషులు, యోగులు నేరుగా విశ్వ ప్రజ్ఞ (మహా తత్వం, ఈశ్వరత్వం)తో తమను అనుసంధానించుకుని, విశ్వంలోని యావత్ వివేకాన్ని పొందగలిగే, దాని ధర్మాలను, మాంత్రిక శక్తిని నిలపగలిగే విద్యను అభ్యసించారు. అలాంటి అంతర్గత ప్రజ్ఞ మాత్రమే మనల్ని శాశ్వత సత్యం వైపు నడుపుతుంది.

– డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యుడు

అందరూ పోకూడదా?



హిందుయేతరులు ఎవరూ ధ్వజ స్తంభం దాటి పళనిలోని మురుగన్ ఆలయంలోకి పోకూడదని మద్రాసు హైకోర్టు తాలూకు మదురై బెంచ్ తీర్పునిచ్చిందని వార్త. దీనితో నేను విభేదిస్తున్నాను. ఆలయ నియమాలు పాటించినంత వరకూ ఎవరికైనా ప్రవేశం ఉండాలి. ఆలయాలు విహార కేంద్రాలు కాదనేది నిజమే కావొచ్చు. కానీ చాలామంది మన సంస్కృతి, నిర్మాణ కళలను ఆనందించడానికి కూడా ప్రాచీన ఆలయాలను దర్శిస్తారు.

– సుమంత్ రామన్, యాంకర్

ఒత్తిడి ఉద్యోగాలు



శిక్షణాకాలంలో వైద్యులకు ఉండే నిద్ర లేమి చాలు... వాళ్లను స్థూలకాయులుగా, రోగులుగా మార్చడానికి! ఇక ఎల్లవేళలా చావు, బతుకు నిర్ణయాలు తీసుకోవాల్సిన తీవ్ర ఒత్తిడి గురించి మాట్లాడనే వద్దు. కార్టిజాల్ (ఒత్తిడిలో విడుదలయ్యే హార్మోన్) స్థాయులు ఎప్పుడూ అత్యధికంగానే ఉంటాయి.

– నియాజ్ అష్రఫ్, ఇంటెన్సివ్ కేర్ ఫిజీషియన్

అందరూ నిపుణులే!



చట్టబద్ధ హెచ్చరిక: బడ్జెట్‌ను ప్రవేశ పెట్టే ఫిబ్రవరి 1 నాడు నిపుణులందరూ ఆర్థికవేత్తలే అవుతారు. అలాగే బడ్జెట్ అనంతరం, చాలామంది లాగే నేను కూడా ఆర్థికవేత్తనే అవుతాను. కాబట్టి నాతో వాదించొద్దు. నాకన్నీ తెలుసు.

– ముకుల్ దేఖనే, కమెడియన్

వస్తూనే...



గత దశాబ్దంలో అమెరికాలోకి అక్రమ వలసలు దాదాపుగా వెయ్యి శాతానికి పైగా పెరిగాయి. ఇంకా తీవ్రంగా పెరుగుతూనే ఉన్నాయి.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

ఇన్ బాక్స్

చిరస్మరణీయుడు రెడ్డియార్

దేశానికి స్వాతంత్ర్యం లభించే నాటికి ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి తదనంతరం మరో రెండేళ్లు అదే పదవిలో కొనసాగి తెలుగు జాతికి వన్నె తెచ్చిన నేత ఒమాండూర్ రామస్వామి రెడ్డియార్. దళితులకు హిందూ దేవాలయాల ప్రవేశం కల్పిస్తూ చట్టం చేసిన తొలి ముఖ్యమంత్రి ఆయనే. 1947లో తీసుకు వచ్చిన ఈ చట్టం 'మద్రాస్ యాక్ట్ 5 ఆఫ్ 1947'గా ప్రసిద్ధి చెందింది. అలాగే 'దేవదాసి' విధానాన్ని రూపు మాపడానికి ఒక చట్టం రూపొందించారు.



ఒమాండూర్ రామస్వామి రెడ్డియార్

ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వ రాజముద్రగా ఉన్న గోపురం గుర్తులు తయారు చేయించి దానిని అమలులోకి తెచ్చిన ఘనత ఆయనదే.

చిన్నప్పటినుంచి దేశభక్తి గల రామస్వామి స్వాతంత్రోద్యమ కదన రంగంలోకి దూకి స్వాతంత్ర్య సముపార్జనలో తన వంతు సాయాన్ని అందించారు. నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో జాతి విభేదాలు లేకుండా అందరూ సమానంగా మెలగాలని తప్పని సరిగా ఖద్దరు ధరించాలని ఆయన సూచించారు. 1922లో దిండివనం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. వేదారణ్యం ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు. 1938లో తమిళనాడు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్టయ్యారు. '1919 భారత ప్రభుత్వ చట్టం' ప్రకారం ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో 1920లో శాసనసభ ఏర్పాటయింది. 1947 మార్చి 23న రామస్వామి రెడ్డి మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అయన పదవిలో ఉండగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. 1948లో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఎన్నికల్లో రామస్వామి రెడ్డి అభ్యర్థిత్వాన్ని టంగుటూరి ప్రకాశం వ్యతిరేకించినా కామరాజ్ మద్దతుతో ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగారు. 1949లో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయి కుమారస్వామి రాజాకి పదవి అప్పగించారు. 1965లో గవర్నర్ పదవి స్వీకరించవలసిందిగా లాల్‌బహదూర్ శాస్త్రి కోరగా ఆయన తిరస్కరించారు.

తమిళనాడులోని దిండివనం సమీపంలోని ఒమాండూర్ అనే గ్రామంలో 1895 ఫిబ్రవరి 1న ముత్తు రామరెడ్డియార్, రంగనాయకమ్మ దంపతులకు జన్మించిన రామస్వామి రెడ్డికి ఆయన ఊరు పేరే ఇంటిపేరయింది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర విభజనలో భాగంగా ఆయన నివసించే ప్రాంతం తమిళనాడులో ఉన్నందున ఆయన అక్కడి వారయ్యారు. 1970 ఆగస్టు 25న మృతి చెందిన ఆయనను తెలుగు వారు స్మరించుకోకపోవడం బాధాకరం.

– మేడపాటి శ్రీనివాస రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

(ఒమాండూర్ రామస్వామి రెడ్డియార్ జయంతి సందర్భంగా)

జన్యుమార్పిడి ఆవనూనె అవసరమా?

ఇంటిల్లిపాదీ అనుదినం తినే వంటకాల్లో వంట నూనె వాడకం తప్పనిసరిగా ఉంటుంది. అటువంటి అతి ముఖ్యమైన వంటనూనె కచ్చితంగా ఆరోగ్యదాయకమైనదని నిర్ధారణ అయినదై ఉండాలనుకుంటాం. అయితే, మనం చట్ట విరుద్ధంగా దిగుమతైన జన్యుమార్పిడి చేసిన నూనె గింజల నుంచి తీసిన వంట నూనెను చాలా ఏళ్లుగా తింటున్నామన్న సంగతి మీకు తెలుసా? విస్తుగొలిపే అ విషయం సుప్రీంకోర్టు సాక్షిగా ఇటీవలే అధికారికంగా వెల్లడైంది.

కేంద్ర ప్రభుత్వమే దీనికి సంబంధించిన గణాంకాలను సుప్రీంకోర్టుకు జనవరి 18న నివేదించింది. జన్యుమార్పిడి (జెనటికల్లీ మాడిఫైడ్ – జీఎం) పంటలపై 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు... జీఎం ఆవక్షేత్ర ప్రయోగాల అనుమతులపై దాఖలైన కేసుపై సుప్రీంకోర్టులో జస్టిస్ బీవీ నాగరత్న, సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట ఇటీవలే తిరిగి వాదనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన వాదనల ద్వారానే మన దేశం దిగుమతి చేసుకుంటున్న జీఎం వంట నూనెల సంగతులు అధికారికంగా తొలిసారి వెలుగులోకి వచ్చాయి. వాద ప్రతివాదనలను విన్న ఈ ధర్మాసనం ఇరుపక్షాలు తమ వాదనలను రాతపూర్వకంగా సమర్పించమని ఆదేశిస్తూ తీర్పును రిజర్వు చేసిన నేపథ్యంలో జీఎం వంట నూనెల పూర్వాపరాలను పరిశీలిద్దాం.

మన దేశంలో ఎక్కువగా వాడేది ఆవ నూనే. జన్యుమార్పిడి వంట నూనెలను దశాబ్దాలుగా మన దేశంలో వాడుతున్నాం. వంట నూనెల ధరను సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంచడానికి దేశీయంగా నూనె గింజల సాగు విస్తీర్ణం పెంచాల్సి ఉంది. మనం వాడుతున్న 50–60 శాతం వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నవే. అందువల్ల కలుపు మందును తట్టుకునేలా (హెచ్‌టీ) జన్యుమార్పిడి చేసిన ఆవ పంట క్షేత్ర ప్రయోగాలను మన దేశంలో అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనాన్ని కోరారు.

అయితే, పిటిషనర్ అరుణ రోడ్రిగ్స్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ 'ఆరుబయట పొలాల్లో జన్యుమార్పిడి ఆవ పంట సాగును ఒక్కసారి అనుమతిస్తే మన సంప్రదాయక ఆవ వంగడాలన్నీ జన్యుకాలుష్యానికి గురవుతాయి. ఇక తరతరాల సంపదైన సేంద్రియ ఆవ రకాలు మిగలవు. సేంద్రియ ఆహారోత్పత్తుల్ని మన దేశం నుంచి భారీస్థాయిలో ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాన్ని కోల్పోతాం అని హెచ్చరించారు.

దిగుమతైన జీఎం వంట నూనె ఎంత? సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు అందించిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ రూపొందించిన గణాంకాల ప్రకారం... 2020–21లో



దేశంలో 2.46 కోట్ల టన్నుల వంట నూనె వినియోగించగా, ఇందులో 1.11 కోట్ల టన్నులు దేశీయంగా ఉత్పత్తి చేసుకున్నాం. మిగతా 1.35 కోట్ల టన్నుల (54 శాతం) వంట నూనెను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నాం. ఇందులో పామాయిల్ 57 శాతం, సోయాబీన్ నూనె 22 శాతం, పొద్దుతిరుగుడు నూనె 15 శాతం, మిగతాది ఆవ (కనోల) నూనె. అదే మాదిరిగా 2022–23లో 20 లక్షల టన్నులు అదనంగా అంటే.. 1.55 కోట్ల టన్నులను (మొత్తం వాడిన వంట నూనెలో ఇది 55.76శాతం) దిగుమతి చేసుకున్నాం. 55 వేల టన్నుల జన్యుమార్పిడి ఆవ (కనోల) నూనెను దిగుమతి చేసుకుంటున్నామని మెహతా కోర్టుకు తెలిపారు.

జన్యుమార్పిడి వంట నూనె దిగుమతి మన ప్రస్తుత చట్టాలకు అనుగుణమైనది కానప్పటికీ దిగుమతి చేసుకుంటున్నట్లు సొలిసిటర్ జనరల్ అందించిన గణాంకాలతో తేటతెల్లమైంది. ఈ అక్రమ దిగుమతులతో పాటు, ప్రతి ఏటా మన దేశంలో పండించే జన్యుమార్పిడి పత్తి గింజల నూనెను సైతం మన దేశంలో వంట నూనెగా యథేచ్ఛగా వాడుతున్నాం. ఇది కూడా చట్టవ్యతిరేకమే. ఎందుకంటే, భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జన్యుమార్పిడి నూనెల వాడకానికి సంబంధించి సెక్షన్ 22 ప్రకారం ఇప్పటి వరకు ఎటువంటి నియమ నిబంధనలను విడుదల చేయలేదు. తక్కువ ధరకే వంట నూనెను ప్రజలకు అందించాలన్న కారణంతో జీవ భద్రతను ఫణంగా పెట్టటం ఎంతవరకు సబబు?

జీఎం వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్నట్లు సుప్రీంకోర్టుకు నివేదించిన సొలిసిటర్ జనరల్... వీటి వినియోగం వల్ల ప్రజలకు ఎటువంటి హానీ జరగలేదని వాదించారు. అయితే, ఈ వాదనను బలపరిచే గణాంకాలేవీ ఆయన కోర్టుకు సమర్పించలేదు. కాబట్టి ఈ వాదన అశాస్త్రీయమని కోలిషన్ ఫర్ జీఎం ఫ్రీ ఇండియా (రైతులు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద కార్యకర్తలతో కూడిన కూటమి) ఆక్షేపించటం ప్రజారోగ్య సంబంధమైన ప్రశ్న.

నిజానికి జీఎం ఆవ వంగడం కన్నా ఇప్పటికే ఉన్న ఆవ రకాల దిగుబడే ఎక్కువగా ఉన్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. అటువంటప్పుడు ఈ జీఎం ఆవ పంట అవసరమా అన్నది అంతుపట్టని ప్రశ్న. ఓ కంపెనీకి చెందిన కలుపు మందును తట్టుకునేలా(హెచ్‌టీ) జన్యుమార్పిడి చేసిన తొలి పంట జీఎం ఆవ. దీనికి ఆమోదం ఇస్తే... వరుసగా అనేక హెచ్‌టీ పంటలకు సులువుగా ఆమోదం పొందొచ్చునని ఆశిస్తున్న కార్పొరేట్ల లాబీయింగ్ వల్లనే కేంద్రం జీఎం ఆవకు తోవ ఇస్తోందని అనుకోక తప్పటం లేదు.

– పంతంగి రాంబాబు, సీనియర్ జర్నలిస్ట్

కార్యసాధకుల మార్గం

'మరణం అనే సంకటం లోకంలో ఏదో ఒక మూలన ప్రాణికోటిలోని కొంత భాగాన్ని ప్రతి క్షణం శోకంలో ముంచెత్తుతూ ఉండగా, సుఖంగా ఎలా కాలం గడుపుతున్నావు తండ్రీ?' అని పూర్వం ఒక యువకుడు దిగులు నిండిన హృదయంతో తన తండ్రిని ప్రశ్నించాడు. చుట్టూ ప్రశాంతత నిండివున్న సుందరమైన రాత్రివేళ పూర్ణచంద్రుడు కురిపిస్తున్న చల్లని, తెల్లని వెన్నెలలో భూమి తడిసి ముద్దవుతూ వుంది. అమృతమయంగా వున్న ఆ రాత్రి సౌందర్యాన్ని తనివితీరా అనుభవిస్తూ తనను తాను మరిచిపోయినట్లున్న ఆ తండ్రి మనసుని ఆ ప్రశ్న కలత పరచగా అతడిలా బదులిచ్చాడు: "నాయనా, ఎందుకు అలాంటి ప్రశ్నలతో నా మనసును భయభ్రాంతులకు గురి చేస్తావు? ఒక్కసారి ఇటు చూడు. ఇటువంటి ప్రశాంతత నిండిన అమోఘమైన రాత్రులే కదా మన జీవితంలో వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. పుట్టుకతోనే మరణం అనే తప్పించుకోలేని వలలో చిక్కుకుని ఉన్నవాడినని తెలిసున్న నేను, మరణం సంభవించడం జరిగినప్పుడు, అది ఒక్క క్షణ కాలం కూడా ఆగకుండా నన్ను తీసుకుపోతుందని తెలిసున్న నేను, ఈ సౌందర్య భరిత రాత్రుల ఆనందాన్ని క్షణమైనా వదలక అనుభవించకుండా ఎలా ఉండగలను? ఏ మనిషి జీవితంలోనైనా ఏ ఆనందానికీ నోచుకోకుండా గడిచిన రాత్రి అంటే ఆ మనిషి జీవితంలో వ్యర్థమైపోయిన ఒక రోజుగానే పరిగణింపబడుతుంది కదా! ఆదమరచి గడ్డిమేస్తున్న మూగజీవంపై అకస్మాత్తుగా వచ్చి పడి తన్నుకుపోయే పెద్దపులి వంటి మృత్యువును గురించి ఆలోచిస్తూ కాలాన్ని ఎందుకు నిరుపయోగంచేసి వృథా చేయడం?



'నలుగురికి మేలుచేసే కల్యాణ కారకమైన పనిని ఆరోజే, ఆ క్షణమే చేసెయ్యాలి. కాలాన్ని చేజారి పోనీయవద్దు. అలా పోనిస్తే చేయాలనుకున్న మంచిపనులు చేయకుండానే మిగిలిపోతాయి. చెప్పకుండానే మృత్యువు జీవితాన్ని లాగేసుకుంటుంది' అని మహాభారతం అంటోంది (శాంతిపర్వం, 175వ అధ్యాయం). కనుక భయాన్ని కలుగజేసే ఆలోచనలతో అంతరంగాన్ని నింపి కాలాన్ని వృథా చేసుకోవద్దు. అది కార్యసాధకులు అనుసరించే మార్గం కాదు!"

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.10.06 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** చిత్త రా.12.16 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.6.55 నుండి 8.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.20 నుండి 11.08 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.41 వరకు, **అమృత ఘడియలు:** సా.5.13 నుండి 6.57 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.51.

క్లుప్తంగా...

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల



సాగర్ ఎడమ కాల్వకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: సాగర్ ఎడమకాల్వకు బుధవారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు జలాశయంలో నీరు గణనీయంగా తగ్గిపోవడంతో తాగునీటి అవసరాల డిమాండ్ మేరకు నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు సాగునీటి శాఖ అధికారులు తెలిపారు. కాల్వలోకి వదిలిన నీరు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా నేరుగా ప్రధాన కాల్వలో 73.80 కిలోమీటరు వద్ద పాలేరు జలాశయంలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని నల్లగొండ చీఫ్ ఇంజనీర్ ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇదిలా ఉండగా పాలేరు జలాశయానికి నీరెంత అవసరమో ఉత్తర్వులో పేర్కొనలేదు. సత్వరమే ఆరు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని మాత్రమే పేర్కొన్నారు. గురువారం కృష్ణానది మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో బోర్డు నిర్ణయం మేరకు నీటి విడుదలను కొనసాగించనున్నట్లు సాగర్‌డ్యామ్ ఇంజనీర్లు తెలిపారు.

రైతుకు త్వరితంగా లబ్ధి చేకూరేలా చర్యలు



సాక్షి, హైదరాబాద్: రైతుల కోసం రూపొందిస్తున్న కార్యక్రమాల్లో లబ్ధి త్వరితంగా అందేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ శాఖతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను సమన్వయం చేసుకుంటూ రైతు కోణంలోనే కార్యాచరణ రూపొందించాలన్నారు. అనుబంధ శాఖలన్నీ వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకునేలా ఒక విధానాన్ని రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలన్నారు. దేశంలో వంటనూనె ఉత్పత్తి 123 లక్షల మెట్రిక్ టన్నులుండగా.. డిమాండ్ 250 లక్షల మెట్రిక్ టన్నులు ఉందని తుమ్మల తెలిపారు. వంటనూనె లోటుతో రూ.80 వేల కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చించి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ దిగుమతుల్లో ఆయిల్‌పామ్ వాటా 59% ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ సాగుతో దిగుమతులు తగ్గుతాయని, ఈ దిశగా చర్యలు చేపట్టాలని తుమ్మల ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 52 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు అవుతుందని, వచ్చే ఏడాది లక్ష ఎకరాలకు సాగును విస్తరింపజేయాలన్నారు.

కులగణన నిర్ణయం హర్షణీయం: శివశంకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపడుతున్నట్లు ప్రకటించడం హర్షణీయమని జాతీయ పద్మశాలీ సంఘం రాజకీయ విభాగం అధ్యక్షుడు బొల్ల శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి కులాలవారీగా నిధులు కేటాయించి ఖర్చు చేస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అణగారిన వర్గాల స్ఫూర్తిప్రదాత మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కవిత చేసిన డిమాండ్ పట్ల ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. పూలే విగ్రహ ఏర్పాటు బాధ్యత బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీసుకోవాలని శివశంకర్ అన్నారు.

‘పొగాకు నియంత్రణ’ అంతంతే

రాష్ట్రంలో చేపడుతున్న చర్యలపై కేంద్రం నివేదిక

- తెలంగాణ, చండీగఢ్ పాండిచ్చేరిల్లో అధ్యయనం
- నిబంధనలు రూపొందించినా అమలులో కొంత నిర్లిప్తత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ‘పొగాకు నియంత్రణ చర్యలు’అంత సంతృప్తిగా లేవని కేంద్రం స్పష్టం చేసింది. పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై నియంత్రణ, బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధంపై 2003లో ‘కోట్పా’చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. 2020 నవంబర్ నుంచి 2021 అక్టోబర్ వరకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన చోట్ల చట్టం ఎలా అమలవుతుందనే దానిపై, ఇంకెలా చేయొచ్చన్న దానిపై పొగాకు వినియోగం, దాని నియంత్రణపై ఒక కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేసింది. దాని ఆధారంగా ఓ నివేదిక రూపొందించింది. అమలుపై పాండిచ్చేరిలోని జిప్‌మర్, చండీగఢ్‌కు చెందిన పీజీఐఎంఈఆర్‌లు పరిశోధన చేశా యి. 2020 నవంబర్‌లో ఒకసారి, అక్టోబర్ 2021 తర్వాత ఒకసారి తెలంగాణ, పాండిచ్చేరి, మేఘాలయలో ఈ అధ్యయనం చేశారు. ఒక్కో రాష్ట్రంలో 9 జిల్లాల్లో పరిశీలించారు. అనంతరం వాటి ఫలితాలను ఐసీఎంఆర్ అనుబంధ జర్నల్ ఐజేఎంఆర్‌లో తాజాగా ప్రచురించారు. తెలంగాణలో 2020లో మొదటి విడతలో 2,029 మందిని సర్వే చేశారు. రెండో విడత 2021లో 1,097 మందిపై చేశారు. ‘పొగాకు నియంత్రణ చర్యలు తెలంగాణలో పెరిగాయి. అయితే కొన్నింటిలో మాత్రం తగ్గుదల ఉన్నట్టు నివేదిక చెబుతోంది. పొగాకు ఉత్పత్తుల వినియోగానికి సంబంధించి ప్రకటనల నిలుపుదలపై పురోగతి ఉందని’డాక్టర్ కిరణ్ మాదల (సైంటిఫిక్ కమిటీ కన్వీనర్, ఐఎంఏ) అభిప్రాయపడ్డారు.

పొగాకు బాక్సులపై స్థానిక భాషలో హెచ్చరికలు ఏవీ?

బహిరంగ ప్రదేశాల్లో పొగాకు వినియోగ నియంత్రణ చర్యల్లో మాత్రమే తెలంగాణలో పురోగతి ఉంది. ఉత్పత్తిదారులను నియంత్రించడంలోనూ...హెచ్చరికల్లోనూ నిర్లక్ష్యం కనిపిస్తుందని తెలిపింది.

- పొగాకు ఉత్పత్తుల ప్యాక్‌పై వార్నింగ్ సింబల్ విషయంలో మొదటి దశలో 75 శాతంగా ఉండగా, రెండో దశలో అది 83 శాతానికి పెరిగింది.
- పొగాకు ఉత్పత్తుల బాక్స్‌పై వార్నింగ్ సింబల్ 85 శాతం కవరయ్యేలా ఉండాలి. ఆ విషయంలో మొదటి విడతలో 75 శాతం ఉండగా, రెండో విడతలో 91 శాతంగా ఉంది.
- స్థానిక భాషలో ముద్రించే విషయంలో మొదటి విడత 45 శాతం ఉంటే, రెండో విడత 13 శాతానికి దిగజారింది.
- 18 ఏళ్లలోపు వారికి పొగాకు వాడకం, అమ్మకాలపై నిషేధం ఉండాలి. నిషేధం తీరు మొదటి విడతలో 95 శాతం ఉండగా, రెండో విడతలో 99 శాతం పెరిగింది.
- 18 ఏళ్లలోపు పిల్లలు పొగాకు ఉత్పత్తులను ఇతరులకు అమ్మటాన్ని నిరోధించడంలో తెలంగాణలో మొదటి విడతలో 97 శాతం ఉండగా, రెండో విడతలో అది ఏకంగా 100 శాతానికి చేరింది.

బహిరంగ ప్రదేశాల్లో పొగాకు వాడకం తగ్గింది

తెలంగాణలో బహిరంగ ప్రదేశాల్లో పొగాకు తాగకపోవడం అధ్యయనంలో మొదటి విడత 86.9 శాతం ఉండగా, రెండోసారి 98.5 శాతానికి పెరిగింది. ఆ మేరకు మార్పు కనిపించింది.

- బహిరంగ ప్రదేశాల్లో తాగొద్దన్న బోర్డులు పెట్టారు. మొదటి దశలో 45.2 శాతంగా ఉంటే, రెండో విడతలో 54.1 శాతానికి పెరిగింది. అయితే నిబంధనల ప్రకారం బోర్డులు పెట్టలేదని తేలింది.
- నిబంధనల ప్రకారం బోర్డులను ఏమేరకు పెట్టారో చూస్తే... మొదటి దశలో రెండు శాతం, రెండో దశలో 15 శాతానికి పెరిగింది.
- పొగాకు తాగొద్దని పెట్టే బోర్డుపై సంబంధిత అధికారి ఫోన్ నంబర్ పొందుపరచడం అనేది మొదటి దశలో 1.6 శాతం ఉంటే, రెండో దశలో 1.5 శాతానికి తగ్గింది. పొగాకు తాగకుండా ఉండే పరిస్థితులు కల్పించడంలో మొదటి దశలో 86.9 శాతం ఉండగా, రెండో దశలో 97.7 శాతానికి పెరిగింది.
- సగటున చూస్తే బహిరంగ ప్రదేశాల్లో పొగాకు తాగకపోవడం అనేది మొదట విడత 53.9 శాతం నుంచి రెండో విడతలో 66 శాతానికి పెరిగింది.

శివబాలకృష్ణ మూగనోము

- హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్‌ను ఏడు గంటలపాటు విచారించిన ఏసీబీ
- ప్రశ్నల వర్షం.. అన్నింటికీ మౌనమే సమాధానం.?
- ఎప్పుడు కొన్నారు.. ఎలా కొన్నారు.. డబ్బు ఎక్కడిది?



సాక్షి, హైదరాబాద్: ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులు ఎలా వచ్చాయి..?ఎప్పుడు కొన్నారు..? దీనికి డబ్బు ఎక్కడిది..? మీకు రియల్ ఎస్టేట్ కంపెనీలతో ఉన్న సంబంధాలు ఏమిటి? ఇలా ఏసీబీ అధికారులు హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపై ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ ఏసీబీ అధికారుల ప్రశ్నలకు శివబాల కృష్ణ మౌన ముద్ర దాల్చినట్టు సమాచారం. అధికారులు అడిగిన చాలా ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇవ్వలేదని, కొన్ని ప్రశ్నలకు మాత్రం పొడిపొడి సమాధానాలతోనే సరిపెట్టినట్టు తెలిసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శివబాలకృష్ణను ఏసీబీ అధికారులు జనవరి 24న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పలు కీలక అంశాలు తెలుసుకోవాల్సినందున కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఏసీబీ కోరింది. ఈ మేరకు కోర్టు ఎనిమిది రోజులపాటు కస్టడీకి అనుమతించింది. కోర్టు అనుమతి ప్రకారం.. బుధవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి శివబాలకృష్ణను తమ కస్టడీలోకి తీసుకున్నారు. బంజారాహిల్స్‌లోని ఏసీబీ హెడ్ క్వార్టర్స్‌కు తరలించారు. సాయంత్రం 5 గంటల వరకు దాదాపు ఏడు గంటలపాటు విచారణ కొనసాగింది. సాయంత్రం తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

కీలక పత్రాలు ముందుంచి ప్రశ్నలు

రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న అంశాలతో పాటు 40కి పైగా ప్రశ్నలు శివబాలకృష్ణను అడిగిన ట్టు తెలిసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితుల ఇళ్లల్లో గత నెల 24న జరిపిన సోదాల్లో పట్టుబడిన పలు కీలక పత్రాలను, భూములకు సంబంధించిన పత్రాలను ముందుంచి ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. మొత్తం ఐదుగురు సభ్యుల ఏసీబీ అధికారుల బృందం అతన్ని వేర్వేరుగా ప్రత్యేక గదిలో విచారించింది. అయితే అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేదని, కేవలం ఏసీబీ అధికారులు చూపిన పలు భూములకు సంబంధించిన డాక్యుమెంట్లలోని వివరాలను మాత్రమే తెలిపినట్టు సమాచారం. సోదాల్లో స్వాధీనం చేసుకున్న బ్యాంక్ పాస్‌బుక్స్, లాకర్స్ గురించి ఆరా తీశారు. వీటితో పాటు బినామీ పేర్లతో ఉన్న 9 ఫ్లాట్స్, రెండు రియల్ ఎస్టేట్ కంపెనీలకు చెందిన వివరాలను సేకరించే ప్రయత్నం చేశారు. కాగా, గురువారం ఉదయం 10.30 గంటలకు రెండవ రోజు కస్టడీకి తీసుకోనున్నారు. మలిరోజు.. రియల్ ఎస్టేట్ కంపెనీలతో ఉన్న సంబంధాలు, హెచ్ఎండీఏలో పనిచేస్తున్న సమయంలో ఇచ్చిన అనుమతులపై ప్రశ్నించాలని ఏసీబీ అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. ఫిబ్రవరి 7 వరకు శివబాలకృష్ణ ఏసీబీ కస్టడీ కొనసాగనుంది.

జూబ్లీహిల్స్‌లో మరో ‘హిట్ అండ్ రన్’

- ఐదుగురికి గాయాలు
- ఆగకుండా దూసుకెళ్లిన స్పోర్ట్స్ కారు




గాయపడ్డ వాహన దారుడు

బంజారాహిల్స్ (హైదరాబాద్): అదుపుతప్పి వేగంగా దూసుకొచ్చిన స్పోర్ట్స్ కారు ఢీకొట్టడంతో ఓ బైక్‌పై వెళ్తున్న అన్నాచెల్లెళ్లతో పాటు మరో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో కృష్ణానగర్‌కి చెందిన ఉదయ్ అనే యువకుడు తన సోదరిని తీసుకొని బైక్‌పై జూబ్లీహిల్స్ 36 మీదుగా మాదాపూర్ వైపుకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు వీరిని ఢీకొట్టి అదే వేగంతో ముందున్న మరో బైక్‌ను కూడా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఉదయ్ ధరించిన హెల్మెట్ ఊడిపోయి కారు సైడ్ మిర్రర్‌కు తగిలి వ్రేలాడింది. అయినప్పటికీ కారు డ్రైవర్ అదే వేగంతో మాదాపూర్ వైపు దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై వెళ్తున్న ఐదు మందికి తీవ్రగాయాలు కాగా వీరిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కారు నెంబర్ కోసం సీసీటీవీ పుటేజీని పరిశీలిస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని కారు కోసం గాలిస్తున్నారు.

కృష్ణానది జలాలు చెరి సగం పంచాలి

- షరతులకు అంగీకరిస్తేనే ప్రాజెక్టుల అప్పగింత
- కేఆర్ఎంబీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ



సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాలను చెరిసగం పంచడంతో పాటు షరతులకు అంగీకరిస్తే ప్రాజెక్టులను అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయగా బుధవారం కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు లేఖ రాసింది. బచావత్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-1) గంపగుత్తగా 811 టీఎంసీలను ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిందని, ఆ జలాలను రాష్ట్రాలకు పంచడానికి వీలుగా జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-2)కు బాధ్యతలు అప్పగించారని గుర్తు చేసింది. 811 టీఎంసీలను చెరిసగం అంటే 405.5 టీఎంసీల చొప్పున రెండు రాష్ట్రాలకు కేటాయించాలని స్పష్టం చేసింది. శ్రీశైలం ప్రాజెక్టు ఆపరేషన్ ప్రోటోకాల్లో కనీస నీటిమట్టాన్ని 830 అడుగులుగా పరిగణనలోకి తీసుకోవాలని, పోతిరెడ్డిపాడు నుంచి ఎస్ఆర్బీసీ ద్వారా మొత్తం 34 (ఎస్ఆర్బీసీ కాల్వకు 19 టీఎంసీలు, మద్రాస్ తాగునీటికి 15 టీఎంసీలు) టీఎంసీలకు మించి తరలించకుండా కట్టడి చేయాలని, కృష్ణా జలాలను బేసిన్ లోపలి ప్రాంతాల అవసరాలకు మాత్రమే కేటాయించాలని, బేసిన్ వెలుపలికి తరలించకుండా నియంత్రించాలని కోరింది. ఒక నీటి సంవత్సరంలో వాడుకోని మిగులు కోటాను వచ్చే సంవత్సరానికి బదిలీ (క్యారీ ఓవర్) చేసేందుకు అనుమతించాలని, వాడుకోని నీటిని ఖాతాలో లెక్కించకుండా చూడాలని, తాగునీటి వినియోగాన్ని బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 20 శాతంగా మాత్రమే లెక్కించాలని స్పష్టం చేసింది.

అలా ప్రకటిస్తే అభ్యంతరం లేదు

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చేలోగా పై షరతులకు కట్టుబడి ఉంటామని, అమలు చేస్తామని ప్రకటిస్తే... శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులను అప్పగించడానికి అభ్యంతరాలేవీ లేవని ప్రభుత్వం పేర్కొంది. జనవరి 17వ తేదీన నాగార్జునసాగర్‌పై జరిగిన సమావేశంలో శ్రీశైలం, నాగార్జునసాగర్లను అప్పగించడానికి తెలంగాణ అంగీకారం తెలిపినట్టుగా సమావేశపు మినట్స్‌లో పేర్కొనడాన్ని తప్పుపట్టింది. ఆ సమావేశంలో నాగార్జునసాగర్ వద్ద నవంబర్ 28కి ముందు పరిస్థితిని పునరుద్ధరించాలని మాత్రమే కోరడం జరిగిందని తెలిపింది. తక్షణమే మినట్స్‌ను సవరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఈనెల 27వ తేదీన లేఖ రాశారు. కాగా కేంద్రానికి ఇదివరకే తమ అభిప్రాయాన్ని నివేదించడం జరిగిందని బుధవారం కృష్ణా బోర్డుకు రాసిన లేఖలో స్పష్టం చేశారు.

1న భేటీలో తేల్చి చెప్పండి

శ్రీశైలం, నాగార్జునసాగర్ అప్పగింత లాంఛనాలపై చర్చించడానికి వీలుగా ఫిబ్రవరి 1వ తేదీన కేఆర్ఎంబీ నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని, లేఖ ద్వారా నివేదించిన అంశాలన్నీ సమావేశంలో తేల్చేసి, తదుపరి చర్చకు ఆస్కారం లేకుండా బయటికి రావాలంటూ ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఈ కీలక సమావేశానికి ఏపీ అధికారులు హాజరుకానున్నారు.

ధాన్యం కొనుగోలు నిబంధనలపై అభ్యంతరాలు

సాక్షి, హైదరాబాద్: ధాన్యం విక్రయానికి సంబంధించి నిర్వహించిన ప్రీబిడ్ సమావేశంలో అభ్యంతరాలు వచ్చాయి. రాష్ట్రంలోని మిల్లుల్లో నిల్వ ఉన్న 2022–23 రబీ ధాన్యం నుంచి 35 ఎల్ఎంటీ వేలం వేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే పౌరసరఫరాల సంస్థ విధించిన రెండు నిబంధనలను వ్యతిరేకించినట్టు తెలిసింది. ఈ నిబంధనల కారణంగా రాష్ట్రంలోని మిల్లర్లతోపాటు, వ్యాపారులు కూడా బిడ్డింగ్‌లో పాల్గొనే అవకాశం లేకుండా పోతుందని వారు స్పష్టం చేసినట్టు తెలిసింది. గత టెండర్లలో లేని నిబంధనలు కొత్తగా పెట్టడంపై వారు అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. బుధవారం పౌర సరఫరాల భవన్‌లో కమిషనర్ డీఎస్.చౌహాన్ ఆధ్వర్యంలో ఆసక్తిగల వ్యాపారులతో ప్రీబిడ్ మీటింగ్ ఆ సంస్థ నిర్వహించింది. అర్హత నిబంధనల్లో వార్షిక టర్నోవర్ రూ. 200 కోట్లు వరుసగా మూడేళ్ల పాటు ఉండాలని, అయితే ఇది నిత్యావసర వ్యాపారం(కమోడిటీ ట్రేడింగ్)లో మాత్రమే ఉండాలని మెలిక పెట్టింది. ఈ నిబంధనతో రాష్ట్రంలోని మిల్లర్లు బిడ్డింగ్‌లో పాల్గొనకుండా చేశారనే విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే బిడ్డింగ్‌లో పాల్గొనే కంపెనీకి టెండర్ నోటిఫికేషన్ నాటికి ఏడాది కాలంగా స్థానికంగా ఆఫీసు ఉండాలని నిబంధన పెట్టారు. దీనిపై ఇతర రాష్ట్రాల వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గ్లోబల్ టెండర్లు పిలిచి స్థానికంగా ఏడాదిగా ఆఫీసు ఉండాలని నిబంధన పెట్టడం ఏమిటని వారు ప్రశ్నించినట్టు సమాచారం. తాము దేశవ్యాప్తంగా ఎక్కడైనా వ్యాపారం చేస్తామని, అంతేగానీ ప్రతి రాష్ట్రంలో ఆఫీసు ఏర్పాటు చేసుకోలేము కదా అని అన్నట్టు తెలిసింది. దీంతో పాటు రాష్ట్ర మిల్లర్లు టర్నోవర్ తగ్గించాలని కోరినట్టు సమాచారం.

‘గురుకుల టీచర్ల సమస్యలకు పరిష్కారం’

సాక్షి, హైదరాబాద్: బీసీ గురుకులాల్లో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్టు పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు తెలిపారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డితో కలిసి సంఘ నేతలు బుధవారం మంత్రిని కలిశారు. ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు.

రాజకీయ లబ్ధికే నిరాధార ఆరోపణలు

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేసీఆర్ ప్రభుత్వం ఒప్పుకోలేదని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంగీకరించడం వల్లే కేంద్రం తాజాగా రూ.9 వేల కోట్ల అప్పును ఇచ్చిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కొప్పుల ఈశ్వర్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రముఖులపై నిరాధార ఆరోపణలతో బురద చల్లడం రేవంత్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా ప్రజా సమస్యలను గాలికి వదిలి.. బీఆర్ఎస్‌ను బదనాం చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కయిందంటూ రేవంత్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీని కేసీఆర్ ప్రశ్నించినంతగా ఇతరులెవరూ ప్రశ్నించలేదని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి కోసమే రేవంత్ ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని ఈశ్వర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ఫినిష్ చేద్దామంటూ మోదీ, రేవంత్ నడుమ చర్చ జరిగినట్లు ఓ పత్రికలో వచ్చిందని, బీఆర్ఎస్ ఓటమికి కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేయాలని బండి సంజయ్ పిలుపునివ్వడాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియమితులైన స్టాఫ్‌నర్సులకు నియామక పత్రాలు ఇస్తూ.. ఆ ఘనతను కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు.

సోరెన్ అరెస్టు

మనీ లాండరింగ్ కేసులో అదుపులోకి తీసుకున్న ఈడీ

- అరెస్టు కంటే ముందే ముఖ్యమంత్రి పదవికి హేమంత్ రాజీనామా
- జార్ఖండ్ కొత్త సీఎంగా జేఎంఎం సీనియర్ నేత చంపయ్ సోరెన్

రాంచీ: జార్ఖండ్ రాజకీయాలు అనూహ్యమైన మలుపు తిరిగాయి. పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను బుధవారం రాత్రి 9.30 గంటలకు అరెస్టు చేశారు. గురువారం ఉదయం ఆయనను కోర్టులో ప్రవేశపెట్టబోతున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో సోరెన్‌ను తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. అరెస్టు కంటే ముందే హేమంత్ సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. నూతన ముఖ్యమంత్రిగా జేఎంఎం సీనియర్ నేత, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి చంపయ్ సోరెన్ పేరును అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)–కాంగ్రెస్–రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) నేతలు ప్రతిపాదించారు. మనీ లాండరింగ్ కేసులో తొలుత హేమంత్ సోరెన్‌ను ఈడీ అధికారులు పటిష్టమైన భద్రత మధ్య సుదీర్ఘంగా విచారించారు. అనంతరం ఆయన తమ ఎమ్మెల్యేలతో రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌ను కలిసి తన రాజీనామా పత్రాలు అందజేశారు. సీఎం పదవికి రాజీనామా చేసిన హేమంత్ సోరెన్‌ను నిమిషాల వ్యవధిలోనే ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు జేఎంఎం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి అధికార నివాసంలో సమావేశమయ్యారు. తమ పార్టీ శాసనసభాపక్ష నాయకుడి ఎన్నికపై చర్చించారు. కొత్త సీఎంగా చంపయ్ సోరెన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జేఎంఎం అధికార ప్రతినిధి వినోద్ పాండే చెప్పారు. మొత్తం 81 స్థానాలున్న అసెంబ్లీలో తమకు 47 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చంపయ్ సోరెన్ అన్నారు. అంతకుముందు హేమంత్ సోరెన్ స్థానంలో ఆయన భార్య కల్పనా సోరెన్ లేదా వదిన సీతా సోరెన్‌ను ముఖ్యమంత్రిగా నియమించబోతున్నారని ప్రచారం జరిగింది. హేమంత్ సోరెన్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారని జేఎంఎం మహిళా ఎంపీ మహువా మాఝీ చెప్పారు.


హేమంత్ సోరెన్

7 గంటలపాటు సోరెన్ విచారణ

మనీ లాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్‌ను ఈడీ అధికారులు బుధవారం ప్రశ్నించారు. రాంచీలోని సోరెన్ అధికార నివాసంలో 7 గంటలపాటు ఈ విచారణ కొనసాగింది. సోరెన్‌కు సంఘీభావం తెలియజేస్తూ ఆయన నివాసానికి జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలు తరలివచ్చారు. ఈడీ విచారణకు సోరెన్ పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని ఆరోగ్య శాఖ మంత్రి బన్నా గుప్తా చెప్పారు. ఈడీ విచారణను వ్యతిరేకిస్తూ పెద్ద సంఖ్యలో జేఎంఎం నేతలు, కార్యకర్తలు రాంచీకి చేరుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సోరెన్‌ను లక్ష్యంగా చేసుకొని, విచారణ పేరుతో వేధిస్తోందని వారు మండిపడ్డారు. దళితుడు కావడం వల్లే సోరెన్‌పై వేధింపులు మొదలయ్యాయని ఆరోపించారు. తమ ముఖ్యమంత్రి జైలుకు వెళితే తాము ఆయనతోపాటు వెళ్తామని తేల్చిచెప్పారు. ఇదే కేసులో ఈడీ అధికారులు ఈ నెల 20న హేమంత్ సోరెన్‌ను 7 గంటలపాటు విచారించారు. సోమవారం ఢిల్లీలో సోరెన్ నివాసంలో సోదాలు జరిపారు. చట్టవిరుద్ధంగా భూయాజమాన్య మార్పిడికి పాల్పడిన వ్యవహారంలో హేమంత్ సోరెన్ పాత్ర ఉన్నట్లు అభియోగాలు నమోదయ్యాయి.

ఈడీ అధికారులపై సోరెన్ ఫిర్యాదు

ఈడీ అధికారులపై హేమంత్ సోరెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సోరెన్ ఫిర్యాదు మేరకు రాంచీలోని ఎస్సీ/ఎస్టీ పోలీసు స్టేషన్‌లో కొందరు సీనియర్ ఈడీ అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఢిల్లీలోని తన నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించిందని, తనను వేధింపులకు గురిచేస్తోందని, తన సామాజిక వర్గాన్ని అప్రతిష్టపాలు చేస్తోందని ఫిర్యాదులో సోరెన్ ఆరోపించారు. ఈడీ అధికారుల తీరు వల్ల తన కుటుంబం మానసిక వేదన అనుభవిస్తోందని మండిపడ్డారు. ఈడీ అధికారులు సోమవారం ఢిల్లీలో హేమంత్ సోరెన్ ఇంట్లో సోదాలు చేశారు. రూ.36 లక్షల నగదు, కీలక పత్రాలతోపాటు ఓ ఖరీదైన కారును స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఆ నగదు, ఆ కారుతో తనకు సంబంధం లేదని హేమంత్ తేల్చిచెప్పారు.

ఎవరీ చంపయ్ సోరెన్?



జార్ఖండ్ కొత్త సీఎంగా చంపయ్ సోరెన్ పేరు ఖరారైంది. ఆయన 1956 నవంబర్‌లో జిలింగోరా గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. మెట్రిక్యులేషన్ చదివారు. తొలిసారిగా 1991లో సెరికేలా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటినుంచి వరుసగా విజయం సాధిస్తూనే ఉన్నారు. జేఎంఎం అధినేత శిబూ సోరెన్‌కు విధేయుడిగా పేరుగాంచారు. జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అయితే, శిబూ సోరెన్ కుటుంబంతో చంపయ్ సోరెన్‌కు ఎలాంటి బంధుత్వం లేదు. చంపయ్‌ను ప్రజలు జార్ఖండ్ టైగర్ అని పిలుస్తుంటారు.

కేజ్రీవాల్‌కు ఐదోసారి సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కుంభకోణంలో తాము ప్రశ్నించేందుకు తమ ఆఫీస్‌కు రావాలని మరోసారి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశించింది. ఈ మేరకు ఆయనకు సమన్లు జారీచేసింది. ఇలా ఆయనకు సమన్లు పంపడం ఇది ఐదోసారి. గత నాలుగుసార్లు ఆయన ఈడీ ఆఫీస్‌కు రాలేదు. దీంతో ఫిబ్రవరి రెండో తేదీన రావాలని తాజాగా ఈడీ సమన్లు జారీచేసింది. ఈనెల 18న, మూడున, గత ఏడాది నవంబర్ రెండు, డిసెంబర్ 21వ తేదీల్లోనూ సమన్లు జారీ అయ్యాయి. కేసుతో సంబంధంలేని తనకు సమన్లు పంపడం అక్రమమని కేజ్రీవాల్ ఆరోపిస్తూ ప్రతిసారీ గైర్హాజరయ్యారు. 2021–22 ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ విధాన రూపకల్పన కాలంలో నిందితులు కేజ్రీవాల్‌తో చాలా సార్లు సంప్రతింపులు జరిపారని ఈడీ ఆరోపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనకుండా తనను అరెస్ట్ చేయడానికి ఈడీ కుట్ర పన్నిందని కేజ్రీవాల్ ఆరోపించడం తెల్సిందే.


రాష్ట్రపతి ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకిస్తున్న సభ్యులు


ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ముర్ము

బలమైన దేశంగా ఎదిగాం!

బాలరాముడి ప్రాణప్రతిష్ట, ఆర్థిక సంస్కరణల్లో కీర్తిప్రతిష్ట

- పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటన
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగం
- మోదీ సర్కారు సాధించిన ఘనతల ప్రస్తావన
- భవిష్యత్తు తరాల కోసం ఘనమైన వారసత్వాన్ని నిర్మించాలని పిలుపు
- యువశక్తి, మహిళా శక్తి, రైతులు, పేదలు.. వికసిత్ భారత్‌కు నాలుగు మూలస్తంభాలు

న్యూఢిల్లీ: అయోధ్యలో రామమందిర నిర్మాణం అనే శతాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ కృషితో బలమైన దేశంగా ఎదిగామని చెప్పారు. బాలరాముడి ప్రాణప్రతిష్ట నిర్వహించుకున్నామని, మరోవైపు ఆర్థిక సంస్కరణల్లో కీర్తిప్రతిష్టలు సాధించామని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలు బుధవారం నూతన భవనంలో ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము దాదాపు 75 నిమిషాలపాటు ప్రసంగించారు. పార్లమెంట్ కొత్త భవనంలో ఆమె ప్రసంగించడం ఇదే మొదటిసారి. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన ఘనతలను ప్రస్తావించారు. ఉగ్రవాదం, విస్తరణవాదానికి మన సైనిక దళాలు తగిన సమాధానం చెబుతున్నారని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో మన దేశం ప్రపంచంలో మొదటి ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా అవతరించిందని గుర్తుచేశారు. భారత్ బలమైన దేశంగా మారిందన్నారు. ప్రతిష్టాత్మక జీ–20 సదస్సును కేంద్రం విజయవంతంగా నిర్వహించిందని, తద్వారా ప్రపంచంలో ఇండియా స్థానం మరింత బలోపేతమైందని వివరించారు. జమ్మూకశ్మీర్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ మొదటిసారి అంతర్జాతీయ సమావేశాలు జరిగినట్లు తెలియజేశారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ముర్ము ఇంకా ఏం మాట్లాడారంటే..

జనవరి 22 చిరస్మరణీయమైన రోజు

''రాబోయే శతాబ్దాలకు సంబంధించి దేశ భవిష్యత్తు స్క్రిప్ట్‌ను రాసుకోవాల్సిన సమయం వచ్చింది. మన పూర్వీకులు వేలాది సంవత్సరాల గొప్ప వారసత్వాన్ని మనకు వరంగా అందించారు. ప్రాచీన భారతదేశంలో అప్పటి మనుషులు సాధించిన విజయాలను ఇప్పటికీ సగర్వంగా గుర్తుచేసుకుంటున్నాం. రాబోయే కొన్ని శతాబ్దాలపాటు గుర్తుంచుకొనే ఘనమైన వారసత్వాన్ని ఇప్పటి తరం మనుషులు నిర్మించాలి. దేశ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో ఎన్నో ఘనతలు సాధించింది. దశాబ్దాల, శతాబ్దాల ఆకాంక్షలను నెరవేర్చింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం ప్రజలు శతాబ్దాలపాటు ఎదురుచూశారు. అది ఇప్పుడు నెరవేరింది. ఆలయం ప్రారంభమైన తర్వాత కేవలం ఐదు రోజుల్లో 13 లక్షల మంది దర్శించుకున్నారు. బాలరాముడి ప్రాణప్రతిష్ట జరిగిన జనవరి 22వ తేదీ నిజంగా చిరస్మరణీయమైన రోజు.

నక్సల్స్ హింసాకాండ తగ్గుముఖం

ఆర్టికల్ 370 రద్దుపై గతంలో ఎన్నో అనుమానాలు ఉండేవి. ఇప్పుడు ఆర్టికల్ 370 అనేది చరిత్రలో కలిసిపోయింది. ట్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకొచ్చింది. సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ భవిష్యత్తు నిర్మాణం కోసం మన శక్తిని గరిష్ట స్థాయిలో ఖర్చు చేసినప్పుడే దేశం ప్రగతి పథంలో వేగంగా ముందంజ వేస్తుంది. ప్రభుత్వం దేశ సరిహద్దుల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. సైనిక దళాలను బలోపేతం చేస్తోంది. అంతర్గత భద్రతకు సంబంధించిన ప్రభుత్వ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లో మార్కెట్లు, వీధులు గతంలో నిర్మానుష్యంగా కనిపించేవి. ఇప్పుడు జనంతో అవి కిక్కిరిసిపోతున్నాయి. జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలు మెరుగుపడ్డాయి. ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో వేర్పాటువాద ఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. శాంతియుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల సంఖ్య కూడా తగ్గిపోయింది. నక్సలైట్ల హింసాకాండ భారీగా తగ్గింది.

అదుపులోనే ద్రవ్యోల్బణం

'అభివృద్ధి చెందిన భారత్' అనే మహాసౌధం నాలుగు మూల స్తంభాలపై స్థిరంగా ఉంటుందని ప్రభుత్వం నమ్ముతోంది. అవి యువశక్తి, మహిళా శక్తి, రైతులు, పేదలు. ఈ నాలుగు వర్గాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. 'గరీబీ హఠావో' నినాదాన్ని మనమంతా చిన్నప్పటి నుంచి వింటున్నాం. పేదరికాన్ని పారదోలడాన్ని మన జీవితాల్లో మొదటిసారి చూస్తున్నాం. ఇండియాలో గత పదేళ్లలో ఏకంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ ప్రకటించింది. దేశంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.లక్ష కోట్ల మార్కును దాటడం హర్షణీయం. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాలు మన దేశ అభివృద్ధి ప్రయాణానికి బలాలుగా మారుతున్నాయి. ప్రతికూల పరిస్థితులు, ఒత్తిళ్లు ఎదురైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచింది. ప్రజలపై అదనపు భారం పడకుండా జాగ్రత్తవహించింది''.

మహిళలకు 15 వేల డ్రోన్లు

'2014 తర్వాత గత పదేళ్లుగా ద్రవ్యోల్బణ రేటు సగటున కేవలం 5 శాతం ఉంది. ప్రభుత్వ చర్యలతో ప్రజల చేతుల్లో డబ్బు ఆడుతోంది. సామాన్య ప్రజలు కూడా పొదుపు చేయగలుగుతున్నారు. మహిళలకు చేయూత ఇవ్వడానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. బ్యాంకు రుణాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సైనిక దళాల్లో శాశ్వత మహిళా కమిషన్‌ను మంజూరు చేసింది. సైనిక స్కూళ్లతోపాటు నేషనల్ డిఫెన్స్ అకాడమీలోనూ మహిళలకు ప్రవేశం కల్పిస్తోంది. ఎయిర్‌ఫోర్స్, నావికాదళంలోనూ మహిళలను ఆఫీసర్లుగా నియమిస్తోంది. అలాగే 2 కోట్ల మంది అక్కాచెల్లెమ్మలను లక్షాధికారులను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద మహిళలకు 15 వేల డ్రోన్లు అందజేయాలని నిర్ణయించింది'.

మహిళల సారథ్యంలో దేశాభివృద్ధి

'మూడు దశాబ్దాల నిరీక్షణ తర్వాత నారీశక్తి వందన్ అధినియం(మహిళా రిజర్వేషన్ చట్టం) పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ చట్టంతో చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుంది. మహిళల సారథ్యంలో దేశాభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ ఆశయం. ఈ చట్టాన్ని తీసుకొచ్చినందుకు పార్లమెంట్ సభ్యులకు నా అభినందనలు తెలియజేస్తున్నా. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతి తోడ్పాటునందిస్తున్నాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటి. రెండు వరుస త్రైమాసికాల్లో వృద్ధి రేటు 7.5 శాతానికిపైగానే నమోదైంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తోంది'.

25 వేల కిలోమీటర్లకు పైగా రైల్వే లైన్లు

'రైల్వేశాఖ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో వినూత్న చర్యలు చేపట్టింది. నమో భారత్, అమృత్ భారత్, వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. కొత్తగా 25 వేల కిలోమీటర్లకుపైగా రైల్వే లైన్లు వేసింది. కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న మొత్తం రైల్వే ట్రాక్ పొడవు కంటే ఇదే ఎక్కువ. రైల్వే శాఖలో 100 శాతం విద్యుదీకరణకు చాలా దగ్గరలో ఉన్నాం. దేశంలో తొలిసారిగా సెమీ–హైస్పీడ్ రైళ్లు ప్రారంభమయ్యాయి. 39 మార్గాల్లో వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 1,300 రైల్వేస్టేషన్లను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ప్రతి ప్రయాణికుడికి రైల్వేశాఖ 50 శాతం డిస్కౌంట్ ఇస్తోంది. దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రయాణికులకు ప్రతి ఏటా రూ.60 వేల కోట్ల సొమ్ము ఆదా అవుతోంది'.

నేడే బడ్జెట్

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల సమరశంఖం పూరించకముందే ఎన్నికల తాయిలాలతోపాటు సామాన్య ప్రజానీకం ఆశలను సాకారం చేస్తుందని అంతా భావిస్తున్న కేంద్ర మధ్యంతర బడ్జెట్ ఈరోజే పార్లమెంట్ ముందుకు రానుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉదయం 11 గంటల సమయంలో నూతన పార్లమెంట్ భవనంలోని లోక్‌సభలో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ముందుగా బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయానికి మంత్రి నిర్మల చేరుకుంటారు. బడ్జెట్ రూపకల్పనలో భాగస్వాములైన ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆమె రాష్ట్రపతి భవన్‌కు వెళ్తారు. ఉదయం 9.30 నిమిషాలకు రాష్ట్రపతిని కలిసి బడ్జెట్ గురించి వివరించి ఆమె అనుమతిని తీసుకోనున్నారు. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు నూతన పార్లమెంట్ భవనానికి నిర్మల, ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల బృందం చేరుకుంటుంది. బడ్జెట్ సమర్పణకు ముందు ఉదయం పార్లమెంట్ ఆవరణలో కేంద్ర మంత్రి మండలి ఒకసారి భేటీకానుంది. ఈ భేటీలోనే మధ్యంతర బడ్జెట్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపుతుంది. ఆ తర్వాత ఉదయం 11 గంటలకు మంత్రి లోక్‌సభలో అడుగుపెడతారు. బడ్జెట్ ప్రతులను చదివి ఆయా శాఖలకు నిధుల కేటాయింపులుసహా సమగ్ర బడ్జెట్ స్వరూపాన్ని ఆవిష్కరిస్తారు. లోక్‌సభలో ఆమె బడ్జెట్ ప్రసంగం పూర్తయ్యాక ఆయా పద్దుల ప్రతులను రాజ్యసభలో సభ్యులకు అందజేస్తారు. నిర్మల ఇలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరసగా ఆరోసారి. గురువారం నాటి బడ్జెట్‌తో కలుపుకుని ఐదు పూర్తి బడ్జెట్లు, ఒక మధ్యంతర బడ్జెట్‌ను ఆమె ప్రవేశపెట్టినవారవుతారు. దీంతో గతంలో మాజీ ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ పేరిట ఉన్న రికార్డును నిర్మల సమంచేయనున్నారు. మన్మోహన్ సింగ్, అరుణ్ జైట్లీ, చిదంబరం, యశ్వంత్ సిన్హాలు ఐదు సార్లే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.


నిర్మలా సీతారామన్


బడ్జెట్ మెరుపులు ఉంటాయా ?

అద్భుత ప్రకటనలు ఆశించవద్దని విత్త మంత్రి విస్పష్టంగా చెప్పారు. మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించే నూతన పథకాల అమలు బాధ్యత కొత్త ప్రభుత్వానిదే. అయినాసరే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మధ్యంతర బడ్జెట్‌లోనూ కొన్ని ఎన్నికల తాయిలాలు ప్రకటించే ధోరణి ఏనాడో మొదలైంది. 2004లో ఇదే ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో 50 శాతం డియర్‌నెస్ అలవెన్స్‌ను మూలవేతనంతో కలుపుతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రణబ్ ముఖర్జీ, పీయూశ్ గోయెల్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడూ ఇలాంటి ప్రకటనలు వెలువడ్డాయి. అందుకే ఈసారీ బడ్జెట్ ఊరటలు ఉంటాయని జనం గట్టిగా నమ్ముతున్నారు. పెట్రోల్, డీజిల్‌పై సుంకం తగ్గించి ధరలు కాస్తంత కిందకు దించడం, పీఎం–ఆవాస్ యోజన తరహా కొత్త పథకం, విద్యుత్ వాహనాలకు రాయితీ పొడిగింపు వంటి 'ఆర్థిక సాయం' కోసం మధ్యతరగతి వర్గాలు ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి. పన్ను శ్లాబులను సరళీకరిస్తే బాగుంటుందని ఆశిస్తున్నారు. ఆరోసారి పద్దుల చిట్టాతో పార్లమెంట్ గడప తొక్కుతున్న విత్తమంత్రి ఏమేరకు జనాలపై అద్భుత పథకాల పన్నీరు చల్లుతారో చూడాలి మరి.

మావోల బంకర్

తొలిసారిగా గుర్తించిన భద్రతా బలగాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు నిర్మించిన బంకర్‌ను భద్రతా బలగాలు గుర్తించారు. బస్తర్ డివిజన్‌లో మావోయిస్టులు బంకర్‌లను నిర్మించి వినియోగిస్తున్న విషయం బయటపడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. బస్తర్‌లో ఇలాంటివి ఉండొచ్చని భద్రతా బలగాలకు సమాచారం ఉందిగానీ ఇన్నాళ్లలో ఎన్నడూ ఒక్కదానిని కూడా గుర్తించలేకపోయారు. బీజాపూర్–దంతెవాడ జిల్లాల మధ్య ఇంద్రావతి నదీతీరంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరలను గుర్తించేందుకు జిల్లా రిజర్వ్ గార్డ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా బీజాపూర్ జిల్లాలోని తోడోపాట్–ఉస్పారీ గ్రామ సమీప అడవిలో మంగళవారం ఈ బంకర్‌ను భద్రతా బలగాలు గుర్తించాయని దంతేవాడ అదనపు ఎస్పీ బర్మన్ చెప్పారు. ఈ సొరంగం 130 మీటర్ల పొడవు, 6 అడుగుల లోతు, 3 అడుగుల వెడల్పుతో ఉంది. బంకర్ కనపడకుండా ప్రవేశమార్గాన్ని మట్టితో కూడిన కర్రలను కప్పి వాటిపైన చెట్ల పొదలను పరిచారు. మావోలు డంపింగ్ ప్రాంతంగానూ దీనిని వినియోగించినట్లు భద్రతాబలగాలు గుర్తించాయి. జనవరి 9న మావోయిస్టుల తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకున్నారు. మైదాన ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేస్తే డ్రోన్ల సాయంతో జాడ కనిపెట్టే అవకాశం ఉండటంతో ఇటీవలే ఈ బంకర్ నిర్మించి సమావేశం జరిపి ఉంటారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. ఇంద్రావతి నదిఒడ్డున ఏర్పాటు చేసిన ఈ బంకర్‌లో 100 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా దాక్కునేందుకు వీలుగా ఉంది. ఇలాంటి బంకర్‌లు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరిన్ని ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు, వాటిని గుర్తించేందుకు అడవుల్లో సోదాలు గాలింపు ముమ్మరం చేశారు. అబూజ్‌మడ్ అడవుల్లో ఇలాంటివి ఎన్ని బంకర్లు ఉన్నాయి? ఎక్కడ ఉన్నాయి? అనే అంశాలపై భద్రతాదళాలకు కొత్త సవాల్‌గా మారినట్టయ్యింది. వచ్చే వేసవిలో విస్తృతంగా కూంబింగ్ చేపట్టేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్న భద్రతాదళాలకు కనిపించని బంకర్‌లతో మరిన్ని చిక్కులు వచ్చి పడే అవకాశముంది.


పోలీసులు గుర్తించిన బంకర్

గాలి, వెలుతురు సోకేలా ఏర్పాట్లు

బైరాంఘర్ పోలీస్‌స్టేషన్, భద్రతాదళాల బేస్ క్యాంప్ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో ఈ బంకర్ ఉంది. బంకర్‌లోకి వచ్చి వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. గాలి, వెలుతురు సోకేలా ప్రతీ ఆరు మీటర్లకు ఒకటి చొప్పున ద్వారాలు ఏర్పాటు చేశారు. అయితే, ఇవి బయటకు కనిపించకుండా చెట్ల పొదలు అడ్డుపెట్టారు. మావో అగ్రనేతలు తలదాచుకునేందుకు ఉపయోగించుకోవడంతో పాటు మెరుపు దాడులకు వీలుగా దీనిని నిర్మించారని వార్తలొచ్చాయి. అయితే దీని నిర్మాణ వివరాలను భద్రతా బలగాలు ఇంకా అధికారికంగా బహిర్గతంచేయలేదు.

ఆత్మపరిశీలన చేసుకోండి

విపక్ష ఎంపీలకు ప్రధాని మోదీ హితవు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలిగించే విపక్ష ఎంపీలు ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ హితవు పలికారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు ప్రధాని బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. రామ్ రామ్ అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. ''ప్రజాస్వామ్యంలో విమర్శ, ప్రతిపక్షం అనేవి చాలా అవసరం. అయితే నిర్మాణాత్మక ఆలోచనలతో సభను సుసంపన్నం చేసిన వారినే ప్రజలు గుర్తుంచుకుంటారు. అంతరాయం సృష్టించిన వారిని ఎవరూ గుర్తుంచుకోరు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగకుండా అనుక్షణం నిరసనలు, నినాదాలను సభా కార్యకలాపాలను స్తంభింపజేసిన ఆ విపక్ష పార్టీల సభ్యులు తమ ప్రవర్తనను ఆత్మపరిశీలన చేసుకోవాలి. వారు తమ పాత పంథాను విడనాడాలి. వాళ్ల తమ సొంత పార్లమెంట్ నియోజకవర్గాల్లో తిరిగినా పాత సెషన్‌లో వీరు చేసిన వీరంగాన్ని ఎవ్వరూ గుర్తుంచుకోరు' అని విపక్ష ఎంపీలను ప్రధాని తప్పుబట్టారు. ''సాధారణంగా ఎన్నికల సమయంలో పూర్తి బడ్జెట్‌ను సమర్పించరు. మేము అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తాం. ఈసారి మళ్లీ మేమే వస్తాం. కొత్త ప్రభుత్వం ఏర్పాటుచేసి పూర్తి బడ్జెట్‌ను మీ ముందుకు తెస్తాం. ఈసారి ఆర్థిక మంత్రి కొన్ని మార్గదర్శక అంశాలతో మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించబోతున్నారు' అని మోదీ ప్రకటించారు. 'అభివృద్ధిలో దేశం అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తోంది. సమ్మిళిత, దేశ సర్వోతోముఖాభివృద్ధి ప్రయాణం ఆగదు'' అని వ్యాఖ్యానించారు.

రాహుల్ యాత్రలో అపశ్రుతి

- రాహుల్ కారు అద్దం ధ్వంసం
- రాళ్లదాడే కారణమన్న అధీర్
- ఇదంతా డ్రామా అన్న మమత

మాల్దా: ఎన్డీఏ కూటమిని ఓడించేందుకు సార్వత్రిక సమరంలో కాంగ్రెస్‌తో కలిసి నడిచేది లేదని తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించిన వేళ టీఎంసీతో కాంగ్రెస్ కస్సుబుస్సులు ఒక్కసారిగా బయటపడ్డాయి. వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో రాహుల్ భారత్ జోడో న్యాయ్‌యాత్ర బిహార్ నుంచి పశ్చిమబెంగాల్‌లోకి మరోసారి అడుగుపెట్టిన సందర్భంగా రాహుల్ కారు అద్దం పగిలిన ఘటన జరిగింది. రాహుల్ ప్రయాణిస్తున్న కారుపై ఆగంతకులు రాళ్లదాడి చేయడంతో కారు వెనక అద్దం ధ్వంసమైందని పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధీర్ రంజన్ ఆరోపించారు. మాల్దా పరిధిలోని హరిశ్‌చంద్రపూర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. కారు అద్దం పగిలిన ఘటనపై తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ స్పందించారు. '' పశ్చిమబెంగాల్‌లోకి అడుగుపెట్టకముందే కారు అద్దం పగిలింది. బిహార్‌లో ఘటన జరిగితే బెంగాల్‌లో ఆరోపణలు చేస్తున్నారు. ఇదంతా పెద్ద డ్రామా' అని మమత అన్నారు. రాహుల్ కారుపై దాడి ఘటనపై బీజేపీ సైతం పరోక్షంగా ఖండించింది.

జ్ఞానవాపి మసీదు సెల్లార్‌లో పూజలు చేసుకోండి

- పూజల బాధ్యత కాశీ విశ్వనాథ్ ట్రస్ట్‌దే
- జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించిన వారణాసి జిల్లా కోర్టు

వారణాసి: వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని ఆనుకుని ఉన్న వివాదాస్పద జ్ఞానవాపి మసీదు కేసు బుధవారం అత్యంత కీలక మలుపు తీసుకుంది. మసీదు ప్రాంగణంలో భారత పురావస్తు శాఖ చేసిన శాస్త్రీయ సర్వే నివేదిక ప్రకారం మసీదు కింద ఒకప్పుడు ఆలయం ఉండేదని బయటపడిన నేపథ్యంలో హిందువుల అనుకూలంగా వారణాసి కోర్టు నుంచి తాజా ఉత్తర్వులు వెలువడ్డాయి. మసీదు సెల్లార్‌లోని హిందూ దేవతలను ఆరాధించేందుకు, పూజా కార్యక్రమాలు చేసుకునేందుకు ఒక పూజారికి అనుమతినిస్తూ వారణాసి జిల్లా కోర్టు బుధవారం ఉత్తర్వులిచ్చింది. మసీదు ప్రాంగణంపై యాజమాన్య హక్కుల కేసులో పిటిషనర్ అయిన శైలేంద్ర కుమార్ పాఠక్‌కు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయని ఆయన తరఫు న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ చెప్పారు. '' ఏడు రోజుల్లోగా ఆ మసీదు సెల్లార్‌లో పూజకు అనువుగా ఏర్పాటు చేయాలని జిల్లా మేజిస్ట్రేట్‌ను వారణాసి జిల్లా కోర్టు జడ్జి ఏకే విశ్వేశ ఆదేశించారని లాయర్ మదన్ వెల్లడించారు. ప్రపంచ ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న కాశీ విశ్వనాథ్ ట్రస్టుకు ఈ పూజల బాధ్యతలు అప్పగించింది. పిటిషనర్ శైలేంద్ర తాత,పూజారి సోమ్‌నాథ్ వ్యాస్ గతంలో ఈ సెల్లార్‌లోనే 1993 డిసెంబర్‌దాకా పూజలు చేసేవారు. ఆ క్రమంలోనే ఇక్కడ పూజలు చేసుకునే హక్కులు తమకు దక్కుతాయంటూ ఆయన కోర్టు ఆశ్రయించారు. మసీదులో చిన్న కొలను వజూఖానా ముందున్న నంది విగ్రహం వద్ద బ్యారీకేడ్లను తొలగించాలని, పూజలకు మార్గం సుగమం చేయాలని జడ్జి ఆదేశించారు.

తోషఖానా కేసులో ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్‌ఖాన్‌కు కష్టాల మీద కష్టాలు వచ్చిపడుతున్నాయి. తోషఖానా కేసులో ఇమ్రాన్‌ఖాన్‌కు, ఆయన భార్య బుష్రా బీబీకి ఇస్లామాబాద్ కోర్టు 14 ఏళ్ల చొప్పున జైలుశిక్ష విధించింది. విదేశీ నాయకులు ఇచ్చిన ఖరీదైన బహుమతులను విక్రయించి, సొమ్ము చేసుకున్నట్లు ఇమ్రాన్ దంపతులపై అభియోగాలు నమోదయ్యాయి. దర్యాప్తులో అదంతా నిజమేనని తేలడంతో న్యాయస్థానం బుధవారం శిక్ష ఖరారు చేసింది. దోషులకు కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. పదేళ్ల పాటు ఎన్నికల్లో పాల్గొనరాదంటూ కోర్టు ఇమ్రాన్ ఖాన్‌పై అనర్హత వేటు కూడా వేసింది. 1.5 బిలియన్ల జరిమానా చెల్లించాలని ఇమ్రాన్ దంపతులను ఆదేశించింది. ఫిబ్రవరి 8న పాకిస్తాన్ పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. విదేశాలకు అధికారిక పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి దేశాధినేతలు బహుమతులు ఇస్తుంటారు. అవన్నీ ప్రభుత్వానికే చెందుతాయి. తోషఖానాలో భద్రపర్చాల్సి ఉంటుంది. ఇమ్రాన్ మాత్రం సొంత ఆస్తిలాగా అమ్మేసుకున్నారు. అధికార రహస్యాల వెల్లడి కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు మూడు రోజుల క్రితం 10 సంవత్సరాల జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే.


సాక్షి హైదరాబాద్

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



సీవీ ఆనంద్ పేరుతో..

ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ పేరుతో సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో రెండు..తాజాగా మరో నాలుగు నకిలీ ఖాతాలను అధికారులు గుర్తించారు. -8లో



కత్తిమీద సామే!

గ్రేటర్‌లో ఎస్‌హెచ్‌ఓలు ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. తప్పలేకున్నా..అనుకోకుండా చిన్నచిన్న కేసుల్లోనూ వీరు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. -8లో

కంటోన్మెంట్ పదవీ కాలం పొడిగింపు



సికింద్రాబాద్ కంటోన్మెంట్ వేరీడ్ బోర్డును మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు జాయింట్ సెక్రెటరీ రాకేశ్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత బోర్డు పదవీ కాలం ఫిబ్రవరి 10 నాటికి ముగియనుండగా... తాజా ఉత్తర్వులతో పొడిగించారు. -8లో

దొంగలు.. దారుణాలు

- ఆరాంఘర్‌లో సెక్యూరిటీ గార్డు...
- గగన్‌మహల్‌లో వృద్ధురాలు హతం





హత్యకు గురైన ఆసిఫ్, స్నేహలత

నగర పరిధిలోని రెండు చోట్ల దొంగలు దారుణానికి ఒడిగట్టారు. దొంగతనాలకు అడ్డొచ్చిన ఇద్దర్ని హతమార్చారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరాంఘర్ వద్ద ఓ ఇనుప వస్తువుల తయారీ కేంద్రంలో దొంగలు చొరబడి సెక్యూరిటీ గార్డు మహ్మద్ ఆసిఫ్ (28)ను ఇనుపరాడ్లతో తీవ్రంగా కొట్టి హత్యచేశారు. ఇక్కడ రెండు టన్నుల ఇనుప వస్తువులు, రాడ్‌లు, ఐదు సీసీ కెమెరాలు, హార్డ్‌డిస్క్ చోరీకి గురైనట్లు గుర్తించారు. మరో ఘటనలో దోమలగూడ పరిధి గగన్‌మహల్‌లోని ఓ ఇంట్లో స్నేహలత అనే వృద్ధురాలిని హత్య చేసి దొంగలు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆమెను కట్టేసి..నోట్లో వస్త్రాలు కుక్కి దారుణంగా హింసించారు. ఇంట్లో పని చేసే సర్వెంట్ మహేశ్ ఈ పనికి పాల్పడి ఉంటాడని అతనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- వివరాలు 8లో







ఉద్యోగానందం

వైద్యారోగ్య శాఖ పరిధిలోని స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు అర్హత పొందిన 6,956 మందికి బుధవారం ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్టేడియంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. నియామక పత్రాలు అందుకున్న వారు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు.

ట్రాఫిక్‌పై ఏం చేద్దాం?



ట్రాఫిక్‌పై సమీక్ష సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులు



భవిష్యత్తు అవసరాలపై సమగ్ర ప్రణాళిక

- సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయి పెంపు
- సిబ్బంది కొరత లేకుండా హోంగార్డుల నియామకాలు
- మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్ల కోసం కొత్త పాలసీ
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ సిటీలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందు చూపుతో చర్యలు చేపట్టాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను పోలీస్ విభాగం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, పోలీసు విభాగాలు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్‌నిర్వహణ, నియంత్రణపై బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని, నిపుణులైన కన్సల్టెన్సీలకు బాధ్యతలు అప్పగించి ప్రత్యేకంగా అధ్యయనం చేయించాలన్నారు. సిబ్బంది కొరత లేకుండా మూడు నెలల్లో హోంగార్డుల నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో లా అండ్ ఆర్డర్ పోలీసులను గ్రేటర్ సిటీ ట్రాఫిక్ కంట్రోల్ విధులకు వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయిని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.

పార్కింగ్ పాలసీ..

పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రధాన రహదారులు, జంక్షన్ల విస్తరణపై దృష్టి పెట్టాలని అన్నారు. ఎల్బీ నగర్ జంక్షన్ తరహాలో సబ్ వే, అండర్ పాస్‌లను ఎక్కడెక్కడ నిర్మించాలి... అక్కడున్న సాధ్యాసాధ్యాలను గుర్తించాలన్నారు. ప్రధాన జంక్షన్లు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది తప్పకుండా అక్కడ ఉండేలా ఏర్పాట్లు చేయాలని, కేవలం ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ మీద ఆధారపడకూడదని అన్నారు. టూ వీలర్ ట్రాఫిక్ ఇంటర్సెప్టర్లపై ఎస్ఐలు, కానిస్టేబుళ్లను పంపించి ట్రాఫిక్ జామ్ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీలైనన్ని చోట్ల మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సెంటర్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఇందుకోసం ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని, పార్కింగ్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వ పరంగా రాయితీలు ఇవ్వాలని చెప్పారు. అన్ని విధివిధానాలతో ప్రత్యేక పార్కింగ్ పాలసీని రూపొందించాలని సీఎం ఆదేశించారు.

నిర్మాణాలకు అనుమతిచ్చేటప్పుడు..

హైదరాబాద్‌లో బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు ఆ ఏరియాలో ఉండే ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకోవాలని ఆదేశించారు. లే అవుట్లకు హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చేటప్పుడు అక్కడ రోడ్లు, పార్కులు, మౌలిక వసతులకు ఎంత స్థలం కేటాయించాలనే ప్రమాణాలు పున: పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, ముఖ్యమంత్రి కార్యదర్శి షానవాజ్ ఖాసీం, అడిషనల్ డీజీ ఇంటలిజెన్స్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ కాంగ్రెస్ పార్టీలో కదలిక

- లోక్‌సభ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం
- పోటీకి సై అంటున్న ఆశావహులు

ఇక 'ఢిల్లీ' పోటు!



సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్ పార్టీలో వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ఆసక్తి పెరిగింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కారణంగా లోక్ సభ ఎన్నికలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పలువురు నేతలు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. బుధవారం నుంచి గాంధీ భవన్‌లో దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆశావాహుల్లో హడావుడి నెలకొంది. గ్రేటర్ పరిధిలోని సికింద్రాబాద్, మల్కాజిగిరితో పాటు పాతబస్తీ హైదరాబాద్ నుంచి కూడా ఎన్నికల బరిలో దిగేందుకు నేతలు ఆసక్తి చూపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఓటమి పాలైన అభ్యర్థులతో పాటు అవకాశం చిక్కని అభ్యర్థులు కూడా లోక్‌సభ స్థానాల్లో పోటీకి సై అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మొన్నటి వరకు మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించగా, సికింద్రాబాద్, చేవెళ్ల గతంలో చేజారిన స్థానాలే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లోక్ సభ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఓట్ల శాతం కూడా పెరిగింది. ప్రస్తుతం అధికార బలం కూడా కలిసి వస్తోందని ఆశావాహులు భావిస్తున్నారు.

తొలిరోజు దరఖాస్తులు..

తొలిరోజు మల్కాజిగిరి స్థానానికి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన లోక్ సభ స్థానాలకు కూడా పలువురు దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి పోటీ చేసేందుకు ఫిరోజ్ ఖాన్‌తోపాటు డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీవుల్లా, సికింద్రాబాద్ నుంచి అక్కడి డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆసక్తి కనబర్చుతున్నట్లు సమాచారం. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి వివిధ నియోజకవర్గాల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈసారి గట్టిగానే మజ్లిస్ పార్టీని ఢీ కొట్టవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది.

న్యూస్‌రీల్

రూ.4.55 కోట్ల ఆస్తి పన్ను చెల్లించిన డీఆర్‌డీఎల్

చాంద్రాయణగుట్ట: కంచన్‌బాగ్‌లోని కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ డీఆర్‌డీఎల్‌కు సంబంధించిన రూ.4.55 కోట్ల ఆస్తి పన్ను బకాయిలను బుధవారం జీహెచ్ఎంసీ అధికారులకు చెల్లించారు. వార్షిక ఆస్తి పన్ను వసూళ్లలో భాగంగా సర్కిల్–8 (చాంద్రాయణగుట్ట)లోని 413, 418 డాకెట్‌లోని బకాయిలకు సంబంధించిన చెక్‌ను డీఆర్‌డీఎల్ ఉన్నతాధికారులు జీహెచ్ఎంసీ ఏఎంసీ మోహన్ రెడ్డికి అందజేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ వెంకన్న, డీసీ సురేందర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తున్నామని ఏఎంసీ తెలిపారు.



చెక్‌ను అందజేస్తున్న డీఆర్‌డీఎల్ అధికారులు

ఈ నెల 16న ఆటో బంద్

సాక్షి, సిటీబ్యూరో: దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా తెలంగాణలో ఆటో క్యాబ్ లారీ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 వ తేదీన ఒక రోజు బంద్ నిర్వహించనున్నట్లు ఆటో సంఘాల జేఏసీ నాయకులు వెంకటేశం, మారయ్య, సత్తిరెడ్డి తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆటో కార్మికులు బంద్‌లో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

నుమాయిష్‌లో చిల్డ్రన్స్‌డే

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో బుధవారం చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహించారు. పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పించారు. చిన్నపిల్లలు తల్లిదండ్రులతో విచ్చేసి సందడి చేశారు. ఎగ్జిబిషన్ నలుమూలలా పిల్లలు అమ్యూజ్‌మెంట్ విభాగాలలో వివిధ రకాల ఆటలు ఆడారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్తేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి రాజేందర్‌కుమార్‌లు ఎగ్జిబిషన్‌కు పలు ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 15 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.

భవనాల లెక్కెంత?

నగరంలో భవంతులపై స్పెషల్ సర్వే

- ఆస్తి పన్ను ఎగవేతకు చెక్ చెప్పేందుకే..



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో భవనాల సర్వే, జీఐఎస్ మ్యాపింగ్ కోసం అధికారులు సిద్ధమయ్యారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని భవనాల నుంచి రావాల్సినంత ఆస్తిపన్ను రావడం లేదు. భవనాల్లో ట్యాక్స్ పరిధిలోకి రాకుండా ఉన్న భవనాలతో (అన్ అసెస్డ్) పాటు ఎక్కువ విస్తీర్ణంలోని భవనాలు తక్కువ ఆస్తిపన్ను (అండర్ అసెస్డ్) చెల్లిస్తున్నవి కూడా ఉన్నాయి. ఇవి లెక్కకు మిక్కిలిగా ఉండటంతో జీహెచ్ఎంసీ ఖజానాకు గండి పడుతోంది. ఇందుకు అటు భవన యజమానులతో పాటు, ఇటు జీహెచ్ఎంసీ అధికారులు కూడా కారణమే. ఉభయులూ కుమ్మక్కై జీహెచ్ఎంసీని ముంచుతున్నారు. ఈ పరిస్థితి నివారణకు నగరంలోని అన్ని భవనాలను, వాటి విస్తీర్ణాన్ని సరిగ్గా గుర్తించేందుకు తాజా సర్వేకు అధికారులు సిద్ధమయ్యారు. గతంలోనూ రెండు మూడు పర్యాయాలు ఇలాంటి చర్యలకు సిద్ధమైనా పని పూర్తిచేయలేదు. ఇప్పుడు మళ్లీ అలాంటి కార్యక్రమానికి జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. ఈసారి భవనాలతోపాటు యుటిలిటీస్‌ను కూడా సర్వేలో గుర్తించనున్నారు. జీఐఎస్ బేస్డ్ సర్వేతోపాటు భవనాలు, యుటిలిటీస్‌ను మ్యాపింగ్ చేస్తారు. తద్వారా నగరంలోని అన్ని భవనాలను గుర్తించడంతోపాటు వాటి వినియోగాన్ని బట్టి సరైన ఆస్తిపన్ను నిర్ధారించి వసూలు చేయడం ద్వారా భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. సర్వే , మ్యాపింగ్ కోసం కాంట్రాక్టు ఏజెన్సీలను ఆహ్వానిస్తూ టెండరు పిలిచారు. టెండరు ద్వారా ఈ పనిని దక్కించుకునే ఏజెన్సీ ఏడాదిన్నరలో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా పూర్తిచేయడంతోపాటు మరో రెండేళ్లు నిర్వహణ కూడా చేయాల్సి ఉంటుంది.

లెక్కకు మిక్కిలి వ్యత్యాసాలు

జీహెచ్ఎంసీలో ఆస్తిపన్ను పరిధిలోని భవనాలు 17 లక్షలకు పైగా ఉన్నాయి. ఏటా దాదాపు 20 వేల వరకు కొత్త నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఆమేరకు ఆస్తిపన్ను రావడం లేదు. అందుకు కారణం చాలా భవనాల యజమానులు ఆస్తిపన్ను పరిధిలోకి రాకపోవడమే. అసెస్‌మెంట్లలోనూ అక్రమాలతో వాస్తవంగా చెల్లించాల్సిన ఆస్తిపన్ను కంటే తక్కువ ఆస్తిపన్ను చెల్లిస్తున్నారు. ఇలా అన్ అసెస్డ్, అండర్ అసెస్డ్ వల్ల నగరంలో ఎన్ని నిర్మాణాలు వస్తున్నా జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను ఆదాయం మాత్రమ పెరగడం లేదు. ఇలా వివిధ కారణాలతో జీహెచ్ఎంసీ పరిస్థితి దిగజారుతోంది. ఈ పరిస్థితి నివారించేందుకు పకడ్బందీగా నగరంలోని అన్ని భవనాలను గుర్తించి, రావాల్సిన ఆస్తిపన్ను వసూలు చేస్తే జీహెచ్ఎంసీలో జీతాల చెల్లింపులకు ఇబ్బందులు, అప్పులపాలు కావడం వంటివి ఉండవని భావిస్తున్నారు. గతంలో ఖైరతాబాద్ జోన్‌లోని వ్యాపార ప్రాంతాల్లో ఎన్ని భవనాలున్నాయో సర్వే చేయాలనుకున్నారు. కానీ పూర్తిచేయలేదు. మరోమారు డ్రోన్ల ద్వారా భవనాలను సర్వే చేయాలనుకున్నారు. అదీ చేయలేదు. ఈసారైనా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తారో లేదో మరి.

మేముగానీ వండితే..

గచ్చిబౌలిలో సందడిగా ఇంటర్నేషనల్ యంగ్ చెఫ్ పోటీలు



ఒలంపియాడ్‌లో పాల్గొన్న యంగ్ చెఫ్‌లు వీరే..

- పాల్గొన్న పది దేశాలకు చెందిన చెఫ్‌లు
- 4న కోల్‌కతాలో గ్రాండ్ ఫినాలే

గచ్చిబౌలి: దేశ విదేశాలకు చెందిన చెఫ్‌లు సందడి చేశారు. అదిరి పోయే వంటలతో ఆకట్టుకున్నారు. గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్(ఐఐహెచ్‌ఎం) క్యాంపస్ ఇందుకు వేదికైంది. బుధవారం ఇక్కడ ఇంటర్నేషనల్ యంగ్ చెఫ్ ఒలంపియాడ్ (వైసీఓ) మొదటి రౌండ్ పోటీలను నిర్వహించారు. మన దేశంతోపాటు మలేషియా, జోర్డాన్, ఇరాన్, అక్సెంబర్గ్, శ్రీలంక, నైజీరియా, మాల్దీవులు, ఐర్లాండ్, ఇథియోపియా దేశాలకు చెందిన యంగ్ చెఫ్‌లు ఈ పోటీలలో పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద వంటల ఒలంపియాడ్‌ను హైదరాబాద్‌తోపాటు పూణే, ఢిల్లీ, గోవా, బెంగళూరు వంటి నాలుగు ఇతర నగరాల్లో ఒకే రోజున ఒకేసారి నిర్వహించడం విశేషం. పోటీదారులకు మొదట స్కిల్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం వీరు శాకాహార వంటకం, డెజర్ట్ తయారీలో తమ పాక నైపుణ్యాలను ప్రదర్శించారు. పసందైన వంటకాలతో ఆకట్టుకున్నారు. అంతర్జాతీయ న్యాయమూర్తుల ప్యానెల్ పోటీలను పరిశీలించింది. హైదరాబాద్‌లోని కొరియన్ గౌరవ కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి, ఐపీఎస్ అధికారిణి అభిలాష్ బిస్త్, ఐఐహెచ్‌ఎం హైదరాబాద్ డైరెక్టర్ ఎర్నెస్ట్ ఇమ్మాన్యుయేల్, ఐఐహెచ్‌ఎం చైర్మన్ డాక్టర్ సుబోర్నో బోస్ తదితరులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 4న కోల్‌కతాలో గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వంటకాలను పరిశీలిస్తున్న కొరియన్ గౌరవ కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి తదితరులు

భయపెట్టిన ఆర్టీసీ బస్సు

బ్రేకు ఫెయిలై వాహనాల పైకి దూసుకెళ్లిన వైనం..

హయత్‌నగర్: రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సు బ్రేకు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మూడు ద్విచక్రవాహనాలు, ఒక కారు, ఒక ఆటో స్వల్పంగా దెబ్బ తినగా ఓ మహిళకు గాయాలయ్యాయి. ఆర్టీసీ అధికారుల కథనం ప్రకారం...దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన బస్సు (టీఎస్ 07జెడ్4106) బుధవారం ఉదయం చౌటుప్పల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వస్తుంది. హయత్‌నగర్‌లోని భాగ్యలత సమీపంలోకి రాగానే రహదారిపై ఉన్న ఓ రాయి బస్సు కింది భాగంలో తగిలింది. దీంతో డ్రైవర్ ధర్మయ్య బ్రేకు వేసేందుకు ప్రయత్నించగా బస్సు ఆగలేదు. బ్రేకు పడకపోవడంతో బస్సు ఎడమ వైపునకు వెళ్లింది. దీంతో రోడ్డుకు ఎడమ వైపున ఉన్న వాహనాలపైకి వెళ్లింది. స్పందించిన డ్రైవర్ ముందు బ్రేకును వేయడంతో బస్సు అదుపులోకి వచ్చింది. రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఓ మహిళతో పాటు మరికొందరికి స్వల్పంగా గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఆర్ఎం వరప్రసాద్, డీఆర్ఎంలు జగన్, సుచరిత, డీఎం శ్రీహరిలు సందర్శించారు. బస్సు డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పిందని వారు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

మద్యం మత్తులో బస్సు కండక్టర్‌పై మహిళ దౌర్జన్యం



కండక్టర్‌పై దాడి చేసిన మహిళ

నాగోలు: మద్యం మత్తులో బస్సు కండక్టర్‌పై ఓ మహిళ దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు కండక్టర్‌పై దాడిచేసిన మహిళపై ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హయత్‌నగర్ బస్ డిపో–1కు చెందిన కండక్టర్ గంగాధర్ జనవరి 25న తెల్లవారుజామున 5:30 గంటలకు హయత్‌నగర్ నుంచి అఫ్జల్‌గంజ్ రూట్‌లో నడిచే 71 నెంబర్ బస్సులో ఎల్‌బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపుగా వెళ్తున్నారు. ఎల్‌బీనగర్‌లో ఓ మహిళా ప్రయాణికురాలు మద్యం మత్తులో బస్సులోకి ఎక్కింది. ఆమెను కండక్టర్ ఆధార్ కార్డు అడిగాడు. తన దగ్గర గుర్తింపు కార్డు లేదని చెప్పి రూ.500 నోటు ఇచ్చింది. దీంతో కండక్టర్ తెల్లవారు జామున కావడంతో తన వద్ద చిల్లర లేదని చెప్పాడు. అప్పటికే కండక్టర్ తన సొంత డబ్బుతో టికెట్ తీశాడు. దీంతో ఆ మహిళ కండక్టర్‌పై దౌర్జన్యానికి దిగి దుర్భాషలాడింది. చేయితో కొడుతూ..కాలుతో తన్నుతూ దాడి చేసింది. బస్సులో ఉన్న ఓ మహిళ కండక్టర్ అడ్డుకోగా ఆమెను కూడ బూతులు తిడుతూ ఇబ్బందులకు గురి చేసింది. తోటి ప్రయాణికులు ఎంత వారించినా సదరు మహిళ పట్టించుకోలేదు. బస్సులో ఉన్న ప్రయాణికులు ఈ తతంగాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. ఇది గమనించిన హయత్‌నగర్ డిపో మేనేజర్ జలగం విజయ్ వీడియో క్లిప్పింగ్‌తో బుధవారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిధులిస్తారా...చెత్త వదిలిస్తారా?

జీహెచ్ఎంసీ పనులపై నేడు మంత్రి పొన్నం సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు..జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జీహెచ్ఎంసీకి వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఆదాయమెంత..అవుతున్న ఖర్చెంత ? ప్రాజెక్టులకు సంబంధించి ఏ పనులు ఏ దశలో ఉన్నాయి.. పూర్తయ్యేందుకు ఎన్ని నిధులవసరం..సిబ్బందికి నెలనెలా జీతాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? తదితర అంశాలపై అధికారుల నడిగి తెలుసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇదే తరుణంలో నగరంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిల్వలు, నిధులు భారీగా ఖర్చవుతున్నా తగ్గని దోమల స్వైర విహారం.. లెక్కకు మిక్కిలి నిధులు వెచ్చిస్తున్నా తప్పని కుక్కకాట్లు తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఇదే తరుణంలో జోన్లలో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు, అవినీతి అక్రమాల గురించి కూడా అధికారుల వద్ద ప్రస్తావించే అవకాశం ఉంది. అన్నీ తెలుసుకొని ప్రభుత్వం నుంచి జీహెచ్ఎంసీకి తగిన నిధులిప్పిస్తారా ? అనే చర్చ మొదలైంది. చెత్త సమస్యల పరిష్కారంతో పాటు ఇష్టారాజ్యంగా నడుస్తున్న జీహెచ్ఎంసీ పరిపాలనను గాడిలో పెట్టగలరా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి.

జీహెచ్ఎంసీలో వివిధ విభాగాలను పర్యవేక్షించే అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులతోపాటు ఇంజినీరింగ్, విద్యుత్, బయోడైవర్సిటీ, ఎంటమాలజీ తదితర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న బడా బడా బాబులను వదిలి చిరుజీవులపై అధికారులు తమ ప్రతాపాన్ని చూపడం వంటి అంశాలు కూడా ఈ సందర్భంగా చర్చకు రాగలవని భావిస్తున్నారు.

కత్తిమీద సామే!

- ఒత్తిళ్ల మధ్య ఎస్‌హెచ్‌ఓల విధులు
- చిన్నపాటి ఆరోపణలపైనా చర్యలు
- అయితే బదిలీ..లేకపోతే సరెండర్
- విమర్శలకు దారితీస్తున్న ఉన్నతాధికారుల తీరు

సాక్షి, సిటీబ్యూరో: వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో అన్నదమ్ములకు మధ్య తగాదా నెల కొంది. దీంతో తమ్ముడు ఒకరోజు శివారు ప్రాంతంలోని ఠాణాకు వెళ్లి 'స్టేషన్ హౌస్ ఆఫీసర్' (ఎస్‌హెచ్‌ఓ)ను కలిసి తన బాధను వెల్లడించాడు. వారసత్వంగా వచ్చిన స్థలం కోసం అన్నదమ్ముల మధ్య గొడవలెందుకుని ఇద్దరినీ ఠాణాకు పిలిచి ఇన్‌స్పెక్టర్ నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన అన్న.. పోలీసు ఉన్నతాధికారులను కలిసి ఇన్‌స్పెక్టర్ తనకు అన్యాయం చేస్తున్నాడంటూ ఫిర్యాదు చేశాడు. సీన్ కట్ చేస్తే మర్నాడే సదరు ఎస్‌హెచ్‌ఓపై బదిలీ వేటు పడింది. ఆ తర్వాత ఉన్నతాధికారుల జరిపిన అంతర్గత విచారణలో సదరు ఎస్‌హెచ్‌ఓ హద్దు మీరలేదని, ఉద్దేశపూర్వకంగానే అన్న ఎస్‌హెచ్‌ఓపై ఫిర్యాదు చేశాడని తేలింది.'

...ఇది ట్రై కమిషనరేట్లలోని పలువురి ఎస్‌హెచ్‌ఓల పరిస్థితి. చిన్న ఆరోపణ వచ్చినా చాలు అయితే బదిలీ లేకపోతే సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో సమాజంలో ధైర్యం కల్పించాల్సిన పోలీసులే, మానసికంగా ఆందోళన చెందుతున్నారు. నగరంలోని మూడు కమిషనరేట్లలో ఇప్పటికే వందలాది మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ కాగా పలువురు సరెండర్ కావడమే ఇందుకు ఉదాహరణ.

తొలిరోజు నుంచే బదిలీలు..

ట్రై కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు పోలీసు సిబ్బందిలో నైరాశ్యం నింపుతున్నాయి. బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచే కొత్త పోలీసు బాస్‌లు బదిలీలకు తెరలేపారు. పోలీసు శాఖలో అవినీతిపరులే కాదు నిజాయితీ ఎస్‌హెచ్‌ఓలూ ఉంటారనడంలో సందేహం అక్కర్లేదు. అయితే ఇలాంటి ఇన్‌స్పెక్టర్లు పోస్టింగులలో కన్నా లూప్‌లైన్‌లోనే ఎక్కువగా ఉంటారు. ప్రతి అంశాన్ని చట్టపరిధిలో చూడాలంటే పోలీసు వ్యవస్థలో కొంత ఇబ్బందే. కొన్ని అంశాలను హెచ్చరికలతో అణచివేస్తారు. మరికొన్ని పరిణామాలపై మరోలా వ్యవహరిస్తారు. కానీ ఇలాంటివి చేయడం కూడా తప్పే అన్నట్లుగా పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడం..వాటిని కఠినంగా అమలు చేయడంతోనే నిజాయితీగా పనిచేస్తున్న ఎస్‌హెచ్‌ఓలకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి.

ఆత్మస్థైర్యం నింపాలి..

ప్రతి ఫిర్యాదుపై ఉన్నతాధికారులు పక్కాగా విచారణ చేపట్టాల్సిందే. ఫిర్యాదులో ఉన్న ఆరోపణలకు అనుగుణంగా ఆధారాలు ఉంటే ఆ ఎస్‌హెచ్‌ఓపై ఎలాంటి చర్యలు తీసుకున్నా తప్పులేదు. కానీ కొందరు నిజాయితీగా పని చేస్తున్న సీఐలపైనా తప్పుడు ఫిర్యాదులు చేసినా వారిపై కూడా వేటు తప్పడం లేదు. దీంతో తమను ఈ పోస్టింగ్‌ల నుంచి తప్పించండి సార్ అంటూ ఉన్నతాధికారులకు మొర పెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. పోలీసులు మెరుగైన సేవలు అందించాలంటే కచ్చితంగా నిజాయితీగా పనిచేసే ఎస్‌హెచ్‌ఓలకు పోలీసు ఉన్నతాధికారులు అండగా నిలవాలి. అసలు విచారణ అధికారులపైనే ఆరోపణలు ఉన్నప్పుడు..నిజాయితీగా పనిచేసే అధికారులపై ఎలా పారదర్శకంగా నివేదిక ఇస్తారనే చర్చకూడా సాగుతోంది. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సిన బాధ్యత పోలీసు ఉన్నతాధికారులపై ఉంది. ఇప్పటికైనా ఎస్‌హెచ్‌ఓలలో ఆత్మస్థైర్యం నింపుతారా లేదా అనేది చూడాలి.

80 మందికి స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ పొందిన 80 మంది నర్సింగ్ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. 405 మంది విద్యార్థులు శిక్షణ పొందగా అందులో 80 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరో 266 మంది విద్యార్థులు వివిధ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని, మరో 25 మంది విదేశాల్లో ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు.

సీవీ ఆనంద్ పేరుతో మరో నాలుగు నకిలీ ఖాతాలు

ఫేస్‌బుక్‌లో గుర్తించి తొలగించిన సైబర్ క్రైమ్ పోలీసులు

హిమాయత్‌నగర్: ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ పేరుతో సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల రెండు ఖాతాలకు సంబంధించి నగర సీసీఎస్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తు చేస్తున్న ఏసీపీ చాంద్‌పాషా నేతృత్వంలోని బృందం రెండు నకిలీ ఖాతాలను తొలగించింది. విచారణ క్రమంలో మరో నాలుగు నకిలీ ఖాతాలను గుర్తించారు. ఇందులో ఒక ఖాతాలో సైబర్‌నేరగాళ్లు డబ్బులు కావాలంటూ పెట్టిన మేసేజ్‌కు స్పందించి ఒకరు రూ.80 వేలు బదిలీ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. రాజస్తాన్, జార్ఖండ్, బిహార్ రాష్ట్రాలలోని సైబర్ నేరగాళ్లు పోలీస్ అధికారులు, ఇతర ప్రముఖుల పేర్లతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాలు సృష్టించి, డబ్బు అవసరముందంటూ మేసేజ్‌లు పెడుతుంటారు. అధికారుల పేర్లతో ఎవరైనా డబ్బులు అడిగితే నకిలీ అకౌంట్‌గా గుర్తించాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

3 నుంచి దస్తకారీ హాత్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్...

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ వేదికగా ఈ నెల 3వ తేదీ నుంచి దస్తకారీ హాత్ సమితి రెండో ఎడిషన్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. 11వ తేదీ వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో విస్తృత శ్రేణి సాంప్రదాయ, ఆధునిక హస్తకళను ప్రదర్శించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన కోసం 90 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇందులో ఛత్తీస్‌ఘడ్, గుజరాత్, న్యూఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి హస్త కళాకారులు పాల్గొననున్నారు. ఈ వేదికలో మధుబని, గోండ్ పెయింటింగ్, టెర్రకోట కళ తదితర అంశాల్లో వర్క్‌షాప్‌లను సైతం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

కంటోన్మెంట్ బోర్డు పదవీ కాలం పొడిగింపు

మరో ఏడాది పొడిగిస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ వేరీడ్ బోర్డును మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు జాయింట్ సెక్రెటరీ రాకేశ్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత వేరీడ్ బోర్డు పదవీ కాలం ఫిబ్రవరి 10 నాటికి ముగియనుంది. తాజా ఉత్తర్వులతో ప్రస్తుత వేరీడ్ బోర్డును వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగించనున్నారు. అంతకు ముందే కేంద్రం కంటోన్మెంట్ బోర్డులకు ఎన్నికలు నిర్వహిస్తే వేరీడ్ బోర్డు రద్దు కానుంది.

మూడేళ్లలో తొమ్మిదోసారి..

2015 జనవరిలో కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగాయి. 16 మంది సభ్యులతో కూడిన సాధారణ బోర్డు పదవీ కాలం 2020 ఫిబ్రవరి 10 నాటికే ముగియగా, కేంద్రం ఆరు నెలల చొప్పున రెండుసార్లు సాధారణ బోర్డు పదవీకాలాన్ని పొడిగించింది. కంటోన్మెంట్ నిబంధనల మేరకు సాధారణ బోర్డు పదవీ కాలాన్ని గరిష్ఠంగా ఏడాది పాటే పొడిగించేందుకు అవకాశం ఉండటంతో బోర్డును 'వేరీ' చేస్తూ కేవలం ముగ్గురు సభ్యులతో కూడిన వేరీడ్ బోర్డును ఏర్పాటు చేసింది. స్టేషన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న మిలటరీ ఉన్నతాధికారి అధ్యక్షుడిగా, సీఈఓ సభ్య కార్యదర్శిగా ఉండే బోర్డులో కేంద్రం ఒకరిని నామినేటెడ్ సభ్యుడు /సభ్యురాలిగా నియమిస్తుంది. 2021 నవంబర్ వరకు ఖాళీగా ఉన్న నామినేటెడ్ సభ్యుడి స్థానంలో బీజేపీ నేత రామకృష్ణను నియమించారు. మూడేళ్ల క్రితమే మనుగడలోకి వచ్చిన వేరీడ్ బోర్డును ఆరు నెలల చొప్పున ఆరుసార్లు పొడిగిస్తూ వచ్చారు. తాజాగా ఏకంగా ఏడాది పాటు వేరీడ్ బోర్డు పదవీకాలాన్ని పొడిగించడం గమనార్హం. ప్రస్తుత బోర్డులో బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ సభ్యులుగా కొనసాగుతున్నారు.

ఎన్నికలపై స్పష్టత కరువు

డీమ్డ్ మున్సిపాలిటీ కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డుకు సాధారణంగా ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. 16 మంది సభ్యులు గల బోర్డులో 8 మంది అధికారులు, 8 మంది ప్రజా ప్రతినిధులు ఉంటారు. 2020, 2021లో కరోనా నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించకుండానే బోర్డును పొడిగిస్తూ వచ్చారు. దీనికి తోడు ది కంటోన్మెంట్స్ యాక్ట్ -2006 స్థానంలో నూతన చట్టానికి రూపకల్పన చేసిన కేంద్రం, ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. మూడేళ్లుగా ఈ బిల్లుకు మోక్షం లభించడం లేదు. నూతన చట్టం ఆధారంగానే ఎన్నికలు నిర్వహిస్తామంటూ చెబుతూ వచ్చిన కేంద్రం, గతేడాది ఫిబ్రవరిలో బోర్డు ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసింది. సగం ప్రక్రియ ముగిశాక, ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. తాజాగా వేరీడ్ బోర్డునే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఎన్నికల నిర్వహణపై మరోసారి సందిగ్ధత నెలకొంది.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ: పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపంతో ఓ విద్యార్థి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, ఐజ మండలం, ఉప్పల్ గ్రామానికి చెందిన ఉదయ్ కిరణ్ (22) వనస్థలిపురంలోని ఓ కళాశాలలో బీఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల జరిగిన పరీక్షల్లో అతను కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. దీంతో మనస్తాపానికి లోనైన ఉదయ్‌కిరణ్ మంగళవారం రాత్రి మలక్‌పేట - డబీర్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలపురం ఇన్‌స్పెక్టర్, ఎస్సై సస్పెన్షన్

హత్య కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపణ

రాంగోపాల్‌పేట్: ఓ హత్య కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎస్సై దీక్షిత్‌రెడ్డిలను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 29న గోపాలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని డీ మార్ట్ భవనం బేస్‌మెంట్-3లో సినీ నిర్మాత అంజిరెడ్డి హత్యకు గురయ్యారు. అంజిరెడ్డి ఇంటిని కొనుగోలు చేస్తానని చెప్పి జీఆర్ కన్వెన్షన్ నిర్వాహకుడు రాజేష్ ఆయనతో ఒప్పందం చేసుకున్నాడు. రూ. కోట్లు విలువ చేసే ఇంటిని తక్కువ ధరకు కాజేయాలని పథకం పన్నిన రాజేష్ సెప్టెంబర్ 29న సాయంత్రం అంజిరెడ్డిని డబ్బులు ఇస్తానని కారులో డీ మార్ట్ భవనంలోని బేస్‌మెంట్-3కి తీసుకెళ్లి డబ్బులు మొత్తం చెల్లించినట్లు అగ్రిమెంట్ కాగితాలపై సంతకాలు చేయాలని అంజిరెడ్డిపై ఒత్తిడి చేశాడు. అందుకు ఆయన నిరాకరించడంతో రాజేష్ మరికొందరు వ్యక్తులతో కలిసి అతడిని తీవ్రంగా కొట్టి హత్యచేసి కారు ప్రమాదంగా చిత్రీకరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు అంజిరెడ్డి హత్యకు గురైనట్లు నిర్ధారించారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లాకప్‌లో పెట్టినందుకే..

కేసు విచారణలో భాగంగా నిందితుడు రాజేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు నాలుగు రోజుల పాటు అతడిని తమ కస్టడీలో ఉంచుకుని విచారణ చేపట్టారు. అదే సమయంలో నిందితుడి భార్య హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్‌ను దాఖలు చేశారు. విచారణ పేరుతో నిందితుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించినట్లు ఆమె కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎస్సై దీక్షిత్‌రెడ్డి కేసు విచారణలో నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఉద్దేశంతో వారిని సస్పెండ్ చేస్తూ దీంతో నగర పోలీస్ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

సిటీబ్యూరో: గంజాయి విక్రయిస్తున్న మహిళను కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి సీఐ కృష్ణ మోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూసా పేట జనతానగర్‌లో ఉంటున్న శోభ, వెంకటేష్ దంపతులు వరంగల్ నుంచి గంజాయి తీసుకువచ్చి మూసాపేట, కూకట్ పల్లి ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు బుధవారం వారి ఇంటిపై దాడి చేసిన పోలీసులు 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరైన వెంకటేష్ మేడారం జాతరకు వెళ్లాడని, అతడి భార్య శోభను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

ఓయూ కామర్స్ విద్యార్థి ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన ఓయూ కామర్స్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం వెలుగులోకి చ్చింది. సహ విద్యార్థుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓయూ క్యాంపస్‌లోని మంజీరా హాస్టల్‌లో ఉంటున్న జగిత్యాల జిల్లా, కోరుట్లకు చెందిన నవీన్ ఎంకాం ఫైనల్ ఇయర్ చదవుతున్నాడు. స్టాక్ మార్కెట్‌పై అవగాహన ఉండటంతో అందులో పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జించాలని భావించాడు. దీంతో తల్లిదండ్రులకు తెలియకుండా దాదాపు రూ.2 లక్షలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాడు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు తీర్చే దారి కనిపించక జనవరి 29న రాత్రి హాస్టల్ గదిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అకస్మారక స్థితిలోకి వెళ్లిన నవీన్‌ను సహ విద్యార్థులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కోరుట్లకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సాయి వర్ధన్ (ఫైల్)

అడ్డగుట్ట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాలాపేట కమాన్‌లోని సంతోషిమాత దేవాలయం సమీపంలో నివాసముంటున్న సాయి వర్ధన్(25) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను తన స్నేహితుడు మంజునాథ్‌తో కలిసి బైక్‌పై లాలాపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి మౌలాలి వైపు వెళ్తున్నాడు. మంజునాథ్ బైక్ నడుపుతుండగా సాయివర్ధన్ వెనుక కూర్చున్నాడు. మార్గం మధ్యలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రాంతంలోని మూల మలుపు దగ్గర బైక్ అదుపు తప్పి పార్క్ చేసి ఉన్న ఆటోకు ఢీకొట్టారు. ఈ ఘటనలో సాయివర్ధన్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడికి కాలు విరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సాయివర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మంజునాథ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

దూద్‌బౌలి: బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ 12వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు బుధవారం తీర్పు చెప్పింది. బాధితురాలికి రూ.7 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పురానాపూల్ పార్ధివాడకు చెందిన ఓ మహిళ భర్తతో గొడవ పడి ముగ్గురు కుమార్తెలతో కలిసి విడిగా ఉండేది. వారి గత ఏడాది జనవరి 19న వారి ఇంటికి పక్కనే నివాసం ఉండే కే.ప్రకాష్ అనే వ్యక్తి ఆమె రెండో కుమార్తెను ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన హుస్సేనీఆలం పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడికి మూడేళ్లు..

సనత్‌నగర్: బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సికింద్రాబాద్ 11వ ఏసీఎంఎం కోర్టు తీర్పు చెప్పింది. బేగంపేట ఎస్ఐ గంగాధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌కు చెందిన అల్తాఫ్ హుస్సేన్ అలియాస్ అఖిల్ 2020లో ఓ బాలికను కిడ్నాప్ చేశాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన బేగంపేట పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శేఖరాచారి వాదనలతో ఏకీభవించి న్యాయమూర్తి కిరణ్ కుమార్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: మద్యం మత్తులో భార్యను తలపై బండరాయితో మోది హత్య చేసిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష రూ.200 జరిమానా విధిస్తూ జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డా. పట్టాభి రామారావు బుధవారం తీర్పు చెప్పారు. పీపీ రాజిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నందిగామ మండలం, వెంకమ్మగూడెం గ్రామానికి చెందిన లోకిని బాలరాజు తాగుడికి బానిసై నిత్యం భార్యను హింసించేవాడు. 2022 మార్చి 1న మద్యంమత్తులో ఇంటికి వచ్చిన బాలరాజు బండరాయితో భార్య తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నందిగామ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసారు. సాక్ష్యులను విచారించిన న్యాయస్థానం నిందితుడికి పైవిధంగా శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది.

కమీషన్లకు ఆశపడి...

- సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు
- అందజేస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్



శ్రుతి మయూర్ బఫ్నా



జావేద్ నవాబ్ యాకూబ్

హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు అందిస్తూ నేరాలకు సహకరిస్తున్న ఇద్దరు నిందితులను నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర జాయింట్ సీపీ రంగనాథ్ హెచ్చరించారు. సైబర్ కేటుగాళ్ల ఇచ్చే కమీషన్లకు ఆశపడి పలువురి నుంచి బ్యాంకు ఖాతాలను సేకరించి సైబర్‌నేరగాళ్లకు అందిస్తున్న శృతి మయూర్ బఫ్నా అనే మహిళను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రుతి తన పేరున వివిధ వ్యాపార సంస్థలు ఉన్నాయని, స్టాక్ మార్కెట్, క్రిప్టో మార్కెట్ ట్రేడింగ్ కోసం టినెక్స్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో బ్యాంక్ ఖాతాను తెరిచి సైబర్ మోసగాళ్లకు అందజేసింది. ఇందుకుగాను వారు 10 శాతం కమీషన్‌గా ఇచ్చేవారని పోలీసులు తెలిపారు. ఈ రెండు ఖాతాల్లోనూ దాదాపు రూ.3 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. శ్రుతిపై రాష్ట్రంలో మూడు కేసులు నమోదయ్యాయని, దేశవ్యాప్తంగా సుమారు 25 కేసుల్లో ఆమె బ్యాంక్ ఖాతాలను అందించినట్లు గుర్తించామన్నారు. ఇదే తరహాలో పద్మారావు నగర్‌లోని హాస్టళ్లకు రేటింగ్స్ ఇస్తూ, పెట్టుబడి పెట్టేలా చేసి రూ.21.07 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితురాలు శ్రుతి మయూర్ బఫ్నాను అరెస్ట్ చేసినట్లు జాయింట్ సీపీ తెలిపారు.

ఫెడెక్స్ పార్సిల్ పేరుతో..

ఫెడెక్స్ పార్సిల్ పేరుతో మోసాలకు పాల్పడేవారికి బ్యాంకు ఖాతాలు అందించిన జావేద్ నవాబ్ యాకూబ్ ఖాన్ అనే వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. కవాడిగూడకు చెందిన వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి తాము కస్టమ్స్ అధికారులమని మీరు పంపిన పార్శిల్‌లో నిషేధిత పదార్థాలు ఉన్నాయని బెదిరించి రూ.8,74,998 వసూలు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు జావేద్ నవాబ్ యాకూబ్ ఖాన్ సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కై ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. బుధవారం అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. వీరిపై దేశవ్యాప్తంగా 105 కేసులు నమోదయ్యాయని, రాష్ట్రంలో 14 కేసులు ఉన్నట్లు తెలిపారు.

దొంగలు..దారుణాలు

- వేర్వేరు ప్రాంతాల్లో ఒకే రోజు రెండు ఘాతుకాలు
- మైలార్‌దేవ్‌పల్లిలో సెక్యూరిటీ గార్డు దారుణ హత్య
- ఐరన్ రాడ్‌ల చోరీ
- దోమలగూడలో వృద్ధురాలిని చంపి సొత్తుతో పరార్

రాజేంద్రనగర్: సెక్యూరిటీ గార్డును దారుణంగా హత్య చేసి పరిశ్రమలోని ఇనుప సామగ్రి, ఇనుప రాడ్లను ఎత్తుకెళ్లిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, యజమాని కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతబస్తీకి చెందిన మహబూబ్ ఆరాంఘర్ ప్రాంతంలో హమీర్ రిపేరింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అతని వద్ద ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్ (28) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. పరిశ్రమలో ఇనుముతో తయారైన వస్తువులను తయారు చేసి విక్రయిస్తుంటారు. మంగళవారం రాత్రి కార్మికులు వెళ్లిపోయిన అనంతరం వాచ్‌మెన్ ఆసిఫ్ లోపలి నుండి తాళం వేసుకుని తన గదిలో ఉన్నాడు. బుధవారం ఉదయం డ్యూటీకి వచ్చిన ముగ్గురు కార్మికులు ఆసిఫ్‌ను పిలిచినా పలకకపోవడంతో యజమాని మహబూబ్‌కు సమాచారం అందించారు. దీంతో అక్కడికి వచ్చిన మహబూబ్ డోర్ పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆసిఫ్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. పరిశ్రమలో ఏర్పాటు చేసిన ఐదు సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్ సైతం కనిపించలేదు. దీంతో అతను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. పరిశ్రమలో రెండు టన్నుల ఇనుప వస్తువులు, రాడ్‌లు, ఐదు సీసీ కెమెరాలు, హార్డ్‌డిస్క్ చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దోపిడీ దొంగలను అడ్డుకునేందుకు యత్నించిన సమయంలో వారు ఆసిఫ్‌పై బలమైన ఆయుధంతో దాడి చేసి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వృద్ధురాలి హత్య

చిక్కడపల్లి: సహాయకుడిగా పని చేస్తున్న వ్యక్తి నమ్మకంగా ఉంటున్నట్లు నటించి ఓ వృద్ధురాలిని దారుణంగా హత్య చేసి , బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లి సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దోమలగూడ, గగన్‌మహల్ రాధామదన్ నివాస్‌లో మహేష్‌కుమార్, స్నేహలత (61) దంపతులు కుమారుడు పవన్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. మహేష్‌కుమార్, పవన్ గోషామహల్‌లో ప్లేవుడ్ దుకాణం నిర్వహించేవారు. గత కొన్ని రోజులుగా స్నేహలత అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమెకు సేవ చేసేందుకు బీహార్‌కు చెందిన మహేష్ అనే వ్యక్తిని నియమించుకున్నారు. బుధవారం సాయంత్రం దుకాణం నుంచి పవన్ తల్లికి ఫోన్‌చేయగా ఆమె ఎత్తకపోవడంతో అనుమానం వచ్చిన అతను పక్క ఇంటి వారికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో వారు అక్కడికి వెళ్లి చూడగా స్నేహలత కాళ్లు, చేతులు కట్టివేసి, నోట్లో గుడ్డలు కుక్కి అపస్మారకస్థితిలో ఉంది. కుటుంబసభ్యులు ఆమెను హైదర్‌గూడ అపోలోకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్నేహలత ఒంటిపై బంగారు ఆభరణాలు లేకపోవడం, బీరువాలో ఉన్న నగలు మాయం కావడంతో నగల కోసమే మహేష్ ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, దోమలగూడ ఏసీపీ రవికుమార్, సీఐ డి.శ్రీనివాస్‌రెడ్డి, క్లూస్‌టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న మహేష్ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

అంధకారంలో ఇందిరానగర్

ఏడాదిగా వెలగని వీధి దీపాలతో పరేషాన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని ఇందిరానగర్ బస్తీలో గడిచిన ఏడాది కాలంగా వీధిదీపాలు వెలగడం లేదని, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. ఇందిరానగర్ స్ట్రీట్ నెంబర్ 16, 17, 18లలో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంటున్నదని, స్థానికంగా ఇది సమస్యగా మారిందని బస్తీ నేత డి.సింహం ఆరోపించారు. తాము జీహెచ్ఎంసీ సర్కిల్–18 స్ట్రీట్ లైట్స్ ఏఈకి జనవరి 1న ఫిర్యాదు కూడా చేశామన్నారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు కూడా ఫిర్యాదు చేయగా, ఆయన ఎన్నోసార్లు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారని, అయినా సరే ఏఈతో పాటు సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్పొరేటర్ ఎంతో చిత్తశుద్ధితో సమస్యను పరిష్కారం చేయాలని చూస్తున్నా అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదన్నారు. ఇప్పటికైనా సర్కిల్–18 ఉప కమిషనర్ స్పందించి ఇందిరానగర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వీధి దీపాల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని ఉదయ్‌నగర్, సింగాడి కుంట బస్తీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం రూ. 12 లక్షల వ్యయంతో మురుగునీటి పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణానికి గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. బుధవారం సంబంధిత జలమండలి అధికారులతో కలిసి ఆమె ఈ పనులు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... సాధ్యమైనంత త్వరగా పైప్‌లైన్లు వేయాలని సూచించారు. ఈ పైప్‌లైన్ నిర్మాణంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

'మరోసారి మోదీ' షురూ



వాల్ రైటింగ్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి అధికారం చేపట్టబోతున్నారని, ఇదే స్ఫూర్తిని బీజేపీ నేతలు, కార్యకర్తలు ఎన్నికల వరకు కొనసాగించాలని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సూచించారు. బుధవారం ఆయన జూబ్లీహిల్స్ డివిజన్‌లో 'మరోసారి మోదీ' వాల్ రైటింగ్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో నేతలు గడ్డం వెంకటస్వామి, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తాం: వడ్లమూరి

హిమాయత్‌నగర్: మోదీ సర్కార్ హటావో దేశ్ బచావో అనే నినాదంతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ (డీబీపీ) పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు అడ్వకేట్ వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ హయాంలో దేశ సంపదను ప్రజల ఆస్తులను అంబానీ, అదానీ, మార్వాడీ కార్పొరేట్ వర్గాలకు దోచి పెట్టారని ఆరోపించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను ఈవీఎం మిషన్లతో కాకుండా బ్యాలెట్ పేపర్‌తో నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా వందకు పైగా ఎంపీ స్థానాలకు పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని కృష్ణస్వరూప్ తెలిపారు. పార్టీ అభ్యర్థులను రానున్న ఎన్నికలో ఓటు వేసి ఆదరించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఎంపీ అభ్యర్థుల, తొలి జాబితాను ఆయన విడుదల చేశారు. రెండో జాబితాను ఫిబ్రవరి 11వ తేదీన విడుదల చేస్తారని తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీష్, స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇటికాల గణేష్, పార్టీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, పార్టీ నాయకులు సి.హెచ్.కరుణాకర్, పెండియాల సుచేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ హుండీ లెక్కింపు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. 55 రోజులకు గాను ఈ లెక్కింపులో రూ.8,84,608 ఆదాయం లభించింది. ఆలయ ఈఓ ఎస్.లావణ్య, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి నేతృత్వంలో భక్తులు, ఆలయ సిబ్బంది ఈ లెక్కింపు చేపట్టారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్కారు బడికి చేయూత

పేద పిల్లలు చదువుకునే సర్కారు బడి అభివృద్ధి కోసం దేశ, విదేశాల్లో ఉన్న వారంతా చేతులు కలిపారు. ప్రభుత్వం చేయలేని పనిని కేవలం ఎనిమిది నెలల్లోనే తాము చేసి చూపించారు. బొట్టు బొట్టూ కలిస్తే వరద ఎలా అవుతుందో.. పైసా పైసా కలిపి వీళ్లంతా లక్షలాది రూపాయలను జమ చేశారు. ఒక సర్కారు బడి అభివృద్ధి కోసం చేతులు కలిపి శభాష్ అనిపించుకున్నారు.



ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న రొటేరియన్లు

- పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు
- రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సభ్యుల సేవానిరతి
- ఆర్థికంగా చేయూతనందించిన దేశ, విదేశాల్లోని రొటేరియన్లు
- సేకరించిన నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం
- ప్రారంభించిన హైదరాబాద్ డీఈఓ రోహిణి



తరగతి గదిలో బెంచీలు

బంజారాహిల్స్: విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని షేక్‌పేట్ మండలం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో రూ. కోటి వెచ్చించి తొమ్మిది తరగతి గదులను నిర్మించారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఈ స్వచ్ఛంద కార్యక్రమానికి ముందుకురాగా ఇందులో సభ్యులుగా ఉన్న 180 మంది పేదల కోసం చేతులు కలిపారు. అంతేకాదు.. ఈ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ మాజీ అధ్యక్షుడు టి.రాఘవరావు దేశ విదేశాల్లో ఉన్న తన స్నేహితులందరినీ సంప్రదించి సుమారుగా రూ. 50 లక్షలు పోగుచేశారు. అందరూ కలిసి రూ. 1.03 కోట్ల వ్యయంతో మూడో అంతస్తులో తొమ్మిది అదనపు గదులు నిర్మించారు.

- వీటిని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి బుధవారం ప్రారంభించారు. రొటేరియన్ రాఘవరావు మెమోరియల్ బ్లాక్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ సముదాయాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, ఇతర రొటేరియన్లతో కలిసి ఆమె ప్రారంభించిన అనంతరం ఇంతపెద్ద కార్యక్రమానికి ముందుకువచ్చిన వారందరినీ పేరుపేరునా అభినందించారు.
- కేవలం గదులు నిర్మించి చేతులు దులుపుకోకుండా బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఇప్పటికే ఈ పాఠశాలలో వేదిక, డైనింగ్ హాల్, సైన్స్ లేబరేటరీ, కంప్యూటర్ ల్యాబ్, గర్ల్స్ టాయిలెట్స్, టీచర్స్ టాయిలెట్స్, నాలుగు డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. 2011 నుంచి ఈ సంస్థ ఫిలింనగర్ పాఠశాలను దాదాపుగా దత్తతకు తీసుకుని అక్కడి సౌకర్యాలను మెరుగుపరుస్తుంది.

షిఫ్టుల విధానాన్ని తొలగించాం



ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం, సాయంత్రం వేళల్లో షిఫ్టుల వారీగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు నిర్వహించేందుకు క్లాస్‌రూమ్‌లు తగినన్ని లేకపోవడంతో ఈ పద్ధతి కొనసాగింది. అయితే రొటేరియన్ రాఘవరావు తన వద్దకు పలుమార్లు వచ్చి గదులు నిర్మిస్తామని చెప్పగానే అనుమతులు ఇచ్చాము. త్వరితగతిన గదుల నిర్మాణం పూర్తి చేశారు. దీంతో షిఫ్టుల పద్ధతికి స్వస్తి పలికాం. ఇప్పుడు ఒకటి నుంచి పదో తరగతి వరకు ఒకే షిఫ్టులో క్లాసులు జరుగుతున్నాయి. ఇది విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంది. ఆట, పాటలకు సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటున్నారు.

– రోహిణి, డీఈఓ, హైదరాబాద్

రొటేరియన్లకు ధన్యవాదాలు



ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో రూ. కోటి వెచ్చించి తొమ్మిది తరగతి గదులు నిర్మించడం జరిగింది. ప్రతి రొటేరియన్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు చెబుతున్నాం. విద్యార్థులు కూడా ఎంతో ఆనందంగా ఉన్నారు. వారు ఇంకా ఆడుకోవడానికి, పాడుకోవడానికి అవకాశం కల్పించే దిశలో మరిన్ని సౌకర్యాలు కల్పించబోతున్నాం. ఇదంతా త్వరలోనే పూర్తవుతుంది. విద్యార్థులు ఇంకా బాగా చదువుకోవాలనేది మా ఉద్దేశం.

– చంపకరావు, మాజీ అధ్యక్షురాలు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్

ఆనందంగా ఉంది



ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో మూడో అంతస్తులో తొమ్మిది అదనపు తరగతి గదులను నిర్మించడం వల్ల ఇక్కడ షిఫ్టుల పద్ధతికి స్వస్తి పలకడం జరిగింది. త్వరితగతిన ఈ నిర్మాణ పనులు కూడా పూర్తి చేయడం జరిగింది. రొటేరియన్ రాఘవరావు ఎంతో శ్రద్ధతో విరాళాలు సేకరించి తమ దాతృత్వాన్ని చాటుకోగా, రొటేరియన్లు అంతా చేయీ చేయీ కలిపి ముందుకువచ్చారు. ఒక మంచి పని కోసం ఇంతమంది స్వచ్ఛందంగా కదిలిరావడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ పాఠశాలలో కెరీర్ గైడెన్స్ కోసం మెల్‌బోర్న్ యూనివర్శిటీతో ఒప్పందం చేసుకోవడం జరిగింది.

– జ్యోతిరెడ్డి, అధ్యక్షురాలు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్

మినీ టిప్పర్ లారీ డ్రైవర్ల ఆందోళన

- రాత్రి వేళ మాత్రమే మినీ టిప్పర్లు తిరగాలనడం అసమజసం
- పగటి పూటా అనుమతించాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న మినీ టిప్పర్ లారీ డ్రైవర్లు

బంజారాహిల్స్: పగటి వేళల్లో నగరంలో టిప్పర్ లారీలు తిరగొద్దని పోలీసులు పెట్టిన నిబంధనను ఎత్తివేయాలని గతంలో మాదిరిగానే అనుమతి ఇవ్వాలంటూ బంజారాహిల్స్ టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్, కార్మికులు డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా చేపట్టిన మినీ టిప్పర్ లారీ ఓనర్ల నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని దేవరకొండ నగర్ బీఎస్ఆర్ హిల్స్ వద్ద మినీ టిప్పర్ లారీ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో నిర్మాణ వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలు తరలించేందుకు నగరంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతించేవారని, అదేవిధంగా రాత్రి మొత్తం అనుమతించేవారని తెలిపారు. కానీ ఇప్పుడు మినీ టిప్పర్ లారీలు పగటి వేళ అసలు నగరంలోనే తిరగొద్దంటూ అధికారులు నిబంధనలు విధించడం సరికాదని అన్నారు. వీటిని నమ్ముకొని వందలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని బంజారాహిల్స్ మినీ టిప్పర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ సాబేర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లోనే సుమారు 500లకు పైగా మినీ టిప్పర్ లారీలు ఉంటాయని వారు తెలిపారు. రాత్రి వేళల్లో నిర్మాణ వ్యర్థాలు తరలించాలంటే లేబర్ దొరకరని, ఎక్కువ ఖర్చు అవుతుందని ఈ నిబంధనను అధికారులు సవరించాలని వారు కోరారు. రెండు రోజుల్లో తగు నిర్ణయం తీసుకోవాలని లేదంటే నిరవధిక సమ్మె నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గిరి, నసీరుద్దీన్, నరేష్, వైస్ ప్రెసిడెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ వైద్యురాలికి అవార్డు



లక్డీకాపూల్: కుష్టు వ్యాధి నివారణ కోసం నిమ్స్ ఆసుపత్రి డెర్మటాలజీ వైద్యురాలు ఆసియా బేగం ప్రత్యేక కృషి చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అవగాహన కల్పించడంతో పాటు నివారణ కోసం అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. ఆమె సేవలను గుర్తించిన వైద్య ఆరోగ్య శాఖ ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. యాంటీ లెప్రసీ డే సందర్భంగా నగరంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనపు డీఎంహెచ్‌వో నిర్మల ప్రభావతి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును ఆమె అందుకున్నారు. నిమ్స్ వైద్యురాలికి ఈ అవార్డు రావడంతో నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ఆమెని ప్రత్యేకంగా అభినందించారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను పర్మనెంట్ చేయాలి

పంజగుట్ట: రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను పర్మనెంట్ చేయాలని పలువురు నర్సులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్నామని కరోనా సమయంలో కూడా ప్రాణాలకు తెగించి పని చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తమను పర్మనెంట్ చెయ్యాలని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సులతో కలిసి సమితి అధ్యక్షుడు డాక్టర్ ఇస్లాముద్దీన్, షేక్ సత్తార్ సాహెబ్, సోగరాబేగం, లాజర్‌లు మాట్లాడారు. సమావేశంలో రామ్‌చందర్, చైతన్య, సౌజన్య, మంజుల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



రహమత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాను చేసిన విన్నపంపై సీఎం సానుకూలంగా స్పందిచారని సీఎన్ రెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



వెంగళరావునగర్: షాపింగ్ కాంప్లెక్స్, కె.పి.కాలనీ, సాగర్ సొసైటీ 11కేవీ ఫీడర్లు ఎమ్మెల్యే కాలనీ, శ్రీనగర్‌కాలనీ, ఎల్వీ ప్రసాద్ సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సయ్యద్‌నగర్, డి.శ్రీనివాస్ ఇల్లు, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి ఇల్లు, సోయాసీ నిగమ్, కమలాపురికాలనీ 1–3, తన్వీర్ ఆస్పత్రి, సాగర్ సొసైటీ, ఐడీబీఐ బ్యాంకు, రోడ్–2, బంజారాహిల్స్ చల్లా ఐ హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

- ఏసీబీ, కమ్మసంఘం, లూసిడ్, ఎన్‌సీసీ 11కేవీ ఫీడర్లు కమాండ్ కంట్రోల్, మాదాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 12 నుంచి 2.20 గంటల వరకు గోల్డెన్ టెంపుల్ గేట్, ఎన్‌బీటీ నగర్, పోచమ్మ టెంపుల్, రేషంబాగ్, ఆలియా మసీదు, నాగార్జుననగర్, విజయ టవర్స్, శారాబాయి కంప్లెక్స్, మా టీవీ, సినిమాక్స్, లుసిడ్ హాస్పిటల్ ఏరియా, ఎన్‌సీసీ బిల్డింగ్స్, నెక్టార్, గార్డెన్ ఏరియా, రత్నదీప్, సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు.
- ఓమెగా, సత్యసాయి, రోడ్–14 11కేవీ ఫీడర్లు, కమాండ్ కంట్రోల్, శ్రీనగర్‌కాలనీ, ఎల్వీ ప్రసాద్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కమాండ్ కంట్రోల్ ఎదురు, వెంకయ్యనాయుడు ఇంటి లైన్, ఒమేగా హాస్పిటల్ లైన్, సుభాష్‌నగర్, శాలివాహన నగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, బి.ఎన్‌రెడ్డి కాలనీ, మెడిప్లస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కవిత ఇల్లు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏడీఈ వివరించారు.

వీనులవిందుగా త్యాగరాజ ఆరాధనోత్సవం



ఆరాధనోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



బంజారాహిల్స్: త్యాగరాజస్వామి జయంతిని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం పుష్య బహుళ పంచమి రోజున ఈ ఉత్సవాలను జరుపుతుంటారు. సాంప్రదాయ వేషధారణలో వచ్చిన విద్యార్థినీ విద్యార్థులతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి, అకడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీదేవి తదితరులు రా..రా రఘు వీర..రా..రా అనే త్యాగరాజ కతిని పాడుతూ వేదిక వద్దకు రావడం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీగణపతిని సేవింప రారే..అనే పాటతో మొదలుపెట్టి వివిధ త్యాగరాజ కతులతో ఎందరో మహానుభావులు, గంధము పూయరుగా..అనే పాటలతో ఆద్యంతం వీనుల విందుగా సాగింది. పవమానసుతుని అనే మంగళ హారతితో కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ పాఠశాల నిర్వాహకులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలను కొంతమేరకైనా కాపాడగలమన్నారు. మధురంగా పాడగల కంఠం, సంగీతం భగవంతుని వరంగా లభించిందని, చక్కగా పాడిన విద్యార్థులంతా సంగీతం నేర్చుకుంటూ ఈ కృషిని కొనసాగించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు చక్కని శిక్షణను ఇచ్చిన సంగీత విభాగం వారికి ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రాంగణం మొత్తం సంగీత సాగరంతో నిండిపోయింది.

పాఠశాల ముందే చెత్త కుప్పలు



బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ సర్కిల్–18 పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2 కమలాపురికాలనీ ఫేజ్–3లో ఇండియన్ బ్లాసమ్ స్కూల్ ముందు చెత్త కుప్పలు అటు విద్యార్థులతో పాటు ఇటు కాలనీవాసులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఇక్కడ చెత్త సమస్య స్థానికంగా అనారోగ్య వాతావరణాన్ని తెచ్చిపెడుతున్నాయి. సమీపంలో ఉన్న ఇందిరానగర్, సాగర్ సొసైటీల మధ్యలో జీహెచ్ఎంసీ పార్కులో కూడా నాలుగైదు లారీల చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి ఈగలు, దోమలు, పందులు, వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతిరోజూ చెత్తను తొలగించడంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం పూర్తిగా విఫలమైందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతాల నుంచి చెత్తను తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, పారిశుద్ధ్య కార్మికులు కూడా తూతూమంత్రంగా రోడ్లను ఊడుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డీఎంసీ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శివగంగానగర్ మూల మలుపు వద్ద మళ్లీ ప్రమాదం

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లోని శివగంగానగర్ మూల మలుపు వద్ద బుధవారం మరో ప్రమాదం సంభవించింది. వివరాలివీ... రహమత్‌నగర్ నుంచి ఎమ్మెల్యే కాలనీకి వెళ్లే దారిలో శివగంగానగర్ సబ్ స్టేషన్ వద్ద పళంగా ఉన్న మూల మలుపు వద్ద తరుచూ వాహనాలు అదుపు తప్పడం పరిపాటిగా మారుతుంది. గతంలో పలు ప్రమాదాలు ఇదే ప్రాంతంలో జరిగాయి. తాజాగా బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కాలనీ నుంచి లోడుతో వచ్చిన టిప్పర్ వాహనం ఎత్తుపై వెళ్లే క్రమంలో అదుపు తప్పి కిందకు జారిపోయింది. ఈ ఘటనలో వెనుక స్కూల్ వాహనం దూరంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో భారీ వాహనాలు రాకపోకలను అరికట్టాలని డివిజన్ కాంగ్రెస్ నాయకుడు గ్యార నాగరాజు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

చేనేత వస్త్రాలను ఆదరించాలి



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను తిలకిస్తున్న మనోజ్

శ్రీనగర్‌కాలనీ: నాణ్యతకు మారుపేరుగా ఇండియన్ సిల్క్ గ్యాలరీలోని వస్త్రాలు సిల్క్‌మార్క్‌తో చేనేత కళాకారుల ప్రతిభకు తార్కాణంగా నిలుస్తున్నాయని, ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని తెలంగాణ మైనార్టీ మోర్చా వైస్‌ప్రెసిడెంట్, ఫ్యాషన్ డిజైనర్ అల్క మనోజ్ అన్నారు. బుధవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌కు ఆమె సందర్శించి వస్త్రాలను తిలకించారు. ఇక్కడి చీరలు చాలా ఆకర్షనీయంగా ఉన్నాయని, చేనేతకారుల ప్రతిభను ప్రశంశించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని, ఫిబ్రవరి 3 వరకు ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

పెట్టుబడులు స్వీకరించి మోసం చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలి

పంజగుట్ట: పలువురి నుంచి పెట్టుబడులు స్వీకరించి ప్రస్తుతం ఇబ్బందులకు గురిచేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రిటైల్ ఇన్వెస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ... నాలుగు దశాబ్దాల క్రితం స్థాపించిన యూవీసీఎల్ అనే సంస్థలో సుమారు రెండు లక్షల మంది (రిటైల్ ఇన్వెస్ట్) పెట్టుబడులు పెట్టారని తెలిపారు. 2020 అనంతరం సదరు సంస్థను ఇతరులు కొనుగోలు చేయగా చట్టబద్ధంగా పెట్టుబడుల స్వీకరణ ఆపేయాలని కానీ నిబంధనలకు విరుద్ధంగా స్వీకరించారని తెలిపారు. దీంతో లక్షలాది మంది నష్టపోయామని తెలిపారు. ఈ విషయమై తాము ప్రధాని కార్యాలయంతో పాటు, జాతీయ స్థాయి దర్యాప్తు సంస్థలైన సెబి, సీబీఐ, మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్, ట్రిబ్యునల్ లకు ఫిర్యాదు చేశామన్నారు. 300 మంది సభ్యులు ఉన్న తమ అసోసియేషన్ సంవత్సరాల తరబడి న్యాయం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం లేదన్నారు. ఇలా ఎన్నో సంస్థలు పెట్టుబడులు స్వీకరించి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

- అన్ని జిల్లాల్లోని సచివాలయాల్లో మొదలైన కార్యక్రమం
- తొలి రోజే పదివేల డాక్యుమెంట్లు జారీ

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైంది. ‘నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు’ కార్యక్రమంలో పంపిణీ చేసిన 30.61 లక్షల ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు మొదలుపెట్టారు. తొలిరోజే పది వేల డాక్యుమెంట్లు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున వీఆర్‌ఓలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఆస్తిపై 10 సంవత్సరాల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయని దస్తావేజుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ఏ ప్రభుత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాల్సిన అవసరం ఉండదని స్పష్టంగా ముద్రించారు. స్థలానికి సంబంధించి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను వారి పేరు మీద చెల్లించుకోవచ్చని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తిపై భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలు, తగాదాలకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌లో ఆ స్థలానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విలువ, భూసేకరణ ద్వారా ఆ భూమిని సేకరిస్తే ఉన్న విలువను కూడా ముద్రిస్తున్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం పెద్దిపాలెంలో మొట్టమొదటగా తాతపూడి అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఆ స్థలం ప్రభుత్వ విలువ రూ.4.46 లక్షలు కాగా, భూసేకరణ విలువ రూ. 11.61 లక్షలుగా అందులో పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ల కోసం చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీ, యూజర్ ఛార్జిలను ప్రభుత్వమే భరిస్తోంది. అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన రూ. 11.61 లక్షల విలువైన ఆస్తికి సాధారణంగా అయితే ఆమె రూ. 18,600 స్టాంప్ డ్యూటీ, రూ. 2,325 రిజిస్ట్రేషన్ ఛార్జి, రూ. 500 యూజర్ ఛార్జి కలిపి మొత్తం రూ. 21,425 చెల్లించాల్సి ఉంటుంది. దానిని ప్రభుత్వమే భరించింది.

15 రోజుల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి..

పదిహేనురోజుల్లో 30.61 లక్షల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అందుకనుగుణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి రిజిస్ట్రేషన్లను మరింత వేగంగా చేయనున్నారు. రిజిస్ట్రేషన్లు చేసిన తర్వాత ఆ డాక్యుమెంట్లను (కన్వేయన్స్ డీడ్స్) లబ్ధిదారులకు అందించనున్నారు. రూ. 10 స్టాంప్ పేపర్లపై ఈ డీడ్ల ప్రింటింగ్‌ను రిజిస్ట్రేషన్లు అయినదాన్ని బట్టి జిల్లాల్లోనే చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి మూడో వారంలో ఈ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత నియోజకవర్గాలు, సచివాలయాల స్థాయిలో ప్రజాప్రతినిధులు ఈ డీడ్స్‌ను పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నారు.

6,100 పోస్టులతో డీఎస్సీ

సీఎం జగన్ నేతృత్వంలో కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం

టీచర్ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు.. ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల


మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 6,100 పోస్టులతో మెగా డీఎస్సీ – 2024 రానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూనే టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్యాశాఖతో పాటు గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణ స్థాయిలో బోధన కొనసాగేలా భారీగా ఉపాధ్యాయులను నియమించనుంది. మహిళా సాధికారతే లక్ష్యంగా ఫిబ్రవరి 16న నుంచి చివరి విడత ‘వైఎస్సార్ చేయూత’ పంపిణీ చేపట్టనున్నారు. సుమారు 27 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ప్రభుత్వం రూ.5,060.40 కోట్లు జమ చేయనుంది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మీడియాకు మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

2.20 లక్షల శాశ్వత ఉద్యోగాలు!

మెగా డీఎస్సీ 2024లో భాగంగా ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 185 సెంటర్లలో 15 రోజుల పాటు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తాం. అంతకంటే ముందు 8 రోజుల పాటు డీఎస్సీ అర్హత కోసం టెట్ పరీక్ష నిర్వహిస్తాం. డీఎస్సీ 2024 అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు 42 ఏళ్లు వయో పరిమితిని నిర్దేశించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయోపరిమితిలో ఐదేళ్లు సడలింపు కల్పించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఒక్క విద్యా రంగంలోనే 14,219 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టింది. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ల విధానాన్ని తేవడంతో 7,761 పోస్టుల్లో కొత్త ఉపాధ్యాయులు చేరారు. డీఎస్సీతో పాటు అటవీ శాఖలో ఫారెస్టు రేంజర్లతో సహా వివిధ విభాగాల్లో 689 పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నాం. ఇలా వివిధ శాఖల్లో కలిపి ఇప్పటికే 2.13 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించాం. తాజా నోటిఫికేషన్ల ద్వారా మరో 7 వేల పోస్టులతో కలిపి 2.20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను అందించినట్లు అవుతుంది.

ఎస్‌ఈఆర్‌టీతో ఐబీ భాగస్వామ్యం..

పేదలకు, సంపన్నులకు తేడా నాణ్యమైన విద్య మాత్రమే. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ తీసుకొస్తున్నాం. ఐబీ విద్యా విధానంలో చదవడానికి ఏడాదికి రూ.7 లక్షల నుంచి రూ.36 లక్షల దాకా ఖర్చవుతుంది. సంపన్నుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండే డిజిటల్ సదుపాయాలు, ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లను పేద పిల్లలకు కూడా అందుబాటులోకి తేవడంతో మార్పు మొదలైంది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ బోధనలో ఐబీని భాగస్వామ్యం చేస్తున్నాం. ప్రభుత్వంతో ఒప్పందానికి ఐబీ సంస్థ ముందుకు వచ్చింది. 2025–26 విద్యా సంవత్సరం జూన్ నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ మొదలవుతుంది. 2026–27 విద్యా సంవత్సరం నాటికి రెండో తరగతికి విస్తరిస్తాం. 2035 నాటికి పదో తరగతి, 2037 నాటికి ప్లస్ 2 తరగతి విద్యార్థులు ఐబీ బోర్డు జాయింట్ సర్టిఫికేషన్‌తో పరీక్షలు రాస్తారు.

మరికొన్ని అంశాలకూ ఆమోదం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగింపు.
- ప్రతి గ్రామ పంచాయతీకి పంచాయతీ కార్యదర్శి ఉండాలన్న నిర్ణయానికి ఆమోదం.
- ఏపీ డిస్కమ్‌లకు రూ.1,500 కోట్ల రుణాలపై ప్రభుత్వ గ్యారంటీ.
- అత్యంత మారుమూల ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీజీటీ) ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.89.98 కోట్లతో రూపొందించిన డీపీఆర్‌కు ఆమోదం.

ఇంధన రంగంలో భారీగా పెట్టుబడులు

రాష్ట్రంలో విండ్, సోలార్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. ఇందులో భాగంగా గ్రీన్‌కో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 1,500 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు నంద్యాల జిల్లా గడివేముల మండలం చిన్నక్కపల్లెలో 1,272.07 ఎకరాలు, మిడ్తూరు మండలం మాసాపేట, నాగలూటి గ్రామాల్లో 1,011.44 ఎకరాలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో అవసరమైన భూములను గుర్తించనుంది. సోలార్, విండ్‌తో సహా పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులకు ఇండోసోల్ సోలార్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అవసరమైన భూములు కేటాయించేందుకు ఎస్‌పీవీ ఏర్పాటు ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

మరికొన్ని స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు

- మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు నియామకం
- ఐదో జాబితా ప్రకటించిన విద్యాశాఖ మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఇప్పటిదాకా 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల ఎంపిక పూర్తి



సాక్షి, అమరావతి: ఏపీలో మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద బుధవారం సాయంత్రం వెల్లడించారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయానికి పట్టం కడుతూ.. సామాజిక న్యాయం చేస్తూ... యువతకు పెద్దపీట వేస్తూ ఐదో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు ఆ స్థానంలో బీసీ వర్గానికి చెందిన మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపిక చేశారు. కాకినాడ లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా చలమలశెట్టి సునీల్, మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, తిరుపతి లోక్‌సభ స్థానానికి ప్రస్తుత ఎంపీ మద్దిల గురుమూర్తిని నియమించారు. అరకు వ్యాలీ(ఎస్టీ) శాసనసభ స్థానం సమన్వయకర్తగా రేగం మత్స్యలింగం, సత్యవేడు(ఎస్సీ)కు నూకతోటి రాజేష్, అవనిగడ్డకు ప్రముఖ వైద్యుడు సింహాద్రి చంద్రశేఖరరావును నియమించారు. ఈ జాబితాతో కలిపి ఇప్పటివరకూ 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు కొత్తగా సమన్వయకర్తలను నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయర్తల్లో 21మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 17 మంది బీసీలు, నలుగురు మైనార్టీలు, 14మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 13 లోక్‌సభ స్థానాల్లో బీసీలు ఏడుగురు, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు ముగ్గురు ఉన్నారు.

3 నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు



తిరుమల: శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావవ్యాప్తి కోసమే తిరుమల ఆస్థానమండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ధార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ధార్మిక సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మరింతగా హైందవ ధర్మాన్ని, శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేసేందుకు, చిన్నవయసు నుంచే చిన్నారుల్లో మానవతా విలువలను పెంచేందుకు టీటీడీ అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దీన్లో భాగంగా ధార్మిక సదస్సు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు స్వీకరించి మరింతగా ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 57 మంది పీఠాధిపతులు సదస్సుకు వచ్చేందుకు సమ్మతించినట్లు చెప్పారు. శ్రీవారి ఆలయం నుంచి ఏ సందేశం వెళ్లినా భక్తులందరూ ఆమోదించి ఆచరిస్తారని ఛైర్మన్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి రావెల

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు దంపతులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో కిషోర్ బాబు, ఆయన సతీమణి శాంతి జ్యోతి వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ఆయన సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ బడుగు బలహీన వర్గాల వారి తరఫున నిలిచారని, సమాజంలో అసమానతలు రూపుమాపుతున్నారని అన్నారు. అందువల్లే వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు.

నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని సీఎం జగన్‌ను అడగలేదు. పార్టీ కోసం ఏలా సేవలందించమంటే అలా చేస్తానని చెప్పా. ఎలాంటి కండిషన్ లేకుండా పార్టీలో చేరాను. సీఎం జగన్ ఏ బాధ్యత ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తా. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సీఎం జగన్‌తో కలిసి ప్రయాణం చేస్తా అని చెప్పారు.

నగర వార్తలు

ఎల్‌బీనగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని స్థానిక సమస్యలు, భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామని కలెక్టర్ అన్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం, కందుకూర్ ఆర్డీఓలు అనంత రెడ్డి, సూరజ్ కుమార్, తహసీల్దార్‌లు, పరిశ్రమల జీఎం రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి


మాట్లాడుతున్న మహిళా అధ్యక్షురాలు సునీతారావు

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు పిలుపునిచ్చారు. బుధవారం ఇందిరా కాంగ్రెస్ భవన్‌లో జరిగిన హైదరాబాద్ పార్లమెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్లమెంట్ పరిధిలో జిల్లా, బ్లాక్, డివిజన్, వార్డు అధ్యక్షులు తమ పరిధిలోని కమిటీలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో పాటు వారికి పెద్దపీట వేస్తున్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించడంలో మహిళలు ముందు వరుసలో ఉండాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు తైసిన్ సుల్తానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోఆర్డినేటర్ నీలం పద్మ, అధిత, స్వప్న, ఇస్రాత్ షహనాస్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి గుర్తింపు కార్మిక సంఘంలో చీలిక!

రెండు వర్గాలుగా కార్మికులు

- పోటా పోటీగా బహిష్కరణల పర్వం
- మూడు నెలల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు
- మరోవైపు జలమండలికి కార్మిక శాఖ నోటీసు



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి గుర్తింపు కార్మిక సంఘం నిట్టనిలువునా చీలి పోయింది. కార్మిక వర్గాలు వేర్వేరు కుంపటిగా ఏర్పడి పరస్పరం బహిష్కరించుకున్నాయి. రెండు రోజుల క్రితం ఒక వర్గం కార్మికులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సంఘం అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి జయరాజ్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణలను పదవుల నుంచి తొలగించడంతో పాటు వారి స్థానంలో అధ్యక్షుడిగా కె.రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌లను ఎంపిక చేస్తూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. అయితే కొందరు సంఘ వ్యతిరేక కార్యక్రమాలు, గ్రూపులు కట్టడం, అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తూ సీనియర్ అసోసియేట్ అధ్యక్షుడు రాజిరెడ్డి, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ జంహగీర్‌లను సంఘం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మరో వర్గం ప్రకటించింది. ఇరు వర్గాలు మెజారిటీ తమ వెంటే ఉన్న కారణంగా గుర్తింపు సంఘం తమదేనని అంటున్నారు.

ఏడాదిగా ముసలం..

జలమండలి గుర్తింపు కార్మిక సంఘంలో గతేడాదిగా ముసలం కొనసాగుతోంది. కార్మిక సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన వ్యవహారం వివాదానికి కారణమైంది.గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో ఏడాదిన్నర క్రితం కార్మిక డిమాండ్లతో కూడిన రెండు అనుబంధ నోటీసులు అందజేయగా తక్షణమే అప్పటి జలమండలి ఎండీ ఒక నోటీసుపై చర్చలు జరిపి హామీ ఇచ్చినా... అమలుకు నోచుకోలేదు. మరో నోటీసుపై అసలు చర్చలు జరగలేదని తెలుస్తోంది. దీంతో గతేడాది జనవరిలో జరిగిన కార్యవర్గ సమావేశంలో అమలు కాని హామీలు, డిమాండ్ల సాధనకై ‘సమ్మె’ నోటీసులు ఇవ్వాలని కార్మికులు ప్రతిపాదించారు. దీంతో పాలక వర్గం బాధ్యుడు గుర్తింపు సంఘానికి అధికార పక్షం అనుబంధంగా ఉండటంతో సమ్మె నోటీసుకు వ్యతిరేకించడంతో పాటు సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినా.. సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదని తెలిసింది.

కార్మిక శాఖ నోటీసు జారీ..

జలమండలి సంస్థ కార్మికులకు ఇచ్చిన హామీలపై కార్మిక శాఖ నోటీసు జారీ చేసింది. తాజాగా ప్రభుత్వం మారడంతో గుర్తింపు సంఘం అసమ్మతి ప్రతినిధులు కొందరు ఏకంగా ఈ నెల 10న జలమండలి ఎండీ, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్లకు తమ సమస్యలపై నోటీసులు అందించారు. దీనిపై స్పందించిన కార్మిక శాఖ నోటీసు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 5లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం, మరోవైపు అసమ్మతి వర్గం కార్యాచరణకు సిద్ధమైంది.

మరో మూడు నెలల్లో..

మరో మూడు నెలల్లో జలమండలి గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో చీలిక రావడం జలమండలిలో చర్చనీయాంశమైంది. వాస్తవానికి టీఆర్ఎస్ అనుబంధ సంస్థ వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ జలమండలి గుర్తింపు కార్మిక సంఘంగా కొనసాగుతోంది. జలమండలిలోని 22 డివిజన్లలో సుమారు 3,327 మంది కార్మికులు ఉన్నారు. అయితే గుర్తింపు సంఘంలో గత కొన్ని నెలలుగా అసమ్మతి సెగ రగులుతోంది. అది తార స్థాయికి చేరడంతో రెండుగా చీలిపోయినట్లు తెలుస్తోంది. జలమండలిలో గుర్తింపు సంఘంతోపాటు తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (బీజేపీ), కాంగ్రెస్ అనుబంధ హైదరాబాద్ వాటర్ వర్క్స్ అండ్ సీవరేజీ కామ్‌గార్ యూనియన్, సీపీఐ అనుబంధ హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజీ బోర్డు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్లు ఉన్నాయి. అయితే కార్మికులు అధికార కాంగ్రెస్ అనుబంధం సంఘం వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో బీఆర్ఎస్ అనుబంధం కార్మిక సంఘంలో చీలిక వచ్చి బలహీనపడం గమనార్హం.

కార్నెగీమెల్లన్–టాలెంట్ స్ప్రింట్ మధ్య ఎంఓయూ

- గూగుల్ సహాయంతో ఈ టెక్‌వైజ్ కోర్సుకు శ్రీకారం

రాయదుర్గం: ప్రపంచంలోని అత్యుత్తమ కంప్యూటర్ సైన్స్ ఇనిస్టిట్యూట్‌లలో ఒకటైన కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విభాగం గచ్చిబౌలిలోని టాలెంట్ స్ప్రింట్‌తో ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది. అందులో భాగంలో గూగుల్ సంస్థ సహకారంలో ఈ టెక్‌వైజ్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. 18 నెలల ఈ కోర్సు ఫీజును గూగుల్ సంస్థ సమకూరుస్తుంది. పూర్తి ఉచితంగా ఈ కోర్సు అందిస్తారు. ఇతర ఖర్చుల కోసం స్కాలర్‌షిప్ కూడా ఉంటుంది. 110 మందికి విద్యార్థులకు ఈ కోర్సు చదివేందుకు అవకాశం కల్పిస్తారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఎస్‌సీఎస్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్ టీమ్ సర్టిఫికెట్ అందిస్తారు. కోర్సు వివరాలను కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రామ్ కొండూరు, గూగుల్ వీపీ, జీఎం శివ వెంకటరామన్, టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈఓ సంతను పాల్ వివరించారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్నూరుకాపు సంఘం నేతలు

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మున్నూరు కాపుల అభివృద్ధి, సంక్షేమానికి రూ. 5 వేల కోట్లతో మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కాపు సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వనమల ప్రవీణ్ కుమార్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరే దశరథంల ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లను గాంధీభవన్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు హైదరాబాద్‌లో మున్నూరు కాపు భవన్ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం, రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో మున్నూరు కాపులకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని కోరారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపు కుల సంఘాల ప్రతినిధులందరితో సమావేశం ఏర్పాటు చేసి కార్పొరేషన్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. మున్నూరుకాపు సంఘం నేతలు ఆరె మహేందర్, చింతల సాయి శంకర్ పటేల్, దాది అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా చెత్త డంపింగ్ ప్రదేశాల తొలగింపు

వినియోగంలో లేని పబ్లిక్ టాయిలెట్లను తొలగించండి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆదేశం
- శేరిలింగంపల్లి మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం

గచ్చిబౌలి: నగరంలోని ఖాళీ ప్రదేశాల్లో చెత్త డంపింగ్ చేసే ప్రదేశాలు (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల)ను దశల వారీగా తొలగించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు.బుధవారం శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చెత్తను ఎస్‌టీపీలకు ఎత్తడం, ప్రతి సర్కిల్‌లో తిరుగుతున్న వాహనాల సంఖ్య, సీ అండ్ డీ మెటీరియల్, ఎస్ఎఫ్ఏ సంఖ్య, పారిశుద్ధ్య కార్మికులు, వారి హాజరును సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలోని ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మహిళా సంఘాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గేటెడ్ కమ్యూనిటీలో చెత్తను సేకరించేందుకు వీలుగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని, వినియోగంలో లేని పబ్లిక్ టాయిలెట్లను తొలగించాలని ఆదేశించారు.

పలు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్...

జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఇతర విభాగాల అధికారులతో కలిసి శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. దుర్గం చెరువు, చుట్టుపక్కల ప్రాంతాలను, సరిహద్దు గోడలను, నడక మార్గాలను, ఇతర ఇంజినీరింగ్ , పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కియోస్కులు, తినుబండారాను గమనించిన కమిషనర్ వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. దుర్గం చెరువు ప్రవేశ ద్వారం చుట్టూ ఎలాంటి స్థిర కియోస్కులను అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు, ఫుట్‌పాత్‌పై ఉక్కు పట్టాలను నిర్మించడం, తద్వారా ఆక్రమణలను నిరోధించడం, మంచి వాతావరణాన్ని సృష్టించడానికి వీటి ఫర్నిచర్‌ను వినూత్న పద్ధతిలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషన్లు, జాయింట్ కమిషనర్ శానిటేషన్, ఇంజినీరింగ్ యూబీడీ, శానిటేషన్ వింగ్, ఇతర సీనియర్ అధికారులు, వెస్ట్‌జోన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.


శేరిలింపల్లిలో జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశమైన జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

విద్యుత్ కార్మికులపై దాడులు అరికట్టాలని ధర్నా


ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

సైదాబాద్: విద్యుత్ కార్మికులపై దాడులను అరికట్టి, రక్షణ కల్పించాలని పలు విద్యుత్ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని, ట్రాన్స్‌కో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కుర్మగూడ కార్పొరేటర్ ఇంటికి విద్యుత్ బకాయి వసూలుకు వెళ్లిన ఉద్యోగి రజనీష్ బాబుపై కార్పొరేటర్ కుటుంబ సభ్యులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం కార్మికులు ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, పాతబస్తీలో విధులు నిర్వహించాలంటేనే విద్యుత్ కార్మికులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. పాతబస్తీలో పలువురు విద్యుత్ చౌర్యానికి పాల్పడటమే కాకుండా బకాయిలు అడగటానికి వెళ్లిన ఉద్యోగిపై దాడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ ఉద్యోగిపై దాడి చేసిన వారిపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి రియాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు విషయమై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే న్యాయం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేస్తామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. ధర్నా చేస్తున్న కార్మికుల వద్దకు ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డీఈ హన్మంత్‌రెడ్డి వచ్చారు. అధైర్యపడొద్దని, ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన కార్మికులకు హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.


● తాడేపల్లి సుబ్బలక్ష్మి, గాయని, వయొలిన్ విద్వాంసురాలు

స్వరవీణ

ఏడు పదులు దాటిన వయసు.
ఆరు దశాబ్దాలు దాటిన సంగీత సాధన.
దేశవిదేశాలకు విస్తరించిన ప్రతిభ.
సంగీతాన్నే శ్వాసించాలన్న అభిలాష.
ప్రచారానికి దూరంగా పరిమళిస్తున్న స్వరం.
ఇది... తాడేపల్లి సుబ్బలక్ష్మి స్వర ప్రస్థానం.

ఇంట్లోకి అడుగుపెట్టగానే సోఫా కార్నర్‌లో త్యాగయ్య విగ్రహం అతిథులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఉంటుంది. అదే గదిలో మరోదిక్కున వీణాపాణియైన సరస్వతీ మాత పాదాల చెంత తంబుర మీటుతున్న త్యాగరాజు, కామధేనువు నిత్యపూజలందుకుంటున్న దృశ్యం ఆకట్టుకుంటుంది. ''పుష్యమాసం బహుళ పంచమి త్యాగరాజు సిద్ధి పొందిన రోజు. తమిళనాడులో ఆరాధనోత్సవాలు మొదలయ్యాయి'' అంటూ సంతోషం నిండిన స్వరంతో తన సంగీత ప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారు తాడేపల్లి సుబ్బలక్ష్మి.

''మాది విజయవాడ. మా పెదనాన్న కొమ్ము వెంకటాచల భాగవతార్ హరికథకులు. కళల నిలయమైన ఇంట్లో పుట్టాను. ఆరవ ఏటనే నా సంగీత సాధన మొదలైంది. ఆకెళ్ల మల్లికార్జున శర్మ, కోటిపల్లి ప్రకాశరావులు నా వయోలిన్ గురువులు. విజయవాడ సత్యనారాయణపురంలో 'ప్రభుత్వ సంగీత కళాశాల' పెట్టారు. పదేళ్లకు ఆ కాలేజ్‌లో చేరాను. మంగళంపల్లి బాలమురళీకృష్ణ మా ప్రిన్సిపల్. ఆ తర్వాత నేదునూరి కృష్ణమూర్తిగారు కూడా. ఆరేళ్లపాటు సాధన చేసి వయోలిన్ లో సర్టిఫికేట్ కోర్సు, డిప్లమో చేశాను. ప్రైవేట్‌గా వోకల్ కోర్సు కూడా చేశాను. డిప్లమో అందుకోవడం ఆ వెంటనే పెళ్లి. అబ్బాయిని వెతుక్కోవాల్సిన పని పడలేదు. మా వారు ఉమాశంకర్ నా క్లాస్‌మేట్. జీవితాన్ని పంచుకున్నాం. సంగీత విద్వాంసులుగా వందలాది వేదికలను పంచుకున్నాం. సంగీత సాగరంలో మా జ్ఞానాన్వేషణ కొనసాగుతోంది.

సంగీత గురువు

సంగీత గురువుగా నా బాధ్యత 1985లో మొదలైంది. జవహర్ బాలభవన్‌లో వయోలిన్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేరాను. ఆ తర్వాత నేను చదివిన కాలేజీలోనే 'గాయక్ అసిస్టెంట్'గా చేరాను. వేదికల మీద గాత్ర సహకారం, వయొలిన్ సహకారం రెండూ చేయగలగడంతో అనేకమంది ప్రముఖులతో వేదిక పంచుకునే అవకాశం వచ్చింది. ప్రముఖ కూచిపూడి నాట్యకారిణి శోభానాయుడుకి గాత్ర సహకారం, ప్రముఖ గాయని శోభారాజ్‌కి వయోలిన్ సహకారం అందించాను. అలేఖ్య పుంజల, భాగవతుల సేతురామ్, ఆనంద్ శంకర్, మంజులా రామస్వామి, ఉమారామారావు, వాసిరెడ్డి కనకదుర్గ వంటి గొప్పవారితో నా సరిగమల, స్వర రాగాల ప్రయాణం సాగింది. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత సంగీత సేవ విస్తృతంగా చేయడానికి నాకు అవకాశాలు వచ్చాయి. దూరదర్శన్, భక్తి చానెల్, ఎస్‌వీబీసీ - నాద నీరాజనంతోపాటు ఇతర దేవాలయాల్లో లెక్కకు మించిన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఐసీసీఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్) నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సింగపూర్, టర్కీ, లెబనాన్, సౌత్ ఆఫ్రికా, శ్రీలంక, అబూదాబి వంటి దేశాల్లో కచేరీలు చేయగలిగాను. ఎన్టీఆర్‌గారు కళలను అభిమానించే వారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాదాపుగా ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ ప్రారంభగీతం ఆలపించాను. గవర్నర్ రంగరాజన్‌గారి హయాంలో గవర్నర్ బంగ్లాలో అప్పటి రాష్ట్రపతి కే ఆర్ నారాయణన్ గౌరవార్థం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో భక్తి సంగీతం ఆలపించడం వంటి ఎన్నో సంతోషాలను సంగీత సరస్వతి నాకిచ్చింది. నా వయసు 74. ఆరు దశాబ్దాలు దాటిన సంగీత సాధనను ఒకసారి సింహావలోకనం చేసుకుంటే నాకు ముచ్చటగా అనిపించే సందర్భం జూనియర్ ఎన్టీఆర్ నాట్యప్రదర్శన. మద్రాసు (చెన్నై)లో జరిగిన ఆ కార్యక్రమానికి సంగీత సహకారం అందించాను. ఆ పిల్లవాడు చాలా మంచి డాన్సర్.

నిరంతర గాన వాహిని

నేను మ్యూజిక్ కాలేజ్ నుంచి రిటైర్ అయ్యేటప్పటికి ప్రభుత్వ ఉద్యోగం నుంచి మా వారు కూడా రిటైర్ అయి ఉన్నారు. ఇద్దరం కలిసి 'వాగ్దేవి సంగీత విద్యాలయం' పేరుతో సంగీత పాఠశాలను స్థాపించాం. పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి డెబ్బైమందికి పైగా విద్యార్థులను పరీక్షలకు పంపించాం. నా స్టూడెంట్స్ కెనడా, యూఎస్, సింగపూర్‌లలో మ్యూజిక్ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. ఈ తరం బాల్యం చాలా చురుగ్గా ఉంటోంది. పిల్లల్లో గ్రహణ శక్తి చాలా మెండుగా ఉంది. త్వరగా నేర్చుకుంటున్నారు. అందుకు టెక్నాలజీ కూడా బాగా ఉపయోగపడుతోంది. అప్పట్లో మాకు గురువు పాడి వినిపించిన పాటను ఇంట్లో సాధన చేసేటప్పుడు ఏదైనా సందేహం వస్తే, మరునాడు క్లాస్‌లో నివృత్తి చేసుకోవాల్సిందే. ఇప్పుడలా కాదు, గురువు పాడేటప్పుడే రికార్డ్ చేసుకుని మళ్లీ మళ్లీ వింటూ నేర్చుకుంటున్నారు. కానీ సంగీతంలో కొనసాగేవాళ్లు తక్కువ. మూడేళ్లపాటు బాగా నేర్చుకున్న తర్వాత టెన్త్‌క్లాస్‌కు వచ్చారని, ఇంటర్‌మీడియట్ కూడా కీలకం కాబట్టి పూర్తి సమయం చదువుల కోసమే కేటాయించాలనే ఉద్దేశంతో సంగీతసాధనకు దూరమవుతున్నారు. మా రోజుల్లో సంగీతమే అసలు చదువుగా ఉండేది. నేను ప్రైవేట్‌గా మెట్రిక్యులేషన్ పూర్తి చేశాను. తమిళులు మాత్రం ఉన్నత చదువులు చదువుతూ సంగీతాన్ని కూడా కొనసాగిస్తుంటారు. మన తెలుగు వాళ్లలో ప్రతిభ ఉంది. అయితే అంకితభావమే తక్కువ. ఉపాధికి భరోసా ఉంటే ఈ కళను కెరీర్‌గా ఎంచుకునే వాళ్ల సంఖ్య పెరుగుతుంది. నాకనిపించేదేమిటంటే... పిల్లలకు స్కూల్ దశలోనే సంగీతం, నాట్యం వంటి కళల కోసం ఒక క్లాసు ఉంటే బాల్యంలోనే కళలు పరిచయమవుతాయి. కళాసాధనతో వచ్చే క్రమశిక్షణ వారిలో దుడుకుతనాన్ని తగ్గించి ఒద్దిక నేర్పుతుంది. పిల్లలు మంచి పౌరులుగా ఎదగడానికి పరోక్షంగా దోహదం చేస్తుంది. కాబట్టి పాఠశాల విద్యలో సంగీత, నాట్యాలను సిలబస్‌గా పెట్టే విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి'' అని ఆశాభావం వ్యక్తం చేశారు తాడేపల్లి సుబ్బలక్ష్మి.


● అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ నుంచి పురస్కారం అందుకుంటున్న సుబ్బలక్ష్మి

సుబ్బలక్ష్మి మంచి టీచర్

ఇది నేను సంపాదించుకున్న బిరుదు. ఇప్పటికీ రోజుకు రెండు గంటల పాటు కదలకుండా కూర్చుని సాధన చేస్తాను. పిల్లల చేత సాధన చేయిస్తాను. ఇంట్లో సంగీతపాఠాలు చెప్పే టీచర్లు కొందరు పిల్లలను తాళం వేయమని చెప్పి తాము వంట చేసుకుంటూ ఒక చెవి ఒగ్గి గమనిస్తుంటారు. టీచర్ ఎదురుగా ఉంటేనే క్రమశిక్షణ అలవడుతుందని నా విశ్వాసం. సంగీతం అంటే సరిగమలు పలకడం మాత్రమే కాదు, ఆత్మతో మమేకం కావాలి. సంగీత సాధన పట్ల పిల్లల్లో ఆసక్తిని, ఇష్టాన్ని కలిగించినప్పుడే గురువుగా మేము ఉత్తీర్ణత సాధించినట్లు. అలాగే కళ కోసం జీవించడంలో ఉండే సంతృప్తి జీవితాన్ని పరిపూర్ణం చేస్తుంది. నా యూట్యూబ్ చానెల్ 'తిల్లానా' కోసం పాటలు పాడి రికార్డ్ చేస్తున్నాను. భగవంతుడు ఒక నైపుణ్యాన్ని ఇస్తాడు, దానిని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనమీదే ఉంటుంది.

- తాడేపల్లి సుబ్బలక్ష్మి,
గాయని, వయొలిన్ విద్వాంసురాలు



- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: **నోముల రాజేశ్ రెడ్డి**

BUDGET 2024
ఉమెన్ పవర్‌కు ఊతం ఇచ్చేలా...

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్ గురించి గత వారం రోజుల నుంచి 'ఈసారి కూడా పేపర్‌లెస్ బడ్జెటే' అనే విశేషంతో పాటు ఫైనాన్స్ బిల్లులు, కేటాయింపులు, స్మార్ట్ ఫోన్ పరికరాలపై దిగుమతి సుంకాలు, వాయుకాలుష్యం తగ్గించడానికి ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రోత్సహించడానికి ఏంచేయబోతున్నారు... ఇలా రకరకాల విషయాలపై ఊహాగానాలు, చర్చలు జరిగాయి.

వ్యాపార రంగంలో మహిళ వ్యాపారవేత్తలు సత్తా చాటుతున్న కాలం ఇది.
వారి అడుగులను మరింత వేగవంతం చేయడానికి ఈ బడ్జెట్‌లో ఏం చేయబోతున్నారు?
మహిళల్లో నైపుణ్యాభివృద్ధికి ఎలాంటి కార్యాచరణ ఉండబోతోంది?
ఔత్సాహిక మహిళ పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ప్రోత్సాహకాలు, రాయితీలు అందనున్నాయి...
ఇలాంటి ప్రశ్నలెన్నో బడ్జెట్ నేపథ్యంలో మదిలో మెదులుతాయి.
'మహిళలకు సంబంధించి బడ్జెట్ 2024 ఎలా ఉండాలి?' అనే దానిపై కొందరు ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల అభిప్రాయాలు...

ప్రత్యేక నిధి



గత అయిదేళ్లలో మన దేశంలో మహిళల యాజమాన్యంలోని వ్యాపారాలు 20 శాతానికి పైగా పెరిగాయి. రాబోయే అయిదేళ్లలో 90 శాతం వరకు పెరుగుతాయని అంచనా. ఎన్నో నగరాల్లో మహిళా వ్యాపారుల ప్రతిభాసామర్థ్యాలను ప్రత్యక్షంగా చూశాను. ఇలాంటి వారికి 2024 బడ్జెట్ ఫండింగ్, మౌలిక సదుపాయాల విషయంలో వెన్నుదన్నుగా నిలవాలి. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నిధుల కేటాయింపులో గణనీయమైన పెరుగుదల ఉండాలి.

-స్వాతి భార్గవ, కో–ఫౌండర్, క్యాష్ కరో

మహిళా శ్రేయస్సు



మహిళల హెల్త్‌కేర్ బ్రాండ్ వ్యవస్థాపకురాలిగా మహిళల శ్రేయస్సుకు 2024 బడ్జెట్ దోహదకారి కావాలని కోరుకుంటున్నాను. స్కిల్ డెవలప్‌మెంట్, హెల్త్‌కేర్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లలో మహిళలు రాణించేందుకు, వారికి సాధికారత కల్పించేందుకు బడ్జెట్ ఉపయోగపడాలని ఆశిస్తున్నాను.

- రచనా గుప్తా, కో–ఫౌండర్, జినోవేద

గేమ్ చేంజర్‌గా...



మహిళలు నిర్వహించే వ్యాపారాలను ముందుకు నడిపించే గేమ్‌చేంజర్‌గా ఈ బడ్జెట్ ఉండాలని ఆశిస్తున్నాను. రుణ ప్రక్రియను సరళతరం చేయాలి. మహిళల నేతృత్వంలోని వ్యాపారాల్లో వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులను ప్రోత్సహించాలి. నిధుల అంతరాన్ని పూడ్చాలి. గ్రాంట్లు, సబ్సిడీలు, పన్ను మినహాయింపుల రూపంలో ఆర్థిక ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తున్నాం. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల వ్యాపార చతురత, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే శిక్షణా కార్యక్రమాల కోసం బడ్జెట్‌లో కేటాయింపులు అవసరం. మహిళలకు సంక్షేమ పథకాలు అందే విషయంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా చేయాలి. మాటలు కాదు కార్యాచరణ కనిపించాలి. 'ఇది కొత్త బడ్జెట్' అనిపించాలి.

- సోమ్‌దత్తా సింగ్, ఇ–కామర్స్ ఎంటర్ ప్రెన్యూర్, ఏంజెల్ ఇన్వెస్టర్, రైటర్

మరిన్ని పొదుపు పథకాలు



గ్రామీణ సమాజంలోని మహిళల కోసం మరిన్ని పొదుపు పథకాలను రూపొందిస్తారని ఆశిస్తున్నాను. వడ్డీ లేని రుణాలను ప్రవేశ పెట్టాలి. మహిళల నేతృత్వంలోని సంస్థల అభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్ ఉండాలి. మహిళలకు సంబంధించి ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌కు ప్రోత్సాహం అందేలా, స్కిల్ బిల్డింగ్‌కు ప్రయోజనం చేకూర్చే పథకాలను ప్రవేశపెట్టాలని ఆశిస్తున్నాను. స్కిల్ గ్యాప్స్ లేకుండా ఉండడానికి మహిళల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలి. కృత్రిమ మేధ ఆధారిత రంగాలలో మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సాంకేతిక శిక్షణా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

- ఉపాసన టకు, కో ఫౌండర్–మొబిక్విక్

ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదిగేలా...



పన్నెండవ తరగతి తరువాత యువతులకు నైపుణ్యశిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి. 'మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం' అని ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. వ్యవసాయరంగంలో ఉన్న మహిళలపై దృష్టి సారించాలి. ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలన్న మన దేశ లక్ష్యం నెరవేరేలా వివిధ రంగాల మహిళలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.

- జ్యోతీ బండారీ, లోవక్ క్యాపిటల్ ఫౌండర్, సీయివో

బాలికల విద్యకు ప్రాధాన్యత



రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన అలవెన్స్ పెంచాలి. ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలి. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. బాలికలకు సంబంధించి ఎడ్యుకేషనల్ బెనిఫిట్స్‌ను పెంచాలి.

- రాధిక దాల్మియ, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (కోల్కతా చాప్టర్)– చైర్‌పర్సన్

మహిళా రైతుల కోసం...



బడ్జెట్‌లో మహిళా రైతులు, కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యానికి గుర్తింపు ఇచ్చే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రాయితీల ద్వారా మహిళా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా ప్రోత్సాహకాలు అందించాలి.

- ధనశ్రీ మంధానీ, సలాం కిసాన్–ఫౌండర్

ఫ్యూచర్ రెడీ స్కిల్స్



'ఫ్యూచర్ రెడీ' స్కిల్స్ కోసం మహిళలను సన్నద్ధం చేసే కార్యాచరణను రూపొందించాలి. మహిళల నైపుణ్య శిక్షణకు సంబంధించి పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు ఇవ్వాలి. స్కిల్ డెవలప్‌మెంట్ వల్ల కెరీర్ బ్రేక్ తీసుకున్న మహిళలు తిరిగి ఉద్యోగాలు చేయడానికి అవకాశం ఉంటుంది.

- నేహా బగారియా,
ఫౌండర్– జాబ్స్ ఫర్ హర్



జంక్ ఫుడ్‌ని మాన్పిద్దాం ఇలా...

పీజా, బర్గర్, శాండ్‌విచ్, కూల్ డ్రింక్స్ లాంటి జంక్ ఫుడ్స్‌కు అలవాటుపడిన పిల్లలు ఇంట్లో చేసిన ఆహార పదార్థాలు తినడానికి ఇష్టపడరు. రోజూ జంక్‌ఫుడ్ తింటే ఆరోగ్యం పాడవుతుంది. ఇది పట్టని పిల్లలు అదే కావాలని మొండికేస్తుంటారు. ఇటువంటి వారిని జంక్‌ఫుడ్‌ని దూరంగా ఉంచాలంటే ఇలా చేయండి చాలు...

ఇష్టమైనవి వండండి: జంక్‌ఫుడ్ పూర్తిగా మాన్పించాలంటే ... ముందుగా పిల్లలు బాగా ఇష్టపడే వంటకాలను వండాలి. పిల్లలు ఏది తినడానికి ఆసక్తి చూపుతున్నారో అవి మాత్రమే వారికి చేసిపెట్టాలి. పెద్దలు తినేదే రోజు పెడితే అది నచ్చక బయట ఫుడ్‌కి అలవాటు పడతారు. ఇంట్లో ఫుడ్ మొహం మొత్తకుండా ఉండాలంటే పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు ఉపయోగించి బర్గర్స్, పిజ్జాలను ఇంట్లోనే తయారు చేసి పెట్టాలి.

అలవాట్లు: వీలైనంత త్వరగా పిల్లల ఆహారపు అలవాట్లు మార్చాలి. అలవాట్లు మార్చుకోకపోతే జంక్‌ఫుడ్ మానరు. మీరు చేసే ఫుడ్ వల్ల ఆరోగ్యానికి ఎంత మేలు జరుగుతుందో వివరిస్తూ, బుజ్జగిస్తూ చెబితే బయట తినే అలవాటును మానుకుంటారు.

పోషకాల గురించి వివరించాలి: ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి సమయాల్లో పిల్లలకు పెట్టే రకరకాల డిష్‌లను వేటితో తయారు చేశారు, వాటిలో పోషకాలు ఏం ఉంటాయి? అవి శరీరానికి చేసే మేలుని చక్కగా వివరిస్తే ఇంటి ఫుడ్‌ని తినడానికి ఆసక్తి చూపి జంక్ ఫుడ్‌ని అస్సలు ముట్టరు.

ఈ పద్ధతులను అనుసరిస్తే మీ పిల్లలు ఆరోగ్యంగా మారడం ఖాయం.

చైతన్యపథం

విద్యాప్రవీణ



మద్యానికి బానిసై తండ్రి చనిపోయాడు. కష్టాల మధ్య పెరిగిన ప్రవీణ పశువుల కాపరిగా పనిచేసింది. కూలిపనులు చేసింది. చదువు ఆమెకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రవీణను 23 సంవత్సరాల వయసులో సర్పంచ్‌ని చేసింది. బాలికల విద్య నుంచి స్త్రీ సాధికారత వరకు ఎన్నో విషయాలపై స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తోంది ప్రవీణ.

రాజస్థాన్‌లోని పలి జిల్లా సగ్దార గ్రామానికి చెందిన ప్రవీణ తన గ్రామంలోనే కాదు చుట్టుపక్కల ఎన్నో గ్రామాల ప్రజలకు స్ఫూర్తిదాయక మహిళగా మారింది. మూడో క్లాసులో ఉన్నప్పుడు ప్రవీణను చదువు మానిపించారు. దీంతో తనకు ఇష్టమైన చదువుకు దూరం అయింది.

చదువుకు దూరం అయిన ప్రవీణ పశువులను మేపడం నుంచి కూలిపనుల వరకు ఎన్నో చేసింది. రెండు సంవత్సరాల తరువాత ఆమె జీవితాన్ని మార్చే సంఘటన జరిగింది. తమ ఊరికి నలభై కిలోమీటర్ల దూరం లో ఉన్న గ్రామంలోని రెసిడెన్షియల్ స్కూల్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ (కేజీబీవి)లో చదువుకునే అవకాశం వెదుక్కుంటూ వచ్చింది.

అయితే మొదట్లో కుటుంబ సభ్యులు ససేమిరా అన్నారు. 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన ఒక ఫీల్డ్ వర్కర్ కృషివల్ల ఎట్టకేలకు బడిలో ప్రవీణను చేర్పించడానికి ఒప్పుకున్నారు.

స్కూల్ చదువు వల్ల ఆత్మవిశ్వాసం పెరగడం మాత్రమే కాదు, ఆడపిల్లలు చదువుకోవడం వల్ల ఎంత మేలు జరుగుతుందో ప్రత్యక్షంగా తెలుసుకోగలిగింది ప్రవీణ. చదువు పూర్తయిన తరువాత ఒక కన్‌స్ట్రక్షన్ వర్కర్‌తో ప్రవీణ పెళ్లి జరిగింది. 'చదువుకున్న అమ్మాయి'గా అత్తగారి ఇంట్లో ప్రవీణకు తగిన గౌరవ మర్యాదలు ఇచ్చేవారు. తాను తీసుకునే నిర్ణయాలకు అండగా నిలబడేవారు.

'సర్పంచ్ ఎలక్షన్‌లో పోటీ చేయాలనుకుంటున్నాను' అన్నప్పుడు అందరూ అండగా నిలబడ్డారు. కొంతమంది మాత్రం వెనక్కి లాగే ప్రయత్నం చేశారు. అయితే అవేమీ పట్టించుకోకుండా ముందుకు వెళ్లింది. సర్పంచ్‌గా విజయం సాధించింది. చదువు విలువ తెలిసిన ప్రవీణ సర్పంచ్ అయిన రోజు నుంచి బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇంటింటికి వెళ్లి చదువుకోవడం వల్ల ఆడపిల్లలకు కలిగే ఉపయోగాల గురించి ప్రచారం చేసేది. బాల్యవివాహాలు జరగకుండా అడ్డుకునేది.

'అప్పుడెప్పుడో మా అమ్మాయిని చదువు మానిపించాం. ఇప్పుడు తిరిగి బడిలో చేర్చాలనుకుంటున్నాం' అంటూ ఎంతోమంది తల్లిదండ్రులు ప్రవీణ సలహాల కోసం వచ్చేవారు.

సర్పంచ్‌గా ఆడపిల్లలకు ప్రత్యేకంగా స్కూలు కట్టించింది ప్రవీణ. బాలికల విద్య కోసం పనిచేస్తున్న సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ప్రవీణ ఏదైనా గ్రామానికి వెళ్లినప్పుడు ఉపాధ్యాయులు తమ స్కూలుకు తీసుకువెళ్లి ఆడపిల్లలకు పరిచయం చేసేవారు. 'చదువుకోకపోతే ప్రవీణ కూలిపనులు చేస్తూ ఉండిపోయేది. చదువుకోవడం వల్ల ఆమెలో ఆత్మవిశ్వాసం వచ్చింది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రవీణను సర్పంచ్‌ను చేసి పదిమందికి ఉపయోగపడే మంచి పనులు చేసేలా చేసింది. మీరు బాగా చదువుకుంటే సర్పంచ్ మాత్రమే కాదు కలెక్టర్ కూడా కావచ్చు'... ఇలాంటి మాటలు ఎన్నో చెప్పేవారు.

ఆడపిల్లల చదువు కోసం పనిచేస్తున్న 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థ తమ ప్రచార చిత్రాలలో ప్రవీణ ఫొటోలను ఉపయోగించుకుంటుంది. దీంతో ఎన్నో గ్రామాలకు ఆమె సుపరిచితం అయింది.

'ఏదైనా గ్రామానికి వెళ్లినప్పుడు స్కూల్లో చదివే అమ్మాయిలతో మాట్లాడుతుంటాను. మీ గురించి ఫీల్డ్ వర్కర్స్ మా పేరెంట్స్‌కు చెప్పి స్కూల్‌కు పంపించేలా ఒప్పించారు... అని ఎంతోమంది అమ్మాయిలు అన్నప్పుడు గర్వంగా అనిపించేది. ఆడపిల్లల విద్యకు సంబంధించి భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలనుకుంటున్నాను' అంటుంది ప్రవీణ.



మూడోసారి ఏసీసీ అధ్యక్షుడిగా జై షా

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా మూడోసారి ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బాలిలో బుధవారం జరిగిన ఏసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో జై షాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2021 జనవరిలో తొలిసారి ఏసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జై షా ఈ పదవిలో మరో ఏడాదిపాటు కొనసాగుతారు. జై షా పర్యవేక్షణలో ఏసీసీ 2022లో ఆసియా కప్ టి20 టోర్నీ, 2023లో ఆసియా కప్ వన్డే టోర్నీని విజయవంతంగా నిర్వహించింది.

రెండో టెస్టుకు జాక్ లీచ్ దూరం

భారత జట్టుతో జరిగే రెండో టెస్టులో ఇంగ్లండ్ బృందంలోని అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జాక్ లీచ్ బరిలోకి దిగడం లేదు. బుధవారం జరిగిన ట్రెయినింగ్ సెషన్‌లో జాక్ లీచ్ పాల్గొనలేదు. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టు సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో జాక్ లీచ్ మోకాలికి గాయమైంది. రెండో టెస్టుకు లీచ్ అందుబాటులో లేకపోవడంతో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అరంగేట్రం చేయడం ఖాయమైంది.



అఖిల్‌కు కాంస్యం



కైరో: ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత షూటర్ అఖిల్ షెరాన్ కాంస్య పతకంతో మెరిశాడు. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో అఖిల్ మూడో స్థానంలో నిలిచాడు. ఎనిమిది మంది పాల్గొన్న ఫైనల్లో అఖిల్ 451.8 పాయింట్లు స్కోరు చేశాడు. అఖిల్ ప్రదర్శనతో భారత్ ఈ టోర్నీని రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి ఆరు పతకాలతో అగ్రస్థానంతో ముగించింది.

భారత్‌కు ఐదో స్థానం



మస్కట్: 'ఫైవ్-ఎ-సైడ్' పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు ఐదో స్థానం లభించింది. బుధవారం ముగిసిన ఈ టోర్నీలో 5-6 స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో భారత్ 6-4 గోల్స్ తేడాతో ఈజిప్ట్ జట్టును ఓడించింది. భారత్ తరఫున మణీందర్ (10వ, 23వ ని.లో) రెండు గోల్స్ చేయగా... రాహీల్ (8వ ని.లో), పవన్ (9వ ని.లో), ఉత్తమ్ (13వ ని.లో), మందీప్ (11వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఫైనల్లో నెదర్లాండ్స్ 5-2తో మలేసియాపై గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది.

మయాంక్ డిశ్చార్జి



అగర్తలా: కర్ణాటక రంజీ జట్టు కెప్టెన్, భారత క్రికెటర్ మయాంక్ అగర్వాల్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. శుక్రవారం నుంచి రైల్వేస్‌తో జరిగే రంజీ ట్రోఫీ మ్యాచ్ కోసం మంగళవారం సాయంత్రం అగర్తలా నుంచి సూరత్ బయలుదేరేందుకు మయాంక్ విమానం ఎక్కాడు. తాను కూర్చున్న సీటు ముందు ప్లాస్టిక్ కవర్‌లో ఉంచిన హానికారక ద్రవ్యాన్ని నీళ్లనుకొని మయాంక్ తాగాడు. ఆ వెంటనే అతని నోరు వాచిపోయి బొబ్బలు రావడంతో మాట్లాడలేకపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దాంతో వెంటనే విమానాన్ని ఆపి అతడిని ఆసుపత్రికి తరలించారు. రోజంతా ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న మయాంక్ బుధవారం సాయంత్రంకల్లా కోలుకోవడంతో అతడిని డిశ్చార్జి చేశారు.



రోహిత్ పైనే భారం

కెప్టెన్‌కు కలిసొచ్చిన విశాఖపట్నం మైదానం
ఇక్కడ ఆడిన గత టెస్టులో రెండు సెంచరీలు చేసిన రోహిత్

విశాఖ స్పోర్ట్స్: ఒకవైపు విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా తదితర కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం... మరోవైపు అనుభవంలేని యువ ఆటగాళ్లు... తొలి టెస్టులో ఊహించని పరాజయం... ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని వైఎస్‌ఆర్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం నుంచి ఇంగ్లండ్‌తో జరిగే రెండో టెస్టులో భారత ప్రదర్శన ఎలా ఉంటుందోనని ఆసక్తి నెలకొని ఉంది. ఈ వేదికపై భారత జట్టు ఇప్పటి వరకు రెండు టెస్టులు ఆడింది. ఆ రెండింటిలోనూ భారత జట్టే గెలిచింది. కోహ్లి కెప్టెన్సీలో 2016 నవంబర్ 17 నుంచి 21 వరకు ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో టీమిండియా 246 పరుగుల తేడాతో గెలిచింది. అనంతరం 2019 అక్టోబర్ 2 నుంచి 6 వరకు దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో కోహ్లి సారథ్యంలోనే భారత జట్టు 203 పరుగుల తేడాతో విజయం సాధించింది. క్రితంసారి ఇక్కడ ఆడిన భారత టెస్టు జట్టు నుంచి కేవలం రోహిత్, అశ్విన్ మాత్రమే ఈసారి ఆడుతున్నారు. నాటి టెస్టులో రోహిత్ రెండు సెంచరీలతో (తొలి ఇన్నింగ్స్‌లో 176; రెండో ఇన్నింగ్స్‌లో 127) అదరగొట్టాడు. ఫలితంగా బ్యాటింగ్ విషయంలో ఈసారీ రోహిత్ శర్మపైనే అధిక భారం పడనుంది. మరోసారి రోహిత్ మెరిసి... యశస్వి, అయ్యర్ ఇతర ఆటగాళ్లు కూడా రాణిస్తే విశాఖపట్నంలో భారత జట్టు ప్రత్యర్థికి గట్టిపోటీనిచ్చే అవకాశం ఉంటుంది.



అయ్యర్, సర్ఫరాజ్, రజత్, యశస్వి

సంయమనం అవసరం: కోచ్ రాథోడ్

యువ క్రికెటర్లకు మరిన్ని అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని భారత్ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అన్నారు. ఒకట్రెండు మ్యాచ్‌లతో వారి సత్తాపై అంచనాకు రావొద్దని ఆయన కోరారు. బుధవారం ఇరు జట్ల ఆటగాళ్లు ముమ్మర సాధన చేశారు. ప్రాక్టీస్ సెషన్ అనంతరం విక్రమ్ రాథోడ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ప్రస్తుత భారత జట్టులోని శుబ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్ ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడలేదు. వారి విషయంలో తొందరపడాల్సిన అవసరం లేదు. వారిపట్ల సంయమనంతో వ్యవహరించాలి. అయ్యర్ త్వరలోనే ఫామ్‌లోకి వస్తాడని గట్టి నమ్మకంతో ఉన్నా. పిచ్, మ్యాచ్ పరిస్థితులకు తగ్గట్టు ఆడటం అలవాటు చేసుకోవాలి. పరుగులు చేసేందుకు అవకాశాలు ఉంటే వాటిని సద్వినియోగం చేసుకోవాలి. షాట్‌ల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి' అని రాథోడ్ వ్యాఖ్యానించారు.

అశ్విన్ టాప్ ర్యాంక్ పదిలం



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో అశ్విన్ మొత్తం ఆరు వికెట్లు పడగొట్టాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 853 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ కగిసో రబడ ఒక స్థానం పురోగతి సాధించి 851 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకున్నాడు. భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఒక స్థానం మెరుగుపర్చుకొని 825 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలువగా... స్పిన్నర్ రవీంద్ర జడేజా 754 పాయింట్లతో ఆరో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఒక స్థానం పడిపోయి 729 పాయింట్లతో 12వ ర్యాంక్‌లో నిలిచాడు. టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్, రవీంద్ర జడేజా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు.

శ్రీకాంత్ ముందంజ

ప్రిక్వార్టర్స్‌లో శంకర్, మిథున్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్, శంకర్ ముత్తుస్వామి, మిథున్ మంజునాథ్ శుభారంభం చేశారు. సమీర్ వర్మ, కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 45 నిమిషాల్లో 22-20, 21-19తో ప్రపంచ 26వ ర్యాంకర్ వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై గెలుపొందగా... శంకర్ 21-14, 21-17తో లియోంగ్ జున్ హావో (మలేసియా)ను, మిథున్ 21-17, 21-8తో జేసన్ (హాంకాంగ్)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మరో మ్యాచ్‌లో సమీర్ వర్మ 14-21, 18-21తో లాంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోగా... లె లాన్ జి (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో కిరణ్ జార్జి తొలి గేమ్‌ను 17-21తో కోల్పోయాక గాయంతో వైదొలిగాడు. మహిళల సింగిల్స్‌లో అష్మిత, మాళవిక ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టగా... హైదరాబాద్ అమ్మాయి సామియా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. అష్మిత 21-10, 21-16తో వాంగ్ లింగ్ చింగ్ (మలేసియా)పై, మాళవిక 22-20, 21-8తో ఇనెస్ (పెరూ)పై నెగ్గగా... సామియా 14-21, 18-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్స్‌లో రష్మిక జోడీ



ఇండోర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మికకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సింగిల్స్ విభాగంలో తొలి రౌండ్‌లో ఓడిపోయిన రష్మిక... డబుల్స్‌లో వైదేహి చౌధరీ (భారత్)తో కలిసి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. 'వైల్డ్ కార్డు'తో సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో పోటీపడిన రష్మిక తొలి రౌండ్‌లో 6-7 (8/10), 6-7 (2/7)తో రీనా సాల్గో (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 2 గంటల 19 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఏడు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి జంట 6-3, 6-3తో సహజ యామలపల్లి-వైష్ణవి (భారత్) జోడీపై విజయం సాధించింది.

ప్లే ఆఫ్స్‌కు జైపూర్ పింక్ పాంథర్స్

పట్నా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ దశకు అర్హత పొందిన తొలి జట్టుగా డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ నిలిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 42-27తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. ఈ టోర్నీలో పింక్ పాంథర్స్‌కిది 12వ విజయం కావడం విశేషం. 12 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో పింక్ పాంథర్స్ 71 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది. తలైవాస్‌తో మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్వాల్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేశాడు. పట్నా పైరేట్స్, బెంగళూరు బుల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 29-29తో 'డ్రా'గా ముగిసింది. శుక్రవారం జరిగే మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీతో బెంగాల్ వారియర్స్; గుజరాత్ జెయింట్స్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.

సినిమా

మూడోసారి



● శేఖర్ కమ్ముల

డైరెక్టర్ శేఖర్ కమ్ముల, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ కలయికలో మూడో సినిమా ప్రకటన వచ్చింది. శ్రీ నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్ యూనిట్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. గతంలో వీరి కలయికలో నాగచైతన్య, సాయిపల్లవి జంటగా వచ్చిన 'లవ్ స్టోరీ' చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. రెండో సినిమాగా ధనుష్, నాగార్జునలతో ఓ మల్టీ స్టారర్ మూవీ తెరకెక్కిస్తున్నారు శేఖర్ కమ్ముల. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం తిరుపతిలో జరుగుతోంది. తాజాగా ఈ ప్రొడక్షన్ హౌస్ తమ కొత్త చిత్రాన్ని ప్రకటించింది. ''శేఖర్ కమ్ములతో తీయబోయే మూడో చిత్రం లార్జర్ దెన్ లైఫ్‌గా ఉంటుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. హై బడ్జెట్, టాప్ క్లాస్ సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో ఈ మూవీ రూపొందనుంది. ధనుష్, నాగార్జునలతో శేఖర్ కమ్ముల తీస్తున్న మూవీ చిత్రీకరణ పూర్తయ్యాక ఈ మూవీ సెట్స్‌పైకి వెళుతుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలీ నారంగ్.

వారి కష్టానికి ప్రతిఫలం రావాలి - 'దిల్' రాజు



● విక్రాంత్ శ్రీనివాస్, లక్ష్, 'దిల్' రాజు

''25 ఏళ్ల నుంచి చదలవాడ బ్రదర్స్‌ని చూస్తున్నాం. శ్రీనివాస్‌గారు చిన్న నిర్మాతలకు ఫైనాన్షియల్‌గా సపోర్ట్ చేస్తారు. ఇక లక్ష్ నటించిన 'ధీర' ట్రైలర్ బాగుంది. తన హార్డ్ వర్క్, చిత్ర యూనిట్ పడిన కష్టానికి తగిన ప్రతిఫలం రావాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. లక్ష్ చదలవాడ హీరోగా విక్రాంత్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'ధీర'. చదలవాడ బ్రదర్స్ సమర్పణలో పద్మావతి చదలవాడ నిర్మించిన ఈ మూవీ రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి 'దిల్' రాజు, దర్శకులు గోపీచంద్ మలినేని, త్రినాథరావు నక్కిన అతిథులుగా హాజరై, సినిమా బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''ఇన్నేళ్లలో ఎంతో మంది దర్శకులని పరిచయం చేశాను. 'ధీర'తో విక్రాంత్‌ను పరిచయం చేస్తున్నాను. లక్ష్‌ను చూసి తండ్రిగా గర్విస్తుంటాను. మా ప్రొడక్షన్‌లో ఇప్పుడు పదహారు చిత్రాలు రెడీగా ఉన్నాయి'' అన్నారు. ''పక్కోడి గురించి పట్టించుకోకుండా నచ్చింది చేసే వాడికి ఓ మిషన్ అప్పగిస్తే ఆ ప్రయాణంలో ఏర్పడిన సమస్యల్ని 'ధీర'లో చూస్తారు'' అన్నారు లక్ష్ చదలవాడ. ''ధీర' చాలా యూనిక్ పాయింట్. అందరికీ నచ్చుతుంది'' అన్నారు విక్రాంత్ శ్రీనివాస్.

రేపు బ్యాండు మోగించాలి - అడివి శేష్



● సుహాస్, అడివి శేష్, శివాని

''చాయ్ బిస్కట్ సంస్థలో సుహాస్ వీడియోలు చేస్తున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఇలాంటి ప్రతిభ ఉన్న నటులు చాలా అరుదుగా ఉంటారు. తను ఏ స్థాయికి వెళతాడో ఊహించలేను. ఏదో ఒక రోజు తను నా వేడుకకి అతిథిగా రావాలి. 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ట్రైలర్ నచ్చడంతో పది సార్లు చూశా. రేపు (శుక్రవారం) మనమంతా ఈ సినిమా బ్యాండ్ మోగించాలి'' అని హీరో అడివి శేష్ అన్నారు. సుహాస్, శివానీ నాగరం జంటగా దుష్యంత్ కటికనేని దర్శకత్వం వహించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి అడివి శేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దుష్యంత్ కటికనేని మాట్లాడుతూ– ''సుహాస్ లేకుంటే డైరెక్టర్‌గా ఈ వేదికపైకి వచ్చేందుకు ఇంకా ఎన్నేళ్లు పట్టేదో తెలియదు'' అన్నారు. ''నేను నిర్మాతగా ఈ వేదికపై నిలబడటానికి అల్లు అరవింద్, అల్లు శిరీష్, 'బన్నీ' వాసుగార్లే కారణం. సుహాస్ లేకుంటే ఈ చిత్రం లేదు'' అన్నారు ధీరజ్ మొగిలినేని.

కథే మొదటి హీరో - యశ్ పూరి



''హ్యాపీ ఎండింగ్' సినిమాలో మంచి పాటలు, కామెడీ ఉంటాయి. వీటిని కనెక్ట్ చేస్తూ కథలో బ్యూటిఫుల్ హ్యూమన్ ఎమోషన్ ఉంటుంది. అదే ఈ సినిమా కథకు అసలైన పాయింట్. ఒక్క మాటలో చెప్పాలంటే అన్నీ ఉన్న ధమ్ బిర్యానీ లాంటి సినిమా ఇది'' అని యష్ పూరి అన్నారు. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యష్ పూరి, అపూర్వా రావ్ జంటగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా యష్ పూరి మాట్లాడుతూ– ''పురాణాల్లో మనం చదివిన శాపాలు నేటి తరం కుర్రాడికి వస్తే అతని జీవితం ఎలా మారిపోయింది? ఆ శాపాన్ని ఎదుర్కొనేందుకు హర్ష్ చేసిన ప్రయత్నాలు ఏంటి? అనేది వినోదాత్మకంగా తెరకెక్కించాం. ఈ సినిమాకి మొదటి హీరో కథే.. నేను సెకండ్ హీరోని. కమర్షియల్ హీరోగా ఎదగాలన్నదే నా లక్ష్యం. అయితే హీరోగా స్థిరపడ్డాకే పక్కా కమర్షియల్ స్టైల్ సినిమాలు చేస్తాను'' అన్నారు.

ఈ సినిమాతో సమస్య అర్థమవుతుంది - మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



● 'మెకానిక్' యూనిట్‌తో కోమటి రెడ్డి

''నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్యను ప్రధానంగా తీసుకుని సమాజానికి సందేశం ఇచ్చేలా రూపొందిన 'మెకానిక్' సినిమాని ప్రజలందరూ ఆదరించాలి. ఈ మూవీ ద్వారా ఫ్లోరైడ్ సమస్య, బాధితుల బాధలు సమాజానికి అర్థమవుతాయి. ఈ చిత్రం హిట్ అవుతుంది'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మణి సాయితేజ, రేఖ నిరోషా జంటగా ముని సహేకర దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్'. ఎం. నాగమునెయ్య (మున్నా) నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను కోమటిరెడ్డి వెంకటరెడ్డి రిలీజ్ చేశారు. ''మా చిత్రంలో అన్ని వాణిజ్య అంశాలు ఉన్నాయి. మంచి సందేశాత్మక చిత్రం ఇది'' అన్నారు దర్శక-నిర్మాతలు.

హాలీవుడ్‌కి హాయ్

హాలీవుడ్‌లో చాన్స్ అంటే అంత సులభం కాదు. కానీ ప్రతిభ, కష్టపడేతత్వం ఉంటే అసాధ్యం కూడా కాదు. దాంతో పాటు కాస్త అదృష్టం కూడా తోడవ్వాలి. అలా టాలెంట్‌తో పాటు హార్డ్‌వర్క్ చేస్తున్న కొందరు హీరోయిన్లను అదృష్టం కూడా వరించడంతో హాలీవుడ్ కబురు అందింది. హాలీవుడ్‌కి హాయ్ చెప్పిన ఆ కథానాయికల గురించి తెలుసుకుందాం



● శ్రుతీహాసన్ ● శోభితా ధూళిపాళ ● ప్రనూతన్

● శ్రుతీహాసన్‌కు గత ఏడాది బాగా కలిసొచ్చిందనే చెప్పాలి. శ్రుతి హీరోయిన్‌గా నటించిన 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి', 'సలార్: సీజ్‌ఫైర్' సినిమాలు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. అలాగే శ్రుతీహాసన్ ఓ లీడ్ రోల్‌లో చేసిన ఇంగ్లిష్ ఫిల్మ్ 'ది ఐ' గ్రీక్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. 'రివర్ సిటీ', 'ది లాస్ట్ కింగ్‌డమ్' వంటి సిరీస్‌లలో నటించిన మార్క్ రౌలీ ఈ సినిమాలో శ్రుతీహాసన్‌కు జోడీగా నటించారు. దర్శకురాలు డాఫ్నే ష్మోన్ తెరకెక్కించారు. 'ది ఐ' సినిమాను త్వరలోనే థియేటర్స్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు. సో.. శ్రుతీ హాసన్‌కు ఇదే తొలి ఇంగ్లిష్ మూవీ అవుతుంది. అలాగే 'ది ఐ' చిత్రం లండన్ ఇండిపెండెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పదర్శితం కానుంది. బెస్ట్ ఫిల్మ్ విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఇదే జోష్‌లో 'చెన్నై స్టోరీ' అనే మరో ఇంగ్లిష్ ఫిల్మ్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు శ్రుతీహాసన్. 'ది అరేంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా 'బాఫ్టా' అవార్డు విజేత ఫిలిప్ జాన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రంలో శ్రుతీహాసన్‌కు లీడ్ పెయిర్‌గా అమెరికన్ నటుడు వివేక్ కల్రా నటిస్తారు. ఓ ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీ నడిపే అను (శ్రుతి పాత్ర) అనే యువతి నేపథ్యంలో సాగే రొమాంటిక్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. ఇండో-యూకే ప్రొడక్షన్ నిర్మించనున్న ఈ చిత్రానికి యూకేకి చెందిన బ్రిటిష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఫండింగ్ చేయనుంది. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. అయితే ఈ సినిమాలో తొలుత సమంత నటించాల్సింది. కొన్ని కారణాల వల్ల సమంత తప్పుకోవడంతో శ్రుతీహాసన్ చేస్తున్నారు.

● తెలుగు మూలాలు ఉన్న నాయిక శోభితా ధూళిపాళ. ఈ బ్యూటీ అడివి శేష్ హీరోగా రూపొందిన 'గూఢచారి', 'మేజర్' వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. మలయాళం, హిందీ భాషల్లోనూ సినిమాలు చేశారు. అయితే శోభితకు హాలీవుడ్ నుంచి కబురొచ్చింది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' ఫేమ్ దేవ్ పటేల్ నటించి, దర్శకత్వం వహించిన ఇంగ్లిష్ మూవీ 'మంకీ మ్యాన్'లో ఓ లీడ్ రోల్ చేశారు శోభిత. ఇటీవల ఈ సినిమా ట్రైలర్ కూడా విడుదలైంది. సినిమాను ఏప్రిల్ 5న థియేటర్స్‌లో విడుదల చేయనున్నారు. ''నా తొలి హాలీవుడ్ మూవీకి మీ (అభిమానులు, ప్రేక్షకులను ఉద్దేశించి) ప్రేమ, అభిమానం కావాలి'' అంటూ ఈ సినిమాను ఉద్దేశించి పేర్కొన్నారు శోభిత.

● దాదాపు నాలుగు దశాబ్దాలు వెండితెరపై వెలిగిన అలనాటి తార నూతన్ వారసురాలు ప్రనూతన్ బహల్. వెండితెరపై హిందీ చిత్రం 'నోట్‌బుక్' (2019)తో నటిగా ప్రయాణాన్ని మొదలు పెట్టారు ప్రనూతన్. ఆ తర్వాత 'హెల్మెట్' (2021)లోనూ మెరిశారామె. ఇప్పుడు ఈ యంగ్ బ్యూటీకి హాలీవుడ్ ఆఫర్ వచ్చింది. అమెరికన్ యాక్టర్ రహ్సాన్ నూర్ నటిస్తూ, దర్శకత్వం వహించనున్న ఓ రొమాంటిక్ డ్రామాలో ప్రనూతన్ హీరోయిన్‌గా నటించనున్నారు. 'కోకో అండ్ నట్' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా చిత్రీకరణ జూన్‌లో చికాగోలో ప్రారంభం కానుంది. ఇంగ్లిష్, ఇండియన్ నటులు ఈ సినిమాలో నటిస్తారు.

ఈ ముగ్గురితో పాటు మరికొంతమంది హీరోయిన్ల హాలీవుడ్ ఎంట్రీ జరిగే అవకాశం ఉంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	612	71,752
నిఫ్టీ ▲	204	21,726

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,310	▽ 200
డోజోన్స్	38,500	▲ 33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,631	▽ 36
డాక్స్	16,904	▽ 69
షాంఘై	2,789	▽ 42
నికాయ్	36,287	▲ 221

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,685	▲ 272
బంగారం (99.5 స్వచ్ఛత)	62,434	▲ 273
వెండి (కిలో)	71,668	▲ 717

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.74	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.54	107.09
€	యూరో	ఎస్‌బీఐ	89.00	91.36
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.84	57.11
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.07	56.00
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.45	12.52

జనవరిలో జీఎస్‌టీ @ రూ.1.72 లక్షల కోట్లు

వ్యవస్థ ప్రారంభం తర్వాత రెండో భారీ వసూళ్లు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జనవరిలో 10.4 శాతం పెరిగి రూ.1,72,129 కోట్లకు చేరుకున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. 2017 జూలైలో కొత్త పరోక్ష పన్నుల వ్యవస్థ ప్రారంభమైన తర్వాత ఇవి రెండవ అతిపెద్ద భారీ వసూళ్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.70 లక్షల కోట్లుపైబడిన వసూళ్లు ఇది మూడవసారి కావడం మరో విశేషం. జనవరి 31వ తేదీ 5 గంటల సమయం వరకూ చూస్తే, ఆర్థిక సంవత్సరం 2023 ఏప్రిల్ నుంచి జనవరి 2024 వరకూ జీఎస్‌టీ వసూళ్లు 11.6 శాతం పెరిగి 16.69 లక్షల కోట్లకు ఎగసింది. 2023 ఏప్రిల్‌లో ఇప్పటివరకూ అత్యధికంగా రూ.1.87 లక్షల కోట్ల జీఎస్‌టీ పన్ను వసూళ్లు చోటుచేసుకున్నాయి.



బిగ్ 'సి' స్టోర్లలో శాంసంగ్ గెలాక్సీ ఎస్24 సిరీస్ స్మార్ట్ ఫోన్లు

హైదరాబాద్: మొబైల్స్ విక్రయ సంస్థ బిగ్ 'సి' తమ స్టోర్లలో శాంసంగ్ ఎస్24 సిరీస్ స్మార్ట్ ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. 'శాంసంగ్ తమ కొత్త సిరీస్ గెలాక్సీ ఎస్24 అల్ట్రా, గెలాక్సీ ఎస్24 ప్లస్, గెలాక్సీ ఎస్24 స్మార్ట్ ఫోన్లను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల చేసేందుకు బిగ్ 'సి' సంస్థను ఎంచుకున్నందుకు సంతోషంగా ఉంది' అని ఎండీ బాలు చౌదరి తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సినీనటి మృణాల్ ఠాకూర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



జోయాలుక్కాస్ 'గ్రాండ్ ఆఫర్'

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ 'గ్రాండ్ ఆఫర్'ను ప్రకటించింది. వజ్రాభరణాలు, ప్రెషష్ స్టోన్స్, సిల్వర్‌తో విస్తృత శ్రేణి జ్యువెలరీ మజూరీ ఛార్జీలపై 50% ఆకర్షణీయమైన తగ్గింపు ఇస్తుంది. దేశవ్యాప్తంగా అన్ని జోయాలుక్కాస్ షోరూంలో ఫిబ్రవరి 18 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ జోయ్ అలుక్కాస్ కోరారు.

'పేటీఎమ్'కు ఆర్‌బీఐ షాక్!

- అన్ని సేవలు ఆపేయాలని ఆదేశం
- ఫిబ్రవరి 29 తర్వాత అమల్లోకి



న్యూఢిల్లీ: పేటీఎమ్ పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)కి రిజర్వ్ బ్యాంక్ షాక్ ఇచ్చింది. ఫిబ్రవరి 29 నుంచి డిపాజిట్ల స్వీకరణ, కస్టమర్ల ఖాతాలు.. వాలెట్లు, ఫాస్టాగ్‌ల టాపప్‌లు సహా దాదాపు అన్ని సర్వీసులు నిలిపివేయాలని ఆదేశించింది. అయితే, ఆయా కస్టమర్లకు చెల్లించాల్సిన వడ్డీ, క్యాష్‌బ్యాక్‌లు లేదా రీఫండ్‌లను ఎప్పుడైనా క్రెడిట్ చేయొచ్చని సూచించింది. పదే పదే నిబంధనలను ఉల్లంఘించడం, కార్యకలాపాలపై పర్యవేక్షణ ఆందోళనకరమైన విధంగా కొనసాగుతుండటం తదితర అంశాల కారణంగా ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. 'కస్టమర్ల ఖాతాలు, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, వాలెట్లు, ఫాస్టాగ్‌లు, ఎన్‌సీఎంసీ కార్డులు మొదలైన వాటిల్లో ఫిబ్రవరి 29 తర్వాత నుంచి ఎటువంటి డిపాజిట్లు లేదా క్రెడిట్ లావాదేవీలు లేదా టాప్‌అప్‌లకు అనుమతి ఉండదు. ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, యూపీఐ సదుపాయం వంటివి మినహా ఇతరత్రా ఎటువంటి బ్యాంకింగ్ సర్వీసులు అందించకూడదు. వడ్డీ, క్యాష్‌బ్యాక్‌లు లేదా రీఫండ్లను మాత్రం ఎప్పుడైనా జమ చేయొచ్చు' అని ఆర్‌బీఐ తెలిపింది. అలాగే కస్టమర్లు తమ సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లు, కరెంటు అకౌంట్లు, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఫాస్టాగ్‌లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులలో ఉన్న మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునేందుకు లేదా వినియోగించుకునేందుకు ఎటువంటి అడ్డంకులు పెట్టకుండా అనుమతించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 29 నాటికి అమలు దశలో ఉన్న లావాదేవీలన్నింటినీ మార్చి 15 నాటికల్లా పూర్తి చేసేయాలని, ఆ తర్వాత ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని పేర్కొంది. కొత్త కస్టమర్లను చేర్చుకోనివ్వకుండా 2022 మార్చి 11 నుంచే పీపీబీఎల్‌పై ఆర్‌బీఐ నిషేధం విధించింది. సర్వీస్ స్థాయి ఒప్పందంలో నిర్దేశించిన ప్రమాణాలు పాటించడం లేదని తేలడంతో కొత్తగా ఫాస్టాగ్‌లను జారీ చేయొద్దంటూ ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ కూడా పీపీబీఎల్‌ను గతంలోనే ఆదేశించింది.

పేటీఎమ్ షేరు బుధవారం ఫ్లాట్‌గా రూ. 761 వద్ద ముగిసింది.

ఫోన్ల విడిభాగాలపై సుంకం కట్



న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల తయారీలో ఉపయోగించే విడిభాగాలపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 15 నుంచి 10 శాతానికి తగ్గించింది. వీటిలో బ్యాటరీ కవర్, లెన్స్, సిమ్ సాకెట్, ఫోన్‌కు ముందు, మధ్యలో, వెనుక వాడే కవర్స్, స్క్రూ, ఇతర యాంత్రిక విడిభాగాలు ఉన్నాయి. దేశీయంగా ఉత్పత్తి, ఎగుమతులను పెంచడంతోపాటు స్థానిక మార్కెట్లలో మొబైల్ ఫోన్ల ధరలను తగ్గించడం లక్ష్యంగా ఆర్థిక శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. పన్ను హేతుబద్ధీకరణ మొబైల్ ఫోన్ తయారీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తుందని టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. భారత్‌లో తయారైన మొబైల్ ఫోన్ల ఎగుమతి పోటీతత్వాన్ని మెరుగుపరచడంపై సుంకం తగ్గింపు ప్రభావం చూపదని జీటీఆర్ఐ కో–ఫౌండర్ అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. ఎగుమతుల కోసం మొబైల్ ఫోన్ల తయారీలో ఉపయోగించే అన్ని విడిభాగాలను ఇప్పటికే సెజ్, అడ్వాన్స్ ఆథరైజేషన్ వంటి వివిధ ప్రభుత్వ పథకాల కింద జీరో డ్యూటీతో దిగుమతి చేసుకోవచ్చన్నారు. యాపిల్ వంటి సంస్థలు ఈ పథకాలను ఉపయోగిస్తున్నాయని చెప్పారు.

కీలక విధానపర నిర్ణయం..

మొబైల్‌ఫోన్ల తయారీని పోటీగా మార్చడానికి ప్రభుత్వం చేసిన కీలక విధానపర నిర్ణయం అని ఇండియన్ సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) చైర్మన్ పంకజ్ మొహింద్రూ అభిప్రాయపడ్డారు. 'కొన్నేళ్ల క్రితం భారత్ నుంచి ఎగుమతుల పరంగా ఎలక్ట్రానిక్స్ 9వ స్థానంలో ఉండేది. 2024లో ఏకంగా 5వ స్థానానికి చేరింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం కారణంగా ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో మొబైల్స్ వాటా 52 శాతానికి పైగా ఉంది. దేశీయంగా తయారీతో దిగుమతులపై ఆధారపడడం తగ్గడమేగాక గడిచిన 8 ఏళ్లలో ఎగుమతులతో దూసుకుపోయిన మొదటి పరిశ్రమ ఇదే' అని వివరించారు.

బడ్జెట్‌కు ముందు లాభాలు

- ఫెడ్ రిజర్వ్ పాలసీపై ఆశలు
- రాణించిన హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ షేర్లు
- సెన్సెక్స్ 612 పాయింట్లు ప్లస్
- 21,700 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ఫెడరల్ రిజర్వ్ పాలసీ, మధ్యంతర బడ్జెట్ సమావేశాల నుంచి సానుకూల నిర్ణయాలు వెలువడొచ్చనే ఆశావహ అంచనాలతో స్టాక్ సూచీలు బుధవారం ఒక శాతం లాభపడ్డాయి. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గడం కలిసొచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు ఒక శాతం రాణించి సూచీల ర్యాలీకి అండగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 612 పాయింట్లు పెరిగి 71,752 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 204 పాయింట్లు బలపడి 21,726 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలతో స్టాక్ సూచీలు ఉదయం స్వల్ప నష్టాలతో మొదలయ్యాయి. అయితే కొద్దిసేపటికే సూచీలు తిరిగి లాభాల్లోకి మళ్లాయి. నెలరోజులుగా అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్న బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 711 పాయింట్లు బలపడి 71,851 వద్ద, నిఫ్టీ 219 పాయింట్లు దూసుకెళ్లి 21,741 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ఫలితంగా బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్సులు 1.83%, 1.57% చొప్పున పెరిగాయి. సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో రూ.4.58 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.379 లక్షల కోట్లకు చేరింది.

మారుతీ లాభం స్పీడ్

క్యూ3లో రూ. 3,207 కోట్లు



న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికం(క్యూ3)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతం వృద్ధితో రూ. 3,207 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 2,406 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతం పుంజుకుని రూ. 33,513 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 29,251 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఈ కాలంలో 8 శాతం అధికంగా 5,01,207 వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీ అమ్మకాలు 4,29,422 యూనిట్లుకాగా.. 71,785 వాహనాలను ఎగుమతి చేసింది. ఇవి ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. గత క్యూ3లో దేశీయంగా 4,03,929, విదేశాలలో 61,982 యూనిట్లు చొప్పున విక్రయించింది. ఈ ఏడాది తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్) మారుతీ సుజుకీ 7 శాతం వృద్ధితో మొత్తం 15,51,292 వాహనాలను విక్రయించింది. ఇది సరికొత్త రికార్డుకాగా.. ఆదాయం, నికర లాభాల్లోనూ రికార్డులు నమోదయ్యాయి. మొత్తం ఆదాయం రూ. 1,03,387 కోట్లను తాకగా.. నికర లాభం 9,536 కోట్లు ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు 2.3 శాతం బలపడి రూ. 10,183 వద్ద ముగిసింది.

కోరమాండల్ కాకినాడ ప్లాంట్ విస్తరణ

- రూ.1,029 కోట్ల పెట్టుబడి
- 24 నెలల్లో నిర్మాణం పూర్తి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ కాకినాడ యూనిట్‌లో ఫాస్ఫరిక్, సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంట్ల ఏర్పాటుకు బోర్డు ఆమోదం పొందింది. రోజుకు ఫాస్ఫరిక్ యాసిడ్ 750 టన్నులు, సల్ఫ్యూరిక్ యాసిడ్ 1,800 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నూతన కేంద్రాలను జోడించనున్నారు. ఇందుకోసం రూ.1,029 కోట్లు పెట్టుబడి చేయనున్నట్టు సంస్థ ప్రకటించింది. 24 నెలల్లో ఈ విస్తరణ పూర్తి కానున్నట్టు వెల్లడించింది. కాకినాడ యూనిట్ సామర్థ్యం రోజుకు ఫాస్ఫరిక్ యాసిడ్ 1,550 టన్నులు, సల్ఫ్యూరిక్ యాసిడ్ 4,200 టన్నులు ఉంది. ప్రస్తుతం పూర్తి సామర్థ్యాన్ని కంపెనీ వినియోగించుకుంటోంది. ఎరువుల తయారీలో ఈ యాసిడ్స్‌ను ఉపయోగిస్తారు. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, తయారీ సామర్థ్యం పెంపొందించుకునేందుకు విస్తరణ చేపడుతున్నట్టు కంపెనీ వెల్లడించింది.



పూర్తి స్థాయి ప్లాంటుగా..

ఫాస్ఫేటిక్ ఎరువుల తయారీ, విక్రయంలో భారత్‌లో కోరమాండల్ రెండవ స్థానంలో నిలిచింది. ముడిసరుకు, ఎరువుల తయారీలో పూర్తి స్థాయి ప్లాంటుగా కాకినాడ కేంద్రాన్ని తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని కోరమాండల్ ఇంటర్నేషనల్ తెలిపింది. ప్రతిపాదిత విస్తరణతో కంపెనీ వ్యయ సామర్థ్యాలను, ముడిసరుకు భద్రతను మరింత మెరుగుపరుస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ వివరించారు. డ్రోన్స్ తయారీలో ఉన్న తమ అనుబంధ కంపెనీ ధక్ష బలమైన ఆర్డర్ బుక్ నమోదు చేసిందని చెప్పారు. రక్షణ రంగం, వ్యవసాయంతోపాటు వివిధ కంపెనీల నుంచి ఆర్డర్లు పొందామన్నారు. గ్రోమోర్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగాన్ని కంపెనీ ప్రోత్సహిస్తోంది.

మౌలిక పరిశ్రమల గ్రూప్ నిరాశ

న్యూఢిల్లీ: ఎనిమిది మౌలిక పరిశ్రమల గ్రూప్ డిసెంబర్‌లో తీవ్ర నిరాశను మిగిల్చింది. అధికారిక గణాంకాల ప్రకారం వృద్ధి రేటు 3.8%గా నమోదయ్యింది. అంతక్రితం గడచిన 14 నెలల్లో గ్రూప్ ఇంత తక్కువ స్థాయి వృద్ధి రేటు నమోదుచేసుకోవడం ఇదే తొలిసారి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ)లో 40% వెయిటేజ్ ఉన్న గ్రూప్‌లో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగాలు ఉన్నాయి. వీటిలో ఒక్క సహజ వాయువు రంగం (6.6%) పురోగమించింది. క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి 1% క్షీణించింది. ఇక ఆరు రంగాల వృద్ధి రేట్లూ 2022 డిసెంబర్‌తో పోల్చితే 2023 డిసెంబర్‌లో తగ్గాయి. కాగా, ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–డిసెంబర్ మధ్య ఈ రంగాల వృద్ధి రేటు దాదాపు స్థిరంగా 8.1% వద్ద నిలిచింది.



భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో 63వ, 34వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్నికల్) కోర్సు

ఇండియన్ ఆర్మీ 63వ, 34వ షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **63వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్) పురుషులు:** 350 పోస్టులు; **ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
» **34వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్) మహిళలు:** 29 పోస్టులు; **ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్. -ఎస్ఎస్‌సీ డబ్ల్యూ టెక్-01. -ఎస్ఎస్‌సీ డబ్ల్యూ నాన్-టెక్-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.10.2024 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** రూ.56,100 నుంచి రూ.1,77,500.
» **ఎంపిక విధానం:** దరఖాస్తును షార్ట్‌లిస్ట్, స్టేజ్-1, స్టేజ్-2 ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.02.2024
» **కోర్సు ప్రారంభం:** అక్టోబర్ 2024.
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

నేషనల్ డిఫెన్స్ అకాడమీలో 198 గ్రూప్ సి పోస్టులు

పుణె ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా గ్రూప్-సి(బ్యాక్‌లాగ్ సహా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 198
» **పోస్టుల వివరాలు:** లోయర్ డివిజన్ క్లర్క్-16, స్టెనోగ్రాఫర్ గ్రేడ్2-01, డ్రాఫ్ట్స్‌మ్యాన్-02, సినిమా ప్రొజెక్షనిస్ట్2-01, కుక్-14, కంపోజిటర్ కమ్ ప్రింటర్-01, సివిలియన్ మోటార్ డ్రైవర్(ఓజీ)-03, కార్పెంటర్-02, ఫైర్‌మ్యాన్-02, టీఏ-బేకర్ అండ్ కాన్ఫెక్షనర్-01, టీఏ-సైకిల్ రిపేరర్-02, టీఏ-ప్రింటింగ్ మెషిన్ ఆపరేటర్-01, టీఏ-బూట్ రిపేరర్-01, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఆఫీస్ అండ్ ట్రైనింగ్-151.
» **వయసు:** ఎల్‌డీసీ/స్టెనోగ్రాఫర్/డ్రాఫ్ట్స్‌మ్యాన్/డ్రైవర్/ఫైర్‌మెన్ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లు. ఇతర పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 12వ తరగతి, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి రాతపరీక్ష, స్కిల్/ప్రాక్టికల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://ndacivrect.gov.in

జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) హైదరాబాద్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» ఎక్స్‌టర్నల్(పార్ట్‌టైమ్) పీహెచ్‌డీ ప్రోగ్రామ్; ఫుల్ టైం పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రోగ్రామ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్); పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్(ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్).
» **ఫ్యాకల్టీ:** ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ సైన్స్.
» **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, బయో-టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఇన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథమేటిక్స్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫిజిక్స్, వాటర్ రీసోర్సెస్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్.
» **అర్హత:** పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ,ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి.యూజీసీ-నెట్/యూజీసీ-సీఎస్ఐఆర్ నెట్/స్లెట్/గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోరు ఉండాలి.
» **ఎంపిక విధానం:** పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను అనుసరించి విద్యార్హతలు, ప్రవేశ పరీక్ష,ఇంటర్వ్యూ, రీసెర్చ్ పబ్లికేషన్స్, రీసెర్చ్ వర్క్ పీపీటీ ప్రెజెంటేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 24.02.2024.
» **ఆలస్య రుసుము రూ.1000తో దరఖాస్తుకు చివరితేది:** 07.03.2024.
» **వెబ్‌సైట్:** https://jntuh.ac.in

పాలిటెక్నిక్ లెక్చరర్ కొలువుల స్వాగతం

» ఏపీలో 99 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రకటన
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100 -రూ.98,400
» ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ సబ్జెక్టులలో ఖాళీలు

ఏపీపీఎస్సీ..గత కొంతకాలంగా వరుస నోటిఫికేషన్లతో.. ప్రభుత్వ ఉద్యోగార్థులకు స్వాగతం పలుకుతోంది. ఇప్పటికే గ్రూప్-1, గ్రూప్ 2 మొదలు పలు నోటిఫికేషన్లు విడుదల చేసింది. తాజాగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ పరిధిలోని.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 99 లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల వివరాలు, అర్హతలు,ఎంపిక విధానం, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..

21 సబ్జెక్టులు-99 పోస్టులు

ఏపీపీఎస్సీ తాజా నోటిఫికేషన్ ద్వారా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో 21 సబ్జెక్టులలో మొత్తం 99 పోస్టుల భర్తీ చేపట్టనున్నట్లు పేర్కొంది. ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్-1 పోస్ట్; ఆటోమొబైల్ ఇంజనీరింగ్-8 పోస్టులు; బయోమెడికల్ ఇంజనీరింగ్-2 పోస్టులు;కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్-12 పోస్టులు; సెరామిక్ టెక్నాలజీ-1 పోస్ట్; కెమిస్ట్రీ-8 పోస్టులు; సివిల్ ఇంజనీరింగ్-15 పోస్టులు; కంప్యూటర్ ఇంజనీరింగ్ 8 పోస్టులు; ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్-10 పోస్టులు; ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-2 పోస్టులు; ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్-1 పోస్ట్; ఇంగ్లిష్-4 పోస్టులు; గార్మెంట్ టెక్నాలజీ-1 పోస్ట్; జియాలజీ-1 పోస్ట్; మ్యాథమెటిక్స్-4 పోస్టులు; మెకానికల్ ఇంజనీరింగ్-6 పోస్టులు;మెటలర్జికల్ ఇంజనీరింగ్-1 పోస్ట్, మైనింగ్ ఇంజనీరింగ్-4 పోస్టులు; ఫార్మసీ-3 పోస్టులు; ఫిజిక్స్-4 పోస్టులు;టెక్స్‌టైల్ టెక్నాలజీ-3 పోస్టులు.

అర్హతలు

- ఆయా సబ్జెక్ట్‌ను అనుసరించి బీటెక్ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు అర్హత కోర్సులో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి.
- **వయసు:** జూలై 1, 2023 నాటికి 18-42 ఏళ్లు ఉండాలి(బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు అయిదేళ్లు; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వర్గాలకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది).

ఎంపిక ప్రక్రియ

రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకాలను చేపట్టనున్నారు. రాత పరీక్షను రెండు పేపర్లుగా 450 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్-1: జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ-150 ప్రశ్నల(150 మార్కులు)కు ఉంటుంది. పేపర్-2: సంబంధిత సబ్జెక్ట్ పేపర్-150 ప్రశ్నల(300 మార్కులు)కు జరుగుతుంది. రాత పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పేపర్-1లో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు; పేపర్-2లో ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున కేటాయిస్తారు. ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల సమయం ఉంటుంది. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కు తగ్గిస్తారు.

కనీస మార్కుల నిబంధన

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే పోస్టుల భర్తీ చేపట్టనున్న నేపథ్యంలో.. కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కులను నిర్దేశించారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 30 శాతం మార్కులు సాధించాలి.

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ

పేపర్-1గా పేర్కొన్న జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీలో రాణించేందుకు.. అభ్యర్థులు ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. దీంతోపాటు జనరల్ సైన్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి, తాజా పరిస్థితులు, రక్షణ రంగంలో ప్రయోగాలు, ఇస్రో ప్రయోగాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. పర్యావరణ అంశాలకు సంబంధించి విపత్తు నిర్వహణ వ్యూహాలపై అవగాహన పెంచుకోవాలి. భారత్, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. చరిత్రకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, భారత చరిత్రలను చదవాలి. వీటితోపాటు భారత రాజ్యాంగం, ప్రభుత్వ పాలన విధానం, భారత భౌగోళిక శాస్త్రంలోని ముఖ్యమైన అంశాలను చదవాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి.

పేపర్-2కు ఇలా

అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పేపర్-2లో రాణించడానికి దృష్టి పెట్టాల్సిన అంశాలు..



- **ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్:** బేసిక్ డిజైన్, బిల్డింగ్ మెటీరియల్స్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, ఇంజనీరింగ్ మెకానిక్స్, ఆర్కిటెక్చరల్ డ్రాయింగ్ అండ్ గ్రాఫిక్స్, ఇంట్రడక్షన్ ఆఫ్ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్, హిస్టరీ ఆఫ్ ఆర్కిటెక్చర్, తదితర అంశాలు.
- **ఆటోమొబైల్ ఇంజనీరింగ్:** ఆటోమొబైల్ పవర్ ప్లాంట్స్, ఆటోమొబైల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఆటోమొబైల్ ఛాసిస్ అండ్ బాడీ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ట్రాన్స్‌మిషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఆటోమొబైల్ ఎలక్ట్రికల్ సిస్టమ్స్, మెటీరియల్ సైన్స్, కైనమాటిక్స్ అండ్ డైనమిక్స్ ఆఫ్ మెషీన్స్ తదితర అంశాలు.
- **బయోమెడికల్ ఇంజనీరింగ్:** రెస్పిరేటరీ మెజర్‌మెంట్స్ అండ్ ఎయిడ్, వెంటిలేటర్స్, ఆడియోమెట్రీ, ఎలక్ట్రో సర్జికల్ ఎక్విప్‌మెంట్స్, మెథడ్స్ ఆఫ్ కెమికల్ అనాలిసిస్ వంటి అంశాలు.
- **సెరామిక్ టెక్నాలజీ:** సిమెంట్ ఇండస్ట్రీ, పోర్ట్‌ల్యాండ్ సిమెంట్, స్పెషల్ సిమెంట్స్, స్పెషల్ సెరామిక్ మెటీరియల్స్, హై టెంపరేచర్ సెరామిక్ మెటీరియల్స్, సెరామిక్ కంపోజిట్స్, న్యూక్లియర్ సెరామిక్స్ తదితర అంశాలు.
- **కంప్యూటర్ ఇంజనీరింగ్:** హార్డ్‌వేర్, డిస్క్రీట్ మ్యాథమెటిక్స్, థియరీ ఆఫ్ కంప్యుటేషన్, కంపైలర్స్, ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిథమ్స్, డీబీఎంఎస్, ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, కంప్యూటర్ గ్రాఫిక్స్, ఏఐ టెక్నిక్స్, తదితర అంశాలు.
- **సివిల్ ఇంజనీరింగ్:** స్ట్రక్చరల్ డిజైన్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్, సర్వేయింగ్, ఇంజనీరింగ్ మెకానిక్స్ అండ్ స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్,హైడ్రాలిక్స్,క్వాంటిటీ సర్వేయింగ్,డిజైన్ ఆఫ్ స్ట్రక్చర్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాలు.
- **ఈసీఈ:** ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, నెట్‌వర్క్స్, డిజిటల్ సర్క్యూట్స్, కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన అంశాలు.
- **ఈఈఈ:** ఎలక్ట్రిక్ సర్క్యూట్స్ అండ్ ఫీల్డ్స్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, తదితర అంశాలు.
- **ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్:** అనలాగ్ ఎలక్ట్రానిక్స్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్స్, ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంట్రోల్ సిస్టమ్ అండ్ ప్రాసెస్ కంట్రోల్ తదితర టాపిక్స్.
- **మెకానికల్ ఇంజనీరింగ్:** అప్లైడ్ మెకానిక్స్ అండ్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిక్స్ అండ్ స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, మెషీన్ డిజైన్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, హైడ్రాలిక్స్ అండ్ హైడ్రాలిక్స్ మెషినరీ వంటి అంశాలు.
- **మెటలర్జికల్ ఇంజనీరింగ్:** మినరల్ ప్రాసెసింగ్ అండ్ ప్రిన్స్‌పుల్స్, ఫిజికల్ మెటలర్జీ అండ్ హీట్ ట్రీట్‌మెంట్, మెటలర్జికల్ థర్మోడైనమిక్స్, మెకానికల్ మెటలర్జీ, ఐరన్ అండ్ స్టీల్ మేకింగ్, పౌడర్ మెటలర్జీ ఆఫ్ మెటల్స్, మెటీరియల్ ప్రాసెసింగ్, ఫర్నేస్ టెక్నాలజీ, తదితరాలు.
- **మైనింగ్ ఇంజనీరింగ్:** మైన్ డెవలప్‌మెంట్, మైన్ సర్వేయింగ్, జియో మెకానిక్స్ అండ్ గ్రౌండ్ కంట్రోల్, సర్ఫేస్ ఎన్విరాన్‌మెంట్, మైన్ వెరిఫికేషన్, అండర్‌గ్రౌండ్ హజార్డ్స్, మైన్ ఎకనామిక్స్, మైన్ ప్లానింగ్ వంటి అంశాలు.
- **టెక్స్‌టైల్ టెక్నాలజీ:** టెక్స్‌టైల్ ఫైబర్స్, స్పిన్నింగ్, వీవింగ్, ఒవెన్ ఫ్యాబ్రిక్ డిజైన్, కెమికల్ ప్రాసెసింగ్ ఆఫ్ టెక్స్‌టైల్స్, అపారెల్ ప్రొడక్షన్, టెక్స్‌టైల్ టెస్టింగ్, స్టాటిస్టికల్ టూల్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్, టెక్స్‌టైల్ మ్యాథమెటిక్స్, నిట్టింగ్ అండ్ నాన్-ఒవెన్ టెక్నాలజీకు సంబంధించిన అంశాలు.
- **జియాలజీ:** జియో మార్ఫాలజీ అండ్ ఫీల్డ్ జియాలజీ, మినరాలజీ అండ్ ఆప్టికల్ మినరాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, అండ్ జియోటెక్టానిక్స్, జియో కెమిస్ట్రీ, మెటామార్ఫిక్ పెట్రోలజీ అండ్ థర్మోడైనమిక్స్, సెడిమెంటాలజీ అండ్ పెట్రోలియం జియాలజీ, తదితర అంశాలు.
- **ఫార్మసీ:** మెథడ్స్ ఆఫ్ స్టెరిలైజేషన్, మెథడ్స్ ఆఫ్ క్లాసిఫికేషన్ ఆఫ్ క్రూడ్ డ్రగ్స్, సెకండరీ మెటబాలిక్స్, డ్రగ్ డిస్కవరీ అండ్ క్లినికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ న్యూ డ్రగ్స్, ఫార్మకాలజీ సంబంధిత అంశాలు.
- **కెమిస్ట్రీ:** ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీలకు సంబంధించిన అంశాలు.
- **ఫిజిక్స్:** మ్యాథమెటికల్ మెథడ్స్ ఆఫ్ ఫిజిక్స్, ఎలక్ట్రోమ్యాగ్నటిక్ థియరీ, క్వాంటమ్ మెకానిక్స్, థర్మోడైనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, అటామిక్ అండ్ మాలిక్యులర్ ఫిజిక్స్, న్యూక్లియర్ అండ్ ప్రాక్టీస్ ఫిజిక్స్ తదితర అంశాలు.
- **మ్యాథమెటిక్స్:** రియల్ అనాలిసిస్, కాంప్లెక్స్ అనాలిసిస్, లీనియర్ అల్జీబ్రా, అల్జీబ్రా, డిఫరెన్షియల్ ఈక్వేషన్‌కు సంబంధించిన అంశాలు.
- **ఇంగ్లిష్:** రైటర్స్ అండ్ టెక్ట్స్, లిటరేచర్, మోడ్రనిజం, ఈఎల్‌టీ ఇన్ ఇండియా, టీచింగ్ లాంగ్వేజ్ స్కిల్స్, టెస్టింగ్ అండ్ ఎవాల్యుయేషన్, ఫొనెటిక్స్ అండ్ ఫొనాలజీ, సింటాక్స్ అండ్ స్ట్రక్చర్ తదితరాలు.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 29 – ఫిబ్రవరి 18, 2024
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్/మేలో నిర్వహించే అవకాశం.
- **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

క్లుప్తంగా...

పిల్‌గా వద్దు.. రిట్‌గా మార్చండి

‘ఉచిత బస్సు’రద్దు పిటిషన్‌పై హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్)ను రిట్ పిటిషన్‌గా మార్చాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. ఆ పథకం కారణంగా ఇబ్బందులు పడుతున్నారన్నది పిటిషనర్ ఉద్దేశమని.. అందులో ప్రజా ప్రయోజనమేమీ లేదని అభిప్రాయపడిన సీజే ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. లింగ వివక్షకు దారితీస్తున్న డిసెంబర్ 8 నాటి ప్రభుత్వ జీవో నంబర్ 47ను కొట్టివేయాలని కోరుతూ నాగోల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి హరేందర్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ‘రోడ్ ట్రాన్స్‌పోర్టు చట్టం–1950 ప్రకారం ఆర్టీసీకి సంబంధించి ఏ నిర్ణయమైనా తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ప్రభుత్వ నిర్ణయం.. లింగ భేదం కారణంగా పురుషులపై వివక్ష చూపడమే అవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15కు ఇది విరుద్ధం. ఉచిత బస్సులు కాకుండా ఇతర బస్సుల్లో ప్రయాణించే మహిళలు, అన్ని బస్సుల్లో ప్రయాణించే పురుషులు కష్టపడి పని చేసి చెల్లిస్తున్న టికెట్ల రుసుముతో ఇతరులకు ఉచిత ప్రయాణం కల్పించడం సరికాదు. ఉచిత ప్రయాణం కారణంగా బస్సుల్లో మహిళలు ముంచెత్తుతున్నారు. టికెట్ కొని ప్రయాణిస్తున్న వారికి సీట్లు కూడా దొరకడం లేదు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని జీవోను కొట్టివేయాలి’.. అని పిటిషన్‌లో పేర్కొన్నారు. త్వరలో ఈ పిటిషన్ విచారణకు రానుంది.

‘మున్సిపల్’ అవిశ్వాసాలపై జోక్యం చేసుకోలేం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలపై జోక్యానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం నిరాకరించింది. పలువురు మున్సిపల్ చైర్మన్లు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. తమపై మున్సిపల్ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ స్వీకరించడం.. అవిశ్వాసం ప్రక్రియ ప్రారంభించడాన్ని ఆపాలని కోరుతూ వి.ప్రణీత(మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ చైర్‌పర్సన్), పిల్లోడి జయమ్మ (సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ చైర్మన్), పోకల జమున (జనగాం చైర్‌పర్సన్), గూడెం మల్లయ్య(సంగారెడ్డి జిల్లా ఆందోల్‌జోగిపేట్ చైర్మన్), మేకల కావ్య (మేయర్, జవహర్‌నగర్ కార్పొరేషన్), వి.శంకరయ్య (యాదాద్రి జిల్లా ఆలేరు చైర్మన్) హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ఆ పిటిషన్లను కొట్టివేశారు. దీంతో సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు ద్విసభ్య ధర్మాసనం వద్ద అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. మున్సిపల్ చట్టం–2019లో అవిశ్వాస తీర్మానం ఆమోదించడానికి తగిన విధానం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానం తర్వాత తీసుకోవాల్సిన చర్యలపైనా స్పష్టత లేదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. అవిశ్వాస ప్రక్రియలో జోక్యం చేసుకోలేమంటూ, అప్పీళ్లను కొట్టివేసింది.

నేటి నుంచి ఇన్‌కాయిస్‌లో అంతర్జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: నేటినుంచి మూడురోజుల పాటు హైదరాబాద్‌లో ‘ఇండియన్ ఓషియన్ రీజినల్ డికెడ్ కాన్ఫరెన్స్–బ్రిడ్జింగ్ బిలియన్స్ టు బార్సిలోనా’సదస్సు జరగనుంది. నగరంలోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్)లో జరగనున్న ఈ సదస్సులో రాబోయే పదేళ్లలో చేపట్టబోయే కార్యకలాపాలకు సంబంధించి హిందూ మహాసముద్రం పరిధిలోని భాగస్వామ్యపక్షాలు, ఇతర స్టేక్ హోల్డర్లను కార్యోన్ముఖులను చేయడం.. తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ సదస్సులో 30 దేశాలకు చెందిన పరిశోధకులు, విధాననిర్ణేతలు, విద్యార్థులు పాల్గొననున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సమస్యలపై అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మోహన్‌నారాయణ, ఎస్.నర్సరాజు వినతి పత్రం సమర్పించారు. కమ్యుటేషన్ పెన్షన్‌ను 15 ఏళ్లకు బదులు 12 ఏళ్లకు కుదించాలని విన్నవించారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యాన్ని అందించేలా చూడాలని కోరారు. డీఏ, డీఆర్‌లను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జూడా అధ్యక్షుడిగా సాయి శ్రీహర్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) అధ్యక్షుడిగా సాయి శ్రీహర్ష నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఐజాక్ న్యూటన్, చైర్‌పర్సన్‌గా శ్రీనాథ్ నియమితులయ్యారు.

‘డిగ్రీ’లో క్రీడా రిజర్వేషన్ ఎక్కడ?

- ‘దోస్త్’లో కనిపించని స్పోర్ట్స్ కాలం.. రిజర్వేషన్ లేక ఏటా 9 వేల మందికి నష్టం!
- తమకు అన్యాయం జరుగుతోందంటున్న క్రీడాకారులు
- ప్రత్యేక జీవో కావాలంటున్న అధికారులు
- సీఎంఓ దృష్టికి సమస్య



సాక్షి, హైదరాబాద్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు డిగ్రీ సీట్లలో రిజర్వేషన్ కల్పించాలన్న నిబంధన కార్యరూపం దాల్చకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. దీనివల్ల ఏటా 9 వేల మంది క్రీడాకారులు నష్టపోతున్నారని క్రీడారంగ నిపుణులు చెపుతున్నారు. ఈ అంశాన్ని ఉన్నత విద్యా మండలి దృష్టికి తెచ్చినా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,080 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిల్లో 4.68 లక్షల సీట్లు అందుబాటులో ఉండగా.. విద్య, ఉద్యోగాల్లో క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా కింద 2 శాతం రిజర్వేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటినుంచో అమలు చేస్తోంది. కానీ ఉన్నత విద్యామండలి అమలు చేస్తున్న ‘దోస్త్’ప్రవేశాల విధానంలో మాత్రం క్రీడాకారులకు కనీసం ఒక్క సీటూ కేటాయించలేదు. అసలు ఆ కాలమే ఎత్తివేయడంపై క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యమేనా..?

దోస్త్‌లో దివ్యాంగులు, ఎన్‌సీసీ నేపథ్యం ఉన్న వారికి ప్రత్యేక రిజర్వేషన్ కల్పించారు. వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ కేంద్రాలూ నిర్వహిస్తున్నారు. అయితే క్రీడాకారుల విషయానికొచ్చే సరికి మాత్రం ప్రభుత్వం జీవో ఇవ్వకపోవడం వల్లే దోస్త్‌లో స్పోర్ట్స్ కోటా పెట్టలేదని అధికారులు చెబుతున్నారు. కాగా, క్రీడారంగ విద్యార్థులు ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారుల అసోసియేషన్లు కూడా ఉన్నత విద్యామండలికి అనేక సార్లు విజ్ఞప్తి చేశాయని, అయినా పట్టించుకోవడంలేదని అంటున్నారు. అన్నివిభాగాలతో పాటు క్రీడాకారులకూ 2 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పుడు మళ్లీ ప్రత్యేకంగా జీవో ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇది కేవలం ఉన్నత విద్యామండలి అధికారుల నిర్లక్ష్యం వల్లే జరుగుతోందని చెబుతున్నారు.

న్యాయం జరిగేనా..?

డిగ్రీ కోర్సుల్లో తమకు రిజర్వేషన్ కల్పించాలని ఇటీవల కొంతమంది క్రీడాకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏటా తమకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం దీనిపై దృష్టి పెట్టిందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్నతాధికారుల నుంచి సీఎం కార్యాలయం సమాచారం సేకరిస్తోంది. డిగ్రీలో క్రీడాకారుల కోటా అమలుకు జీవో ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అధికారుల వాదన మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించింది. త్వరలో దీనిపై ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ఫాస్టాగ్ కేవైసీకి గడువు పెంపు

న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై ఎలక్ట్రానిక్ టోల్ వసూళ్లలో భాగంగా అమలుచేస్తున్న ఫాస్టాగ్‌లకు కేవైసీలను పూర్తిచేయడానికి గడువును మరో నెల పెంచుతున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అనుబంధ ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ బుధవారం ప్రకటించింది. ఫాస్టాగ్‌లో నగదు బ్యాలెన్స్ ఉన్నాసరే కేవైసీ అసంపూర్ణంగా ఉంటే ఆయా ఫాస్టాగ్‌లను జనవరి 31వ తేదీ తర్వాత డీయాక్టివేట్ చేస్తామని జనవరి 15వ తేదీన ప్రకటించిన విషయం తెల్సిందే. అయితే కొద్దిసంఖ్యలోనే ఫాస్టాగ్‌లు కేవైసీ పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఈ గడువును పెంచారు. ఒక్క ఫాస్టాగ్‌నే చాలా వాహనాలకు వాడటం, ఒక వాహనం పేరిట తీసుకున్న ఫాస్టాగ్‌ను వేరే రకం వాహనానికి దుర్వినియోగం చేయడం వంటి అక్రమాలకు చెక్‌పెట్టేందుకు ‘ఒక వాహనానికి ఒక్కటే ఫాస్టాగ్’ విధానాన్ని అమలుచేయనున్నారు.

16వ ఆర్థిక సంఘం సభ్యుల నియామకం

సాక్షి, న్యూఢిల్లీ: 16వ ఆర్థిక సంఘం సభ్యుల నియామకంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. గతేడాది డిసెంబరు 31వ తేదీన నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియా అధ్యక్షతన 16వ ఆర్థిక సంఘం ఏర్పాటైన విషయం తెల్సిందే. తాజాగా నలుగురు సభ్యులను నియమించారు. ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి, గత ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ నారాయణ్ ఝా, ఎస్‌బీఐ గ్రూప్ ప్రధాన ఆర్థిక సలహాదారు సౌమ్య కాంతి ఘోష్, ఆర్థిక శాఖ వ్యయ విభాగం మాజీ ప్రత్యేక కార్యదర్శి అన్నీ జార్జ్ మాథ్యూ, అర్థ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిరంజన్ రాజాధ్యక్షను సభ్యులుగా నియమిస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది.



పెద్దపల్లి జిల్లాలో వెలుగు చూసిన పెద్ద పడిగె రాయిని చూపిస్తున్న రవీందర్ రెడ్డి, డాక్టర్ మురళీధర్ రెడ్డి, శ్రీరామోజు హరగోపాల్ తదితరులు

పెద్దపల్లి జిల్లాలో అతిపెద్ద పడిగె రాయి

పంజగుట్ట(హైదరాబాద్): పెద్దపల్లిలో జిల్లాలో అతి పెద్ద పడిగె రాయి వెలుగు చూసింది. పాము పడిగె ఆకారంలో ఉన్న ఈ ఇసుకరాతి గుహను ఫొటో జర్నలిస్టు, చరిత్రబృందం గౌరవ సలహాదారు దుగ్గెంపూడి రవీందర్‌రెడ్డి కనుక్కున్నారు. ఇది 50 అడుగుల ఎత్తు, 1000 అడుగుల పొడవులో ఉంది. ఆయన చరిత్రబృందం సలహాదారులు, రాతి చిత్రాల నిపుణుడు డాక్టర్ బండి మురళీధర్‌రెడ్డి, చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్‌ను తీసుకెళ్లి పరిశోధన చేయగా, మరెన్నో విషయాలు వెలుగుచూశాయి. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో అక్కడి విశేషాలను వారు వివరించారు. పెద్దపల్లి జిల్లా గట్టు సింగారం గ్రామానికి ఆనుకొని ఉన్న దట్టమైన అటవీప్రాంతంలో ఈ రాయిని కనుగొన్నారు. పడగ ఆకారంలో ఉన్న రాతిచిత్రాల శిలాశ్రయం కింద సుమారు వెయ్యిమంది ఉండొచ్చని, దీనిపై అందమైన చిత్రాలు గీసి ఉన్నాయని, అవి మధ్యరాతి యుగం నుంచి, తొలిచారిత్రక యుగం వరకు వేసినవని చెప్పారు. ఈ చిత్రాలు ఎక్కువగా ఎరుపురంగులో, కొన్నిచోట్ల తెలుపు, పసుపు రంగులో ఉన్నాయని, ఇవి ఎంతో ప్రత్యేకమైనవని, ఇటువంటి రాతిచిత్రాలు ఎక్కడా లభించలేదన్నారు. ఈ రాతిచిత్రాల్లో స్త్రీ, పురుషులు ప్రత్యేకమైన ఆహార్యం, పాదరక్షలతో, ఒక పంక్తిలో గుండ్రంగా చేతులు పట్టుకొని సామూహిక నృత్యాలు చేస్తున్నారని, ఒక చిత్రంలో సుమారు 20 మంది వరకు నృత్యాలు చేస్తుండగా, మరో చిత్రంలో ఐదుగురు ఉన్నారని చెప్పారు. జంతువుల చిత్రాల్లో జింకలు, ఇర్రులు, తాబేళ్లు, అడవిపిల్లి, కోతులు, అడవిబల్లులు ఉన్నాయన్నారు. రాతి చిత్రాలే కాకుండా చెక్కినవి ఎరుపురంగులో వేసిన ఐదు శాతవాహన కాలపు శాసనాలు, విష్ణుకుండినుల కాలం నాటి శాసనం దొరికిందన్నారు. ఈ రాతిచిత్రాల అడుగున పదులకొద్ది సూక్ష్మరాతి పనిముట్లు, పురాతన మానవుల రాతి చేతిగొడ్డలి గుర్తించామని, ఈ ప్రాంతంలో ఒక కండశిల (కోర్ మెటీరియల్) దొరికిందని ఇదే రాతిచిత్రాల వయస్సు నిర్ణయించేందుకు ప్రధానమైన ఆధారమని తెలిపారు. దీనిని చూస్తుంటే ఇంకా బయటకు రాని చరిత్ర ఎంతో దాగి ఉందని అర్థమవుతుందని, అన్నీ తెలుసుకొని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్రకారులు గిరీష్, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

‘బెస్ట్ ఠాణా’లో 85 మంది బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్ల నిర్వహణ, పనితీరును బేరీజు వేస్తూ బెస్ట్ ఠాణా అవార్డులు ఇవ్వడాన్ని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆ ఏడాది నుంచే ప్రారంభించింది. ఆ ఏడాది ఈ పోలీస్‌స్టేషన్ దేశంలోనే రెండో బెస్ట్ ఠాణాగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలోనే నగరంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీసుఅకాడమీలో శిక్షణ పొందుతున్న ఐపీఎస్‌లతో పాటు ఇక్కడ పర్యటనకు వచ్చిన వివిధ రాష్ట్రాల, దేశాల మంత్రులు, అధికారులకు ఈ మోడల్ ఠాణా చూపించేవారు. దాదాపు మూడునాలుగేళ్ల వరకు ఈ క్రేజ్ కొనసాగింది.

ఇటీవల కాలంలో వరుస వివాదాలు

కొందరు అధికారుల వ్యవహారశైలి, సిబ్బంది కక్కుర్తి వెరసి ఈ ఠాణా వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. ఇటీవల కాలంలో చోటు చేసుకున్న వరుస ఘటనలు కూడా దీని ప్రతిష్టను మసకబారేలా చేశాయి.

- ➤ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ ‘రోడ్డు ప్రమాదం–ఎస్కేప్’ఎపిసోడ్‌లో ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బి.దుర్గారావుపై సస్పెన్షన్ వేటు పడటం, ఆయన ఇదే కేసులో నిందితుడిగా మారడంతోపాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ అరెస్టు కావడం తీవ్ర విమర్శలకు దారితీసింది.
- ➤ మద్యం తాగి వాహనం నడుపుతూ ఈ పోలీసులకు చిక్కిన ఇద్దరు ఠాణా నుంచి తప్పించుకున్నారు. గత వారం మద్యం మత్తులో వాహనం నడుపుతూ బీభత్సం సృష్టించిన పాతబస్తీకి చెందిన ఓ యువకుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ నుంచి అతడు ఎస్కేప్ అయ్యాడు.
- ➤ నిందితుల అరెస్టు, నోటీసుల జారీ, కోర్టుకు తరలింపు, నాన్‌బెయిలబుల్ వారెంట్ల (ఎన్‌బీడబ్ల్యూ) ఎగ్జిక్యూషన్.. ఇలా ప్రతి దాంట్లో అవినీతి ఉందని ఉన్నతాధికారులు గుర్తించారు.
- ➤ గత ప్రభుత్వ పెద్దలు, నగరానికి మాజీలు అయిన ఉన్నతాధికారులకు ఈ ఠాణా నుంచి కీలక సమాచారంపై లీకులు వెళుతున్నట్లు తేలింది.

సీరియస్‌గా తీసుకున్న సీపీ

పంజగుట్ట పీఎస్ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సమగ్ర విచారణ జరిపే బాధ్యతను డీసీపీ విజయ్‌కుమార్‌కు అప్పగించారు. పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ సహాయంతో వివిధ కోణాల్లో ఆరా తీశారు. ఈ ఠాణాలో పనిచేస్తున్న సిబ్బందిలో అత్యధికులు విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి, ఏమరుపాటు నిండిపోయాయని గుర్తించారు. ఇక్కడ పనిచేస్తున్న వారిలో దాదాపు 90 శాతం పైరవీలతో వచ్చిన వారే కావడంతో సరైన పర్యవేక్షణ కొరవడిందని వెలుగులోకి వచ్చింది. దీంతో ఒకేసారి 85 మందిని బదిలీ చేశారు. వీరిని మరో ఠాణాకు పంపకుండా పనిష్మెంట్ కింద సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. బదిలీ అయిన వారి స్థానంలో వివిధ ఠాణాల నుంచి 82 మంది కొత్తవారిని నియమించారు. వేటుపడిన వారిలో ఆరుగురు ఎస్‌ఐలు ఎనిమిది మంది ఏఎస్‌ఐలు, 17 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 54 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. రహీల్ ఎస్కేప్ ఎపిసోడ్‌లో సస్పెండ్ అయిన ఇన్‌స్పెక్టర్ బి.దుర్గారావు పరారు కావడానికి, ఈ ఠాణా సిబ్బంది నుంచి వెళ్లిన సమాచారమే కారణమని ఉన్నతాధికారులు తేల్చారు. ఆ కేసులో నిందితుడిగా మార్చినట్టు దుర్గారావుకు ఈ ఠాణా నుంచే సమాచారం అందిందని అధికారులు ఆధారాలు కూడా సేకరించారు.

శభాష్... మల్లేశం

- చార్జింగ్ బైక్ తయారుచేసిన గ్రామీణ ఎలక్ట్రీషియన్
- మూడు గంటల చార్జింగ్‌తో 60 కిలోమీటర్ల ప్రయాణం



బ్యాటరీతో తయారు చేసిన బైక్ (ఇన్‌సెట్‌లో) మల్లేశం

చెన్నారావుపేట: తన మదిలో మెదిలిన ఆలోచనతో ఓ గ్రామీణ ఎలక్ట్రీషియన్ బ్యాటరీతో నడిచే ద్విచక్ర వాహనాన్ని తయారు చేశారు. మూడు గంటల చార్జింగ్‌తో 60 కిలోమీటర్లు ప్రయాణించేలా బైక్ తయారు చేసి ఔరా అనిపించాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కోనాపురం గ్రామానికి చెందిన అనుమాండ్ల మల్లేశం ఎలక్ట్రీషియన్. వైండింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక స్తోమత కారణంగా బ్యాటరీ బైక్ కొనలేక తానే ఓ బైక్ తయారు చేయాలనుకున్నాడు. మనసులో ఆలోచన వచ్చిన వెంటనే రూ.3,500తో బజాజ్ 100సీసీ పాత బైక్‌ను కొనుగోలు చేశాడు. దాని ఇంజన్‌ను తొలగించి, రూ.35 వేలతో కొనుగోలు చేసిన 48 వాట్స్, 750 ఓల్టేజీ లిథియం బ్యాటరీని అమర్చాడు. దానికి అనుసంధానంగా రూ.15 వేలతో కొనుగోలు చేసిన 759 వాట్ల మోటార్, కంట్రోలర్లను అమర్చాడు. అనంతరం విద్యుత్ చార్జింగ్ పెట్టి బైక్‌ను నడిపించాడు. ఈ వాహనం తయారు చేయడానికి రెండు నెలల సమయం పట్టిందని, తయారీకి రూ 53,500 ఖర్చు అయిందన్నారు. మూడు గంటలు చార్జింగ్ పెడితే 40 కిలోమీటర్ల వేగంతో 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవచ్చని చెప్పారు. చార్జింగ్ బైక్ ప్రస్తుతం మార్కెట్‌లో రూ.లక్షకు పైగా ధర ఉండటంతో అంత డబ్బు లేక బ్యాటరీ బైక్ రూపొందించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిస్తే చార్జింగ్ బైకులు తయారు చేస్తానని వివరించారు. మల్లేశంను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి పేపర్ లీక్‌లు లేకుండా చూడాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో ఈ దిశగా చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున ఇన్విజిలేటర్లను నియమించడం, మొబైల్ స్క్వాడ్‌లను రంగంలోకి దించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్‌కు 4,78,527 మంది, సెకండియర్‌కు 4,43,993 మంది.. మొత్తం 9,22,520 మంది హాజరవుతున్నారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. థియరీ పరీక్షకు 1,531 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తే, ప్రాక్టికల్స్ కోసం 2,032 కేంద్రాలు ఏర్పాటు చేశారు. బైపీసీ నుంచి 1,04,089 మంది, ఎంపీసీ నుంచి 2,17,714 మంది ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రాక్టికల్స్ కూడా నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష ఈనెల 16న ఉంటుంది. అన్ని గ్రూపుల వారు హాజరుకావాల్సి ఉంటుంది.

ఉత్తర, దక్షిణ డిస్కంలలో డైరెక్టర్ల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల డైరెక్టర్లను ఇటీవల తొలగించడంతో వారి స్థానంలో కొత్త డైరెక్టర్ల నియామకానికి బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. దక్షిణ డిస్కం (ఎస్పీడీసీఎల్–హైదరాబాద్)లో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్), డైరెక్టర్ (ఆపరేషన్), డైరెక్టర్ (కమర్షియల్), డైరెక్టర్ (ఫైనాన్స్) స్థానాలను భర్తీ చేయనుండగా.. ఉత్తర డిస్కం (ఎన్పీడీసీఎల్–వరంగల్)లో డైరెక్టర్ (ఫైనాన్స్), డైరెక్టర్ (హెచ్ఆర్డీ అండ్ ఐఆర్), డైరెక్టర్ (ఆపరేషన్స్), డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) స్థానాలను భర్తీ చేస్తారు. దరఖాస్తులను మార్చి 1లోగా పంపించాలని పేర్కొన్నారు.

ఉదయం క్లిష్టంగా.. సాయంత్రం సులభంగా


నాలుగో రోజు ముగిసిన జేఈఈ మెయిన్ ఇంజనీరింగ్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్ ఇంజనీరింగ్ ఆన్‌లైన్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం రెండు షిఫ్టుల్లో నిర్వహించింది. మొదటి షిఫ్టులో ప్రశ్నపత్రం మోస్తరు క్లిష్టంగా, రెండో షిఫ్టులో ప్రశ్నలు కొంతమేర సులభంగా ఉన్నట్లు విద్యార్థులు, సబ్జెక్టు నిపుణులు తెలిపారు. మొదటి షిఫ్టులో మ్యాథమెటిక్స్ ప్రశ్నలు క్లిష్టంగా ఉండి, సుదీర్ఘంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటిగ్రేషన్, డిటర్మినెంట్స్, డిఫరెన్షియేషన్, సర్కిల్, స్ట్రెయిట్‌లైన్, ప్రాబబిలిటీ, ఎలిప్స్, వెక్టార్ త్రీడీ, డిస్టన్స్ అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్ విభాగం నుంచి అడిగిన ప్రశ్నలు క్లిష్టతతోపాటు కొద్దిపాటి తెలివిగా సమాధానాలు గుర్తించేలా ఉన్నాయని తెలిపారు. ఫిజిక్స్‌లో ఫార్ములా ఆధారిత ప్రశ్నలు ఉన్నాయని విద్యార్థులు వివరించారు. కెమిస్ట్రీ నుంచి సులభమైన ప్రశ్నలు ఇచ్చారని చెప్పారు. ఈ విభాగంలో ఎక్కువగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోంచి ప్రశ్నలు ఇచ్చారు. రెండో షిఫ్టులో.. మ్యాథమెటిక్స్ నుంచి సుదీర్ఘమైన ప్రశ్నలు అడిగినప్పటికీ సులభంగానే ఉన్నట్లు విద్యార్థులు తెలిపారు. ప్రధానంగా ఇంటర్ రెండో సంవత్సరం పుస్తకాల్లోంచే అధిక ప్రశ్నలు ఇచ్చారు. ఈ నెల 24న బీఆర్క్/బీప్లానింగ్ పరీక్షలతో జేఈఈ మెయిన్ –2024 సెషన్–1 పరీక్షలు ప్రారంభంకాగా, శనివారం నుంచి నాలుగు రోజులుగా ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహించారు. గురువారంతో జేఈఈ మెయిన్ సెషన్–1 పరీక్షలు ముగియనున్నాయి.

ఎవరి పరువుకు నష్టం కలిగించేదిగా లేదు

తెలంగాణ హైకోర్టులో ‘వ్యూహం’ నిర్మాత వాదనలు

- చిత్రం చూడకుండా వేసే పిటిషన్లు సమర్థనీయం కాదు
- లోకేశ్‌కు పిటిషన్ వేసే అర్హత లేదన్న నిర్మాత
- అన్ని అంశాలు పరిశీలించాకే సర్టిఫికెట్ : సీబీఎఫ్‌సీ
- తదుపరి వాదనల కోసం విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం చిత్రం ఏ పార్టీ, ఏ వ్యక్తి పరువుకు నష్టం కలిగించేదిగా లేదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) కమిటీ అభిప్రాయపడిందని తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనానికి నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ నివేదించారు. చిత్రం చూడకుండా వేసిన..ఎవరో చెబితే విన్నాం(హియర్ సే ఎవిడెన్స్) అంటూ పిటిషన్ అనుమతించడం సరికాదని.. వ్యక్తిగత పరువు నష్టాన్ని పేర్కొంటూ పార్టీ తరఫున పిటిషన్ వేయడం సమర్థనీయం కాదని చెప్పారు. వ్యూహం చిత్రానికి సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికెట్ రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఈ నెల 22న తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్‌వర్మ తెలంగాణ హైకోర్టులో వేర్వేరుగా అప్పీల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. నిర్మాత తరఫున సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. ‘పిటిషనర్(నారా లోకేశ్)కు ఈ పిటిషన్ వేసే అర్హతే లేదు. తన తండ్రి పరువుకు భంగం కలిగించేదిగా చిత్రం ఉంటుందని ఊహించి టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పిటిషన్ వేయడం చెల్లదు. రాజకీయ పార్టీ అనేది జ్యుడీషియల్ ఎంటిటి(సంస్థ) కాదు. ఎవరి పరువుకు నష్టం వాటిల్లిందని భావిస్తే.. వారే పిటిషన్ వేయాలి. అది కూడా చిత్రం చూశాక సివిల్ కోర్టును ఆశ్రయించాలి. చిత్రం చూడకుండా ట్రయిలర్ చూసి రిట్ కోర్టులను ఆశ్రయించడం చట్టవిరుద్ధం. గతంలో ఇదే అంశాన్ని పలు రాష్ట్రాల హైకోర్టు తేల్చిచెప్పాయి. ఇది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించి బయోపిక్ మాత్రమే. మీడియా సమావేశంలో దర్శకుడు ఈ చిత్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాత్రలు కూడా ఉన్నాయన్నారని, అది తమ రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా, వైఎస్ జగన్‌కు లబ్ధి చేకూరేలా ఉంటుందని పేర్కొనడం ఆశ్చర్యకరం’అని అన్నారు.

రివైజింగ్ కమిటీ అన్ని అంశాలను పరిశీలించింది

‘సీబీఎఫ్‌సీ ఏర్పాటు చేసిన రివైజింగ్ కమిటీ అంతకుముందు టీడీపీ ఫిర్యాదులో పేర్కొన్న అన్ని అంశాలను పరిశీలించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు, గోదావరి పుష్కరాలు.. తదితర అంశాలను పరిశీలించి.. కొన్నిచోట్ల మ్యూట్ చేయాలని చెప్పింది. అందుకు నిర్మాత, దర్శకుడు కూడా అంగీకరించారు. గతంలో ఇదే హైకోర్టు చిత్రం చూడకుండా సైరా నరసింహారెడ్డి, డర్టీ పిక్చర్‌ను అడ్డుకునేందుకు వేసిన పిటిషన్‌లను కొట్టివేసింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేసి, చిత్ర విడుదలకు ఆదేశాలివ్వాలి’అని విజ్ఞప్తి చేశారు.

కమిటీ ఏకగ్రీవ నిర్ణయం

సీబీఎఫ్‌సీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) నరసింహ శర్మ.. ‘రూల్ 22 ప్రకారం ఐదుగురితో కూడిన ఎగ్జామినేషన్ కమిటీ నిలుపుదల చేస్తూ చైర్మన్‌కు నివేదిక అందజేసింది. తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు రివైజింగ్ కమిటీ ఏర్పాటు చేశాం. ఇందులోని 10 సభ్యులు చిత్రాన్ని పూర్తిగా వీక్షించి, ఒకట్రెండు చోట్ల మ్యూట్ చేయాలని చెబుతూ.. యూ సర్టిఫికెట్ జారీ చేసింది. కమిటీ ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుంది. సీబీఎఫ్‌సీ సినిమా చూసి సర్టిఫై చేశాక న్యాయస్థానాల జోక్యం సరికాదు’అని చెప్పారు. రాంగోపాల్‌వర్మ తరఫు న్యాయవాది వాదిస్తూ.. పార్టీ అధ్యక్షుడు కాని పిటిషనర్‌కు అథారిటీ, పిటిషన్ వేసే అర్హత లేదని చెప్పారు. తదుపరి వాదనలను ధర్మాసనం గురువానికి వాయిదా వేసింది.

సోషల్ ఫేమ్‌తో ఇబ్బందులు

ట్రాఫిక్ సమస్య అంటూ కుమారి ఫుడ్‌స్టాల్ మూసివేసిన పోలీసులు

- కోర్టులో స్టే ఉండటంతో ఇతర ఫుడ్ స్టాల్స్ తొలగించలేదని ప్రకటన
- దీనిపై సోషల్ మీడియాలో విపరీతంగా విమర్శలు

ఈ ఫుడ్‌స్టాల్ నడుపుకోవడానికి సీఎం కార్యాలయం గ్రీన్‌సిగ్నల్



సాక్షి, సిటీబ్యూరో/గచ్చిబౌలి: సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం పొందిన ‘కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్’వ్యవహారంలో ట్రాఫిక్ పోలీసుల తీరు చర్చనీయాంశంగా మారింది. ఆ ఫుడ్‌స్టాల్‌తో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందంటూ మూసేయడం, సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు రావడంతో సీఎం కార్యాలయం స్పందించడం, ఫుడ్‌స్టాల్ నిర్వహించుకోవచ్చని పేర్కొనడం గమనార్హం.

రాకపోకలకు ఇబ్బంది అని..

హైదరాబాద్‌లోని నాలెడ్జ్‌సిటీ కోహినూర్ హోటల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న చిన్న ఫుడ్‌స్టాల్‌తో దాసరి సాయికుమారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. చాలా మంది ప్రజలు ఆ ఫుడ్ స్టాల్‌కు క్యూ కట్టారు. పలువురు సినీతారలు కూడా ఈ ఫుడ్‌స్టాల్ వద్దకు వచ్చి సినిమా ప్రమోషన్లు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు వచ్చి తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందంటూ.. కుమారి ఫుడ్‌స్టాల్‌ను మూసేశారు. హోటల్‌ని సామగ్రిని రాయదుర్గం ట్రాఫిక్ పీఎస్‌కు తరలించారు. మరోచోట ఫుడ్‌స్టాల్ నడుపుకోవాలని సూచించారు. దీనిపై కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో తన స్టాల్‌ను మాత్రమే తీసేశారని, మిగతా వారంతా బిజినెస్ చేసుకుంటున్నారని వాపోయారు. మరోవైపు ఆ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లపై ఉన్న మిగతా చిన్న హోటళ్లు, షాపులు యథావిధిగా కొనసాగాయి. దీనిపై సోషల్ మీడియాలో భారీగా విమర్శలు వచ్చాయి. దీంతో కోర్టులో స్టే ఉన్న కారణంగా ఫుడ్‌స్టాల్స్ ఏవీ తొలగించలేదని, ట్రాఫిక్ జామ్‌కు కారణమైందనే కుమారి స్టాల్‌ను తొలగించామని రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. అయినా విమర్శలు తగ్గకపోవడంతో తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. కుమారి ఫుడ్‌స్టాల్‌ను మార్చాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని.. త్వరలోనే కుమారి ఫుడ్ స్టాల్‌ను సీఎం సందర్శిస్తారని ప్రకటించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.